సోమవారం
07 జనవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 289

www.vijayakranthinews.com

విజయక్రాంతి

నిజం నిర్భయం నిష్పక్షం

హైదరాబాద్ | PUBLISHED SIMULTANEOUSLY FROM HYDERABAD, NIZAMABAD, KHAMMAM | VIJAYAKRANTHINEWS | రూ. 3.00



దీపికపదుకొనే డాట్‌కాం 10

శబరిమల ఉద్రిక్తతలపై

నివేదిక ఇవ్వండి

- కేరళ ప్రభుత్వాన్ని కోరిన కేంద్ర హోంశాఖ

న్యూఢిల్లీ: ఆందోళనలతో కేరళ అట్టుడుగుతోంది. గత బుధవారం పవిత్ర శబరిమల ఆలయంలోకి 50 ఏళ్లలోపు ఇద్దరు మహిళలు ప్రవేశించి అయ్యప్ప స్వామిని దర్శించుకున్న నేపథ్యంలో శబరిమల కర్మ సమితితోపాటు బీజేపీ, పలు హిందూ సంస్థలు బంద్‌తోపాటు ఆందోళనలకు పిలుపునిచ్చాయి. దీంతో గత నాలుగు రోజులుగా ఆ రాష్ట్రమంతా అల్లర్లు చెలరేగడంతోపాటు పలు హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయి. అధికార సీపీఎంతోపాటు బీజేపీ నేతల ఇళ్లపై ఆందోళనకారులు నాటు బాంబులతో దాడులు చేయడంతో పాటు ఓ సీపీఎం కార్యకర్త కత్తుపోట్లకు మృతిచెందగంతో ఉద్రిక్తతలు మరింతగా పెరిగాయి. దీంతో కేరళలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ఆందోళనలపై కేంద్రం స్పందించింది. వీటిపై పూర్తి నివేదిక సమర్పించాలని కేరళ ప్రభుత్వాన్ని కేంద్ర హోంశాఖ కోరింది. సీపీఎం, బీజేపీ నేతల ఇళ్లపై జరిగిన దాడులకు దారి తీసిన పరిస్థితులు కూడా నివేదికలో పేర్కొనాలని సూచించింది. మరోవైపు కేరళలో తాజా ఉద్రిక్త పరిస్థితులు, హింసాత్మక ఘటనలు, ఆస్తి నష్టాలకు సంబంధించి ఆ రాష్ట్ర గవర్నర్ పి.సదాశివం శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివరాలు కోరారు. అనంతరం శనివారం ఆయన కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి రాష్ట్రంలో నెలకొన్న శాంతి భద్రతల పరిస్థితిని వివరించారు. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి నివేదికను కేంద్ర హోంశాఖ కోరింది.

ఉద్రిక్తతలు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల సృష్టే: సీఎం విజయన్

కాగా కేరళలో ఆందోళనలు నియంత్రించడంలో పోలీసులు పూర్తిగా (తరువాయి 4లో)



ఫిబ్రవరిలో ఓటాన్ అకౌంట్



- మే నెలలో పూర్తిస్థాయి బడ్జెట్
- ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదన
- కేంద్రం విధానాన్ని అనుసరించే యోచన
- పూర్తిగా ఏర్పడని రాష్ట్ర మంత్రివర్గం
- బడ్జెట్ తయారీకి మరింతగా సమయం
- వరుస ఎన్నికలు మరో కారణం

విజయక్రాంతి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభలో 2019–20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని రాష్ట్రప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఫిబ్రవరిలో శాసనసభను కొద్దిరోజులు సమావేశపర్చి రానున్న ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం వ్యయానికి సంబంధించి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ఆమోదించాలని, పార్లమెంట్ ఎన్నికల అనంతరం మే నెలలో పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని అధికారులు సూత్రప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతుందని వస్తున్న వార్తలకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్‌కు సంబంధించి అధ్యయనం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి ఆదేశాలపై గత వారం రోజులుగా అధ్యయనం చేసిన అధికారులు ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, ఆదాయ వ్యయాలు, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, శాఖలవారీగా బడ్జెట్ కేటాయింపులు తదితర అంశాలపై కసరత్తు చేయటానికి చాలా సమయం పడుతుందన్నారు. అదేవిధంగా కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రవేశపెట్టే మొదటి బడ్జెట్ కావటంతో ప్రభుత్వ ప్రాధాన్యాలు స్పష్టం చేయాల్సి ఉన్నందున పూర్తిస్థాయి బడ్జెట్ తయారీకి ప్రస్తుతం ఉన్న సమయం సరిపోదని అభిప్రాయపడ్డారు. దీంతో ముందుగా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టి తదుపరి పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టడం మంచిదని అధికారులు ప్రతిపాదించినట్లు తెలిసింది. ఈ ప్రతిపాదనను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి ఆయన ఆమోదం తర్వాత తుది నిర్ణయం వెలువడుతుందని ఆర్థికశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలియజేశారు. అయితే ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభమవుతున్న శాసనసభ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగిస్తున్నందున ఇదే సమావేశంలో ఓటాన్ అకౌంట్‌ను కూడా ప్రవేశపెట్టాలని ఉన్నతాధికారులు చర్చించినట్లు సమాచారం. అయితే ఫిబ్రవరి నెలలో ఒకటి రెండు రోజులు శాసనసభను సమావేశపర్చి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం మేలని ఆర్థికశాఖ అధికారులు ఒక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. దీంతో ముఖ్యమంత్రితో సమావేశం అయిన తర్వాత ఫిబ్రవరి నెలలో ఎప్పుడు ప్రవేశపెట్టాలన్నదానిపై నిర్ణయం జరుగుతుందని తెలుస్తోంది.

వరుస ఎన్నికలే కారణం

ప్రస్తుతం రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ కావడంతో ఈ నెల 31వ తేదీకి ఈ ఘట్టం పూర్తికానుంది. దాని తర్వాత పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండటం, అలాగే సహకార ఎన్నికల నిర్వహణకు కూడా అధికారుల స్థాయిలో ఏర్పాట్లు జరుగుతుండటంతో బడ్జెట్‌కి సంబంధించి మొదట ఓటాన్ అకౌంట్‌ను ప్రవేశపెట్టడమే మంచిదని అధికారులు ఒక అంచనాకు వచ్చారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపబడుతున్న సాగునీటి ప్రాజెక్టులకు 25 వేల కోట్ల రూపాయలకుపైగా కేటాయించాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తూ ఈ నిధుల కోసం బ్యాంకుల వంటి ఆర్థిక సంస్థలను సంప్రదిస్తుండటం, రాష్ట్రంలో కొత్తగా అమలు చేయతలపెట్టన అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు భారీగా కేటాయించవలసి రావటం, దాంతోపాటు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన పెన్షన్‌ల పథకం, నిరుద్యోగ భృతి తదితర పథకాల అమలుపై మార్గదర్శకాలు జారీ చేయడానికి మరికొంత సమయం పడుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. వీటితోపాటు కేంద్ర వాటాకింద రావాల్సిన నిధులు ప్రతి ఏటా పెరుగుతుంటాయని, ఆ నిధుల వివరాలు కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే పూర్తిస్థాయి బడ్జెట్‌లోనే తెలుస్తాయని వాటికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కేటాయింపులు జరపాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఓటాన్‌అకౌంట్ బడ్జెట్లు ప్రవేశపెట్టడం కొత్తేమీ కాదని, ఆర్థిక సంవత్సరానికి ముందు ఎన్నికలు నిర్వహించినప్పుడల్లా కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు తొలుత ఓటాన్ అకౌంట్‌ను ప్రవేశపెట్టి అనంతరం తమ ప్రభుత్వ ప్రాధాన్యానికి అనుగుణంగా పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడతాయని అధికారులు ఉదహరిస్తున్నారు. దీంతోబాటు ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గంలో ముఖ్యమంత్రితోపాటు మహమూద్ అలీ ఒక్కరే కేబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. అయితే పూర్తిస్థాయిలో మంత్రివర్గం ఏర్పాటు కాలేదు. కాగా ప్రతి మంత్రి తమ శాఖల అధికారులతో (తరువాయి 4లో)

నా పేరు మీద

సంఘాలొద్దు: కేటీఆర్



విజయక్రాంతి, హైదరాబాద్: తన పేరు మీద ఏర్పాటు చేస్తున్న వివిధ సంఘాలు, యువసేనలు, అభిమాన సంఘాలకు తన వైపు నుంచి ఎలాంటి మద్దతు లేదని తెలంగాణ రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షులు కే.టీ. రామారావు స్పష్టం చేశారు. కేటీఆర్ యువసేన, కేటీఆర్ సేవాదళ్, కేటీఆర్ అభిమాన సంఘం వంటి పేర్లతో పలువురు సంఘాలను ఏర్పాటు చేసినట్లు తన దృష్టికి వచ్చిందని, ఇలాంటి వాటిని తాను ఏమాత్రం ఆమోదించనని ఆయన తెలిపారు. తన పైన, పార్టీ పైన అభిమానంతో ఏర్పాటు చేసే సంఘాలకు సైతం తన ఆమోదం లేదని, ఇప్పటికే పలు జిల్లాల్లో ఏర్పాటు చేసిన సంఘాలను వెంటనే రద్దు చేసుకోవాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. దీంతో పాటు ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో ను కేటిఆర్ యువసేన, కేటిఆర్ అభిమాన సంఘం వంటి వివిధ పేర్లతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారు సైతం వాటిని వెంటనే ఆపేయాలని కోరారు. పార్టీ పైన, తన పైన అభిమానం ఉంటే కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీతో కానీ, పార్టీ అనుబంధ సంఘాలతో కానీ కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా కేటీఆర్ పేర్కొన్నారు. కేటీఆర్ యువసేన పేరుతో తనను కలిసిన పలువురు కార్యకర్తలను ఈ సందర్భంగా మంత్రి సంఘాన్ని రద్దు చేసుకోవాల్సిందిగా కోరారు. వారందరిని టీఆర్‌ఎస్‌లో కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- పది మంది భక్తుల దుర్మరణం
- భారీ కంటైనర్ ఢీ కొట్టడమే కారణం
- మృతులంతా మెదక్ జిల్లా వాసులు
- కన్నీరు మున్నీరవుతున్న గ్రామస్తులు

8

'శబరిమల'పై

కమ్యూనిస్టుల కుట్ర

- దత్తాత్రేయ విమర్శ



విజయక్రాంతి, హైదరాబాద్: శబరిమల అంశంపై కమ్యూనిస్టులు కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ ఎంపీ బండారు దత్తాత్రేయ ఆరోపించారు. దేశవ్యాప్తంగా ప్రభావం కోల్పోతున్న కమ్యూనిస్టులు ప్రాభవం కోసం శబరిమలలో అల్లర్లు సృష్టించి, హింసను ప్రేరేపిస్తున్నారని ఆయన విమర్శించారు. కావాలనే మహిళలను దగ్గరుండి మరీ అయ్యప్ప సన్నిధికి పంపిస్తున్నారని, పైగా కేరళలో కేంద్ర ప్రభుత్వమే అల్లర్లు జరిగే విధంగా కుట్రలు పన్నుతోందని ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. బీజేపీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో దత్తాత్రేయ మాట్లాడారు. కావాలనే హిందూ భక్తుల మనోభావాలను కేరళలోని కమ్యూనిస్టు ప్రభుత్వం దెబ్బతీస్తోందన్నారు. రాబోయే ఎన్నికల్లో కమ్యూనిస్టులకు కేరళలో ఎదురుదెబ్బలు తప్పవని ఆయన హెచ్చరించారు. మకరజ్యోతి దర్శనం కోసం దేశవ్యాప్తంగా అయ్యప్ప భక్తులు శబరిమలకు వెళ్తున్నారని, అక్కడ ప్రశాంతం (తరువాయి 4లో)

రక్షణమంత్రి

మాటలన్నీ అబద్ధాలే..

- ఆధారాలు చూపాలి లేదా.. రాజీనామా చేయాలి
- రాహుల్ గాంధీ డిమాండ్
- వార్తా కథనాన్ని పూర్తిగా చదివి క్షమాపణ చెప్పండి..
- నిర్మలా సీతారామన్ కౌంటర్





న్యూఢిల్లీ : రఫేల్ ఒప్పందంపై పార్లమెంట్‌లో అబద్ధాలు చెప్పిన రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన ఆదివారం ట్వీట్ చేశారు. 'ఒక అబద్ధం చెబితే, దానిని కప్పిపుచ్చేందుకు మరిన్ని అబద్ధాలను సృష్టించవలసి ఉంటుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందం విషయంలో చెప్పిన అబద్ధాలను సమర్థించే ఆత్రుతలో రక్షణ మంత్రి పార్లమెంటులో అబద్ధాలు చెప్పారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్)కు ప్రభుత్వం ఇచ్చిన లక్ష కోట్ల రూపాయల విలువైన ఆర్డర్స్‌కు సంబంధించిన పత్రాలను సోమవారం ఆమె పార్లమెంటులో ప్రవేశపెట్టాలి. లేనిపక్షంలో ఆమె తన పదవికి రాజీనామా చేయాలి..' అని రాహుల్ గాంధీ ట్విట్టర్ ద్వారా డిమాండ్ చేశారు. లోక్‌సభలో నిర్మలా సీతారామన్ ప్రకటించిన రూ. లక్ష కోట్ల ఆర్డర్ల కోసం హెచ్‌ఏఎల్ వేచిచూస్తోందని టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం ఆధారంగా రక్షణ మంత్రిని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. రక్షణ శాఖ నుంచి తమకు ఒక్క ఆర్డర్ కూడా రాలేదని, రూపాయి కూడా కంపెనీకి విడుదల కాలేదని హెచ్‌ఏఎల్‌కు చెందిన సీనియర్ అధికారి చెప్పినట్లు ఆ కథనంలో పేర్కొనడాన్ని రాహుల్ తన ట్వీట్‌లో పోస్ట్ చేశారు.

రాహుల్ తప్పుదారి పట్టిస్తున్నారు... క్షమాపణ చెప్పి రాజీనామా చేస్తారా?: నిర్మలా సీతారామన్

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్)కు ప్రభుత్వ ఆర్డర్లపై లోక్‌సభలో తాను చేసిన ప్రకటనకు సంబంధించి రాహుల్ గాంధీ దేశ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ ఆరోపించారు. దీనిపై ఆయన సిగ్గుపడాలని ఆమె విమర్శించారు. (తరువాయి 4లో)

67 మంది విద్యార్థినులకు

అస్వస్థత

విజయక్రాంతి, చెవేళ్ల: కస్తూర్బాగాంధీ వసతి గృహంలో ఉంటున్న 67 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలో కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహంలో ఉంటున్న విద్యార్థినులకు ఆదివారం ఉదయం కడుపునొప్పి, వాంతులు మొదలయ్యాయి. విషయం గమనించిన ఉపాధ్యాయులు వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వసతి గృహం నిర్వాహకులు శనివారం రాత్రి విద్యార్థినులకు ఫ్రూట్ సలాడ్‌ను ఇచ్చారని, అది తాగిన కారణంగానే వారు అస్వస్థతకు గురైనట్లు వైద్యులు అనుమానిస్తున్నారు. 20 మంది విద్యార్థినులకు తీవ్రమైన విరేచనాలు కావడంతో వారిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు ఫుడ్ పాయిజనే కారణం కావొచ్చని, ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నామని చేవెళ్ల సీఐ గురవయ్య గౌడ్ తెలిపారు. ఈ వసతి గృహంలో మొత్తం 200 మంది విద్యార్థులు ఉంటున్నారు. కాగా ఈ సంఘటన తెలుసుకున్న పలు విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. విద్యార్థులకు నాసిరకం భోజనం పెట్టడంతోనే ఇలా అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు సంఘాల నాయకులు పరామర్శించారు.



కొడుకు కోసమే..

కాంగ్రెస్ ముందు బాబు మోకరిల్లారు

- యువత చేతుల్లోనే ఆంధ్రా భవిష్యత్తు
- ఏపీ కార్యకర్తలతో ప్రధాని మోడీ



విజయక్రాంతి, హైదరాబాద్: 'కేవలం కొడుకు భవిష్యత్ కోసం కాంగ్రెస్ ముందు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మోకరిల్లారని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎద్దేవా చేసారు. ఆంధ్రప్రదేశ్‌లోని కడప, కర్నూల్, తిరుపతి, అనంతపూర్, నర్సారావుపేటకు చెందిన బీజేపీ బూత్ కార్యకర్తలతో ఆయన ముచ్చటించారు. వారడిగిన పలు ప్రశ్నలకు ఆయన జవాబిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలకు ఆయన భరోసా ఇచ్చారు. దేశం భవిష్యత్ కోసం పని చేస్తున్న బీజేపీ కార్యకర్తలను చంద్రబాబు కాదు కదా.. ఎవరూ ఏమి చేయలేరని స్పష్టం చేశారు. ఎన్టీఆర్‌ను చంద్రబాబు రెండుమార్లు మోసం చేశారని ఆయన తెలిపారు. మొదటిసారి ఆయనను పదవిలోంచి కిందికి దించి, టీడీపీని స్వాధీనం చేసుకొని ముఖ్యమంత్రి పదవి అధిష్టాంచారన్నారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తెలుగువారి ఆత్మగౌరవం కోసం ఎన్టీఆర్ టీడీపీని ఏర్పాటు చేస్తే.. తన కొడుకు భవిష్యత్ కోసం అదే కాంగ్రెస్ ముందు మోకరిల్లారని విమర్శించారు. రెండుమార్లు మోసం చేసిన వాళ్ల నుంచి గొప్ప పనులు ఆశించలేమన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి యువత చేతులలో ఉందని, యువత ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ కార్యకర్తలను బెదరించడం ఎవరితరం కాదన్నారు. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా వెన్ను చూపకుండా ఎదుర్కొనే శక్తి బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు ఉన్నదని చెప్పారు. ఇటీవల కేరళ ఎంపీ మురళీధరన్ ఇంటిపై జరిగిన బాంబుదాడిని ప్రస్తావిస్తూ ఆయన ఇంటిపై బాంబు దాడులు జరిగినా.. పార్టీ కోసం కలిసి పని చేస్తున్నారని చెప్పారు. ప్రజల మనసులో స్థానం సంపాదించుకోలేని రాజకీయ నాయకులు అసహనంతో చేసే బెదిరింపులకు భరతమాత సేవలో ఉండే బీజేపీ కార్యకర్తలు భయపడరని తేల్చి చెప్పారు. రఫేల్ కొనుగోలు ఒప్పందంపై మాట్లాడుతూ దేశభద్రత కోసం మనం పని చేస్తామని చెప్పుకొచ్చారు. రక్షణ కోసమే రఫేల్ ఒప్పందం జరిగిందన్నారు. ఈ అంశంపై కాంగ్రెస్ అసత్యాలు ప్రచారం చేస్తోందన్నారు. కాంగ్రెస్ చేసిన ఆరోపణలను రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంట్‌లో సమర్థవంతంగా తిప్పికొట్టారని ప్రశంసించారు. వచ్చే ఎన్నికల్లో బూత్ స్థాయి కార్యకర్తలందరూ పార్టీ గెలుపుకోసం పాటుపడాలని పిలుపునిచ్చారు.

18న అమిత్ షా రాక

ఈ నెల 18న బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఆంధ్రప్రదేశ్ పర్యటనకు రానున్నారు. ఇందులో భాగంగా రాయలసీమ జిల్లాలో నిర్వహించే సభలో ఆయన మాట్లాడనున్నారు.

దిమాక్ ఖరాబ్



సీబీఐ విచారణకు సిద్ధం

- కేంద్ర దర్యాప్తు సంస్థలు దుర్వినియోగం
- ప్రజలకు సమాధానం ఇచ్చేందుకు బీజేపీ సిద్ధమేనా?
- అక్రమ ఇసుక తవ్వకాల ఆరోపణలపై అఖిలేష్ స్పందన





లక్నో: సీబీఐ విచారణకు తాను సిద్ధమని సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు, యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ స్పష్టం చేశారు. రాజకీయ ప్రేరేపితం వల్లే సమాజ్ వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ నేతలతో పాటు పలువురు ఐఏఎస్ అధికారులపై కేంద్ర దర్యాప్తు సంస్థ దాడులు చేస్తోందని ఆయన ఆరోపించారు. బీజేపీ కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగపరిచే సంస్కృతికి పాల్పడుతోందని, దీనిపై ప్రజలకు సమాధానం ఇచ్చేందుకు ఆ పార్టీ సంసిద్ధమేనా అని ప్రశ్నించారు. 2012–2016 మధ్య కాలంలో ఉత్తరప్రదేశ్‌లో అక్రమ ఇసుక తవ్వకాలపై సీబీఐ దర్యాప్తు జరపబోతున్నట్లు వచ్చిన వార్తలపై అఖిలేష్ యాదవ్ స్పందించారు. ఆదివారం ఆయన దీనిపై మీడియాతో మాట్లాడారు. ఇది పాత కేసేనని, అయినా తాను సీబీఐ దర్యాప్తును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. (తరువాయి 4లో)

ఆయనుంటే.. అసెంబ్లీలో అడుగు పెట్టను

- ప్రమాణ స్వీకారం చేయను
- బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్



విజయక్రాంతి, హైదరాబాద్: నిత్యం వార్తల్లో నిలిచే ఎమ్మెల్యే టీ రాజాసింగ్. వివాదస్పద ప్రకటనలు చేస్తూ.. హిందుత్వవాదిగా ముద్రపడ్డారు. అలాంటి ఆయన సంచలన నిర్ణయం తీసుకున్నారు. హిందూ ధర్మాన్ని వ్యతిరేకించే ఎంఐఎం ఎమ్మెల్యేను ప్రొటెం స్పీకర్‌గా ఎంపిక చేసినందున తాను అసెంబ్లీలో అడుగపెట్టనని, ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయనని ప్రకటించారు. "ప్రొటెం స్పీకర్‌గా ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్‌ఖాన్‌ను ఎంపిక చేసినందున తాను ప్రమాణ స్వీకారం చేయను.

అసెంబ్లీలో కూ డా అడుగుపెట్టను." అని బీజేపీ ఎమ్మెల్యే టీ రాజాసింగ్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన నాందెడ్ నుంచి ఒక వీడియో ప్రకటన విడుదల చేశారు. ప్రొటెం స్పీకర్‌గా ఎంఐఎం ఎమ్మెల్యేను ఎన్నుకోవడంతోనే.. తెలంగాణ ప్రజలు ఎటువంటి ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని ఎన్నుకున్నారో తేలిపోయిందన్నారు. రాబోయే ఎటువంటి పరిణామాలు ఎదురువుతాయో.. ప్రొటెం స్పీకర్‌ను ఎన్నుకోవడంతోనే స్పష్టమైందన్నారు. నిరంకుశ నిజాం, ఎంఐఎంకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఫాలోవర్‌గా మారిపోయారని చెప్పారు. హిందూ ధర్మానికి వ్యతిరేకులైన ఎంఐఎం ఎమ్మెల్యే ప్రొటెం స్పీకర్‌గా ఉన్న సమయంలో ప్రమాణ స్వీకారం చేయనని చెప్పారు. కొత్త స్పీకర్ ఎన్నికైన తరువాతే తాను ప్రమాణ స్వీకారం చేస్తానని ప్రకటించారు. దీనికి సంబంధించి న్యాయపరమైన అంశాలు ఎదురైతే.. వాటిని ఎదుర్కొంటానని చెప్పారు. ప్రమాణ స్వీకారం చేయకూ డదన్నది నా నిర్ణయం. ఆ సమయంలో అసెంబ్లీలో కూడా అడుగు పెట్టను. కొత్త స్పీకర్ ఎన్నికైన తరువాతే ప్రమాణీ స్వీకారం చేస్తా." అని ప్రకటించారు. ప్రొటెం స్పీకర్ ఎంపిక విషయంలో ఇప్పటికైనా ముఖ్యమంత్రి కేసీఆర్ తన నిర్ణయాన్ని మార్చుకోవాలని రాజాసింగ్ కోరారు.



శుభోదయం

ఓం శ్రీ గురుభ్యోనమః

శ్రీ విళంబి నామ సంవత్సరం
దక్షిణాయణం
హేమంత ఋతువు
పుష్య మాసం

సూర్యోదయం	: ఉ. 06:48	యోగం :	: హర్షణ 27:39
సూర్యాస్తమయం	: సా. 05:56	కరణం	: బవ 09:18 భాలవ 22:34
పక్షము	: శుక్ల పక్షం	రాహుకాలం	: ఉ. 08:14, 09:37
తిథి	: పాడ్యమి 09:18 తదుపరి విదియ	యమగండం	: రా. 10:59, 12:22
		వర్జ్యం	: మ. 01:07, 02:55
నక్షత్రం	: ఉత్తరాషాడ 20:36	అమృతకాలం	: మ. 01:26, 03:14





సూక్తి సుధ

ప్రేమ అనేది దేవుని అసలు రూపం

రమణ మహర్షి -




తిరుప్పావై పాశురం-23

మారిమలై ముళ్ఞ్జిల్ మన్నిక్కిడందుఱజ్గుం
శీరియ శిజ్ఞమఱివిత్తుత్తీ విళిత్తు
వేరిమయిర్ పొజ్గ ఎప్పాడుం పేర్ న్దుదరి
మూరి నిమిరందు ముళ్ఞ్జి పుర్రప్పట్టు

పోదరుమాపోలే, నీ పూవైప్పూవణ్ణా! ఉన్
కోయిల్ నిన్ఱిజ్గనే పోందరుళి కోప్పుడైయ
శీరియ శిజ్ఞాసనత్తిరున్దు యామ్ వన్ద
కారియమారాయ్ న్దరుళేలో రెంబావాయ్

'వర్షాకాలమునందు పర్వత గుహలలో ఆడ సింహాన్ని తనను ఒకటిగ వేసుకు అనుసరుట కలిసిపోయి పడుకొని నిద్రిస్తున్న పరాక్రమ మనే అతిశయంతో ఉన్న సింహం మేల్కొని తన శత్రు మృగములపై కోపంతో నిప్పు కణాలను రాల్చుతున్నట్లు కన్నులను తెరిచి చూస్తూ, పరిమళిస్తున్న మెడపై జూలు నిక్కబొడుచు కొనగా, నాలుగు వైపు లా చూసి శరీరం ఒక్కసారి దులుపుకొని, బాగుగా ఆవలించి మస్తకము సాగి గట్టిగా గర్జించి, గుహ నుండి బయటకు వస్తున్నట్లుగా, ఓ కృష్ణా! అతసీ పుష్పము వలె నల్లనైన శరీరంగల నీవు నీ ప్రాసాదము నుండి ఇచ్చటికి వేంచేసి, జయశీలమైన సింహాసనమున వేంచేసి, మేము తలబెట్టి వచ్చిన పనిని విచారించి కృప చేయవలెను.'

ఇచట వర్షమనగా భగవత్కృపా సముద్రం నుండి కారుణ్యము నెడు వాయువుచే కదలిన నీటి కెరటాల నుండి బయలువెడలిన భగవత్కటాక్ష ప్రసరణము.ఇచట గుహయనగా వేదగుహ. ఇచట ఉన్న 'శీరియ సింగ' మనగా లక్ష్మీసహిత నారాయణుడు. దీని భావమే 'ధర్మస్య తత్వం నిహితం గుహాయాం' అను శ్రుతిచే చెప్పబ డింది.సింహం తెలివి తెచ్చుకొనుట అనగా చేతనులను వారి వారి కర్మానుగుణంగా శరీరాలను సృజించి అందుచేర్చుటకు తగిన సమయం వచ్చిందని గుర్తించుట... ఇదియే కారణత్వంలోని మొదటి స్పందనం. ఇదియే మేల్కొనుట. ఆశ్రిత రక్షణావసరాన్ని గుర్తించుట.చూచుట యనగా సృష్టి సంకల్పించుట. 'ఐక్షత బహు స్యాం ప్రజాయేయ' అనునది శ్రుతి వాక్యం. ఇట్లు సంకల్పించగనే మొదట తేజస్సు దానినుండి జలం పృథివి ఆవిర్భవించును. ఈ క్రమాన్నే 'తీ విళిత్తు వేరిమయిర్ పొంగ' అని చెప్పబడింది. సృష్టి క్రమ వికాసమే 'ఎప్పాడుం పేరిందుదరి, మూరినిమిరన్దు' అను వాటితో చెప్పారు. పరతత్త్వం కారణావస్థను వదలి కార్యావస్థను, అనగా జగద్రూపం నందు అప్పుడు ప్రకృతి రూపంగాంచిన పరమాత్మ శరీరంలో కలిగెడు మార్పులను 'ముళంగి పురప్పట్టు పోదరుమాపోలే' అనుదానిచే చెప్పారు. కార్యావస్థ పొందిన పరమాత్మలోని సౌలభ్యం 'అతసీ పుష్పసచ్ఛాయ'. ఇచట కోయిల్ అనగా ప్రణవమనదియే పరమా త్మకు, జీవాత్మయగు ఆచార్యునకు నివాసం కదా!



విభూతి పరమాత్మ సింహాసనం.

- డా|| బాలుశర్మ పన్నాల (వేద పండితులు)

పుష్యమాసంలో వచ్చే పుణ్య ఫలితాలు

చంద్రుడు పుష్యమి నక్షత్రంలో ఉండగా వచ్చే మాసం పుష్య మాసం. పుష్యఅనే మాటకు పోషణ శక్తి కలిగినది అని అర్థం. పుష్య మాసం శీతాకాలం. ఆధ్యాత్మికంగా జపతపాదులు, ధ్యానపారాయణ లకు శ్రేష్టమైన మాసమిది. పితృదేవతలను పూజించి అందరు దోషరహితులవ్వు పుణ్య మాసం పుష్యం. పుష్యపౌర్ణమి వేదాధ్యయనికి చాలా విశిష్టమైనదిగా చెప్ప బడింది. శ్రావణ పౌర్ణమి మొదలు పుష్య పౌర్ణమి వరకు వేదాలు, మంత్రాలు నేర్చుకోవడానికి అనువైన సమయం గా చెప్ప బడింది. ఈ మాసంలో రైతులకి పంట చేతికి వచ్చే కాలం కావున ధాన్య లక్ష్మీ ధన లక్ష్మి రూపంలో లక్ష్మీదేవిని విష్ణు మూర్తి సమేతంగా పూజిస్తారు.



ఈ మాసంలో గృహ ప్రవేశాలు, పెళ్లిళ్ళు, శంఖుస్థాపనలు వంటి శుభకార్యాలు చేయడానికి వీలులేనప్పటికీ సాధారణ పూజలు, పెద్ద లని స్మరించుకొని చేసే అన్ని పుణ్యకార్యాలకి విశేషమాసంగా చెప్పవచ్చు. పుష్య మాసానికి అధిపతి అయిన శని మరియు నక్షత్రాధిపతి అయిన గురువుని పూజించడం వలన విశేష ఫలితం లభిస్తుంది. పుష్యమాసంలో శని గ్రహనికి అమావాస్య రోజున తైలాభిషేకం నిర్వహించడం ద్వారా శని బాధ నివృత్తి జరుగుతుంది. వీటితో పాటుగా వస్త్ర దానం, తిల దానం, అన్నదానం చేయడం వలన శని దోషాలు తొలగి శుభ ఫలితాలు పొందవచ్చు. పుష్య పౌర్ణమి రోజున నదీ స్నానం చేయడం వలన సకల పాపాలు తొలగుతాయి. ఈ రోజు చేసే దానాల వలన పుణ్య ఫలితం అధికంగా ఉంటుంది అని తెలుపుతున్నారు. తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి వచ్చేది పుష్యమాసం లోనే ఉత్తరాయణ పుణ్యకాలం ప్రవేశించేది ఈ మాసంలోనే. సూర్యుడు ధనురాశి నుండి మకరరాశిలో ప్రవేశించడమే మకర సంక్రాంతి.

ఏ పనైనా సంతృప్తికరంగా చేయాలి

చాణక్యం

శ్లో|| గూఢంచ మైథునం ధార్ష్ట్యం కాలేకాలేచ సంగ్రహం!
అప్రమత్త మవిశ్వాసం పంచ శిక్షేచ్ఛ వాయసాత్||

రహస్యంగా మైథునం(సంభోగం) చేయుట, మొండితనం, సమయానుకూలంగా సంపాదించటం, అజాగ్రత్తగా ఉండకుండుట, ఇతరులను నమ్మకుండుట అనే ఐదును కాకి నుండి నేర్చుకోవాలి.

శ్లో|| బహ్వాశీ స్వల్పసంతుష్టః సునిద్రో లఘుచేతనః!
స్వామి భక్తశ్చ శూరశ్చ షడేతే శ్వానతో గుణాః||

ఎక్కువ తినే శక్తి ఉన్నా ఎక్కువ లభింపకున్నను తక్కువ దానితోనే సంతోషించుట, బాగా నిద్రించుట, కొంచెం ధ్వనియైనా మేల్కొనుట, స్వామిభక్తి అనగా యజమాని విషయంలో నమ్మకంగా ఉండుట, శౌర్యం కలిగి ఉండుట అనే ఈ ఆరు లక్షణాలను కుక్క నుండి నేర్చుకోవాలి.

శ్లో|| సుశ్రాన్తోఽపి వహేద్ భారం శీతోష్ణం న చ పశ్చతి!
సంతుష్టశ్చరతే నిత్యం త్రీణి శిక్షేచ్ఛ గర్దభాత్||

అలసి ఉన్నా కూడా భారం మోయటం, శీతోష్ణములను సైతం లెక్కచేయకుండటం, సంతోషంతో జీవనం గడపటం అనే ఈ మూడింటిని గాడిద నుండి నేర్చుకోవాలి.

శ్లో|| య ఏతాన్ వింశతిగుణా నాచరిష్యతి మానవః|
కార్యాఽవస్థాసు సర్వాసు అజేయః స భవిష్యతి||

మనుషుడు ఇరువది గుణాలను ఆచరణలో బెట్టినచో సమస్త కార్యములందును, సమస్తావస్థలలోను పరాజయం లేని వాడై విజయుడగును. పైన వివరించబడిన మూడు జంతువులకు గల లక్షణాలను మనం గ్రహించి వాటిని నిత్యజీవితంలో ఆచరించటం వల్ల ఏ కార్యములను చేపట్టినను, ఎలాంటి వాతావరణంలో ఉన్నా కూడా దాన్ని లెక్కచేయకుండా ఆ పని పూర్తయ్యేలా కష్టపడటమే కాకుండా సంతోషంగా జీవనాన్ని గడిపేవాడికి అన్నింటా విజయం సిద్ధిస్తుందని చాణక్యుల వారు తమ నీతిశాస్త్రంలో తెలియచేస్తున్నారు.

- యామిజాల సుబ్రహ్మణ్యం

నీలాంబర శర్మ (శక.1745)

వేద విజ్ఞానం

భాగం-72

గంగా గండకీ నదుల సంగమ సమీపంలో, పాటలీపుత్రం (పాట్నా) నివాసియైన మైథిలీ బ్రాహ్మణుడు, నీలాంబర శర్మ. తండ్రి పేరు శంభునాథుడు. జ్యేష్ఠ సోదరుడు జీవనాధుని పర్యవేక్షణలో విద్యను అభ్యసించి, కొంతకాలం తర్వాత వారణాసిలో సంస్కృత పాఠశాలలో విద్యను అభ్యసించాడు. ఇతను అల్వార్ మహారాజు శివుని ఆస్థానములో ఖగోళ శాస్త్రాధిపతిగా ఉన్నాడు. శక.1805లో వారణాసిలో మరణించాడు.

గోళ ప్రకాశమనే గ్రంథాన్ని సంస్కృతంలో పాశ్చాత్య పద్ధతిలో సంకలనం చేశాడు. దీనిని శక.1793లో బాపూదేవశాస్త్రి వారణాసిలో ముద్రించడం జరిగింది. ఇందులో 5 అధ్యాయాలు ఉన్నాయి. భుజజ్యా నిర్మాణము, త్రికోణమితి (సమతలం), గోళీయజ్యామితి సిద్ధాంతము, గోళీయ జ్యామితి సిద్ధాంతము సమస్యలు, మొదలైనవి. ఇంగ్లీషును అర్థం చేసుకోలేని వారికి కొన్ని భాగాలపై వ్యాఖ్యానం రాశాడు. నీలాంబరుని జ్యేష్ఠ సోదరుడైన జీవనాథుడు, భాస్కరుని బీజగణితం, భావప్రకాశం వంటి జ్యోతిషగ్రంథములపై వ్యాఖ్యానములు రాయడం జరిగింది.

వినాయకుడు / కేరోలక్ష్మణఛాత్రే (జనన శక.1746)

బ్రిటీష్ వారి పరిపాలన మహారాష్ట్రలో పూర్తిగా అమలులోకి వచ్చిన తర్వాత, పేరు గాంచిన పండితులలో, పాశ్చాత్య పద్ధతిలో కూడ విద్య, జ్ఞానము సముపార్జన చేసి ప్రసిద్ధికెక్కినవారిలో ఒక్కరు కేరోపంత్ నానా. అతను గణితం, ఖగోళశాస్త్రం, ప్రకృతి పరిశీలనలో సాధికారికత కలిగినవారు. బొంబాయికి దక్షిణంగా 26 మైళ్ళదూరంలో, అష్టాగర్ ప్రాంతములో ఒక సముద్రతీరగ్రామం నాగావ్. ఇక్కడ మే 1824లో జన్మించారు. వీరు ఋగ్వేది చిత్‌పావన్ బ్రాహ్మణులు కాశ్యప గోత్రికులు. ఈయన విద్యంతా ఆంగ్లమాధ్యమంలోనే సాగింది. పాశ్చాత్య విద్య అధ్యయనం అంతా ఎల్ఫిన్‌స్టోన్ ఇనిస్టిట్యూట్ బొంబాయిలోనే జరిగింది. ప్రొ.ఆర్లిబర్‌కు అభిమాన విద్యార్థి. క్రీ.శ 1840లో బొంబాయి కొలాబా ప్రాంతంలో ఖగోళ పరిశీలన, అయస్కాంత ఆకర్షణల పరిశోధనల కొరకు వేధశాలను నిర్మించారు. ఈ వేధశాల ప్రొ. ఆర్లిబర్ ప్రారంభోత్సవం చేసి, కేరోపంత్‌ను సహాయకునిగా నియోగించుకున్నాడు. 7 జూన్ 1851 తర్వాత పూనా సంస్కృత కాలేజీ పూనా కాలేజీగా మారింది. కొన్ని నెలల తర్వాత కేరోపంత్ మరాఠి విద్యార్థులకు, మరియు సాధారణ పాఠశాల విద్యార్థులకు, గణిత, ప్రకృతిశాస్త్రములను బోధించే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమించబడ్డాడు. ఈ కాలేజీలో ఈ పాఠాలను ఇంగ్లీషు, మరాఠి మాధ్యమాలలో విద్యార్థులకు బోధనచేసేవాడు. తర్వాత కాలంలో సాధారణ పాఠశాల విభాగము వేరుబడగా అక్కడ పనిచేసి కొంతకాలానికి ఆ స్కూల్ సూపరిండెంట్‌గా ఎక్కువ కాలం పనిచేశాడు. (అపుడు దానిని భాషా కళాశాల అని పిలిచేవారు. ప్రస్తుతం అది ట్రైనింగ్ కాలేజి అనే పేరుతో ఉంది.) అదే సమయంలో ఇంజనీరింగ్ కాలేజీలో కూడ ప్రకృతి శాస్త్రములను బోధించేవాడు. ఈ కాలంలోనే కొన్నాళ్ళు అహమ్మద్‌నగర్‌లోని ఆంగ్ల పాఠశాల ప్రధానాధ్యాపకుడుగా కూడా పనిచేశాడు. క్రీ.శ 1865లో పూనా కాలేజీలో, గణితం ప్రకృతి శాస్త్రముల ప్రొఫెసర్‌గా ఇంగ్లీష్‌లో బోధించేవాడు. ఈ కళాశాల, తర్వాత కాలంలో దక్కన్ కాలేజీగా మారింది. క్రీ.శ 1879లో పదవీవిరమణ చేశాడు. ఆ రోజులలోనే నెలకు రూ.1000 జీతం తీసుకునే ఈయన పదవీవిరమణ తర్వాత సంవత్సరానికి రూ.5000 పెన్షన్ అందుకునేవాడు. ఈ మొత్తం ఆ ప్రాంతంలో ఒక 'స్థానికుడు' పొందే ఆదాయాలలో అత్యధికం. 1877లో బ్రిటీష్ ప్రభుత్వం నుండి 'ఢిల్లీ దర్బార్' ఉత్సవంలో 'రావు బహద్దూర్' అనే బిరుదును పొందాడు. 19 మార్చి 1884లో 60వ ఏట స్వర్గస్తులయ్యాడు. నానా అనే పేరుతో అందరికి పరిచయస్తులు. ఈయనకు ఉన్న అనేక సుగుణాలలో, జ్ఞానం, ప్రతిభ, మంచితనం వంటి ఉత్తమ గుణాలు మరీ ఎక్కువగా కీర్తించదగినవిగా ఉన్నాయి.

–డా|| రేమెళ్ల అవధానులు



శ్రీ శివ మహిమ్నా స్తోత్రం

అంతర్యామి అయిన పరమేశ్వరుడు ఒక్క భూలోక వాసులకే కాదు, త్రిలోక నివాసులకూ ఆరాధ్యుడు. ఆయన ధరించిన విభూతి కోసమే ఇంద్రాది దేవతలు ప్రార్థిస్తారు. రావణాది దానవుల శివభక్తి లోక విదితమే. పరమేశ్వరుడి అనుగ్రహం కోసం కైలాసగిరినే తన భుజస్కంధాలపై ఎత్తుకొన్నవాడు దశకంధరుడు. స్వామి ఎంతకూ ప్రత్యక్షం కావడం లేదని, తన ఉదరం నుంచి పేగుల్ని వెలికి తీసి వీణలా మోగించిన భక్తి ఆ దశాననుడిది! దేవతా కోటిలోని వారు గంధర్వులు. గానప్రియులైన వీరు అపూర్వ శివభక్తి పరాయణులు. అలాంటి గంధర్వుల్లో ఒకరైన పుష్పదంతుడికి సంబంధించిన శివభక్తిని ఒక కథ విపులీకరిస్తుంది. శివుడి మహిమను అది స్పష్టంగా బోధించడంతో పాటు, భక్తిలో గల విశిష్టతనూ తెలియజేస్తుంది.

పూర్వం శివభక్తుడైన ఒక రాజు ఉండేవాడు. అతడు ప్రతి నిత్యం పుష్పవనంలో పూచిన పూలతో శివుణ్ని అర్చించేవాడు. ఒకనాడు ఉదయమే పూలు తెమ్మని భటుల్ని అక్కడికి పంపాడు. అక్కడ వారికి ఒక్క పూవైనా కానరాలేదు. పూలు ఏమయ్యాయని ఉద్యానవన పాలకుణ్ని అడిగారు. గత రాత్రి ఎవరో వనంలోకి దూరి పూలు తీసుకెళ్లి ఉంటారని బదులివ్వడంతో, భటులు అదే విషయాన్ని రాజుకు నివేదించారు. రాత్రివేళల్లోనూ కాపలా కాయాలంటూ ఆయన అనేకమంది రక్షక భటుల్ని నియమించినా, పూలు మాయమవుతున్నాయి. భటులు రాజుకు విన్నవించారు. శివభక్తుడైన ఆయనకు విషయం అప్పుడు అర్థమైంది. ఎవరో శివభక్తుడు 'తిరస్కరిణి' (ఎవరికీ కనిపించకుండా ఉండే శక్తి)తో ఆ పనిచేస్తున్నాడని గ్రహించాడు.

రాజు వెంటనే ఆ పూలతోటలోని దారి అంతటా శివ నిర్మాల్యం (శివుడికి పూజలో సమర్పించిన పవిత్ర పుష్పాలు) చల్లించాడు. అలా చేయడం వల్ల అజ్ఞాత భక్తుడు ఆ పూలను తొక్కి తన మహిమ కోల్పోతాడని, అప్పుడు అతణ్ని సులభంగా పట్టుకోవచ్చని భావించాడు. ఆయన ఆదేశించినట్లే భటులు చేశారు. ఎప్పటిలాగే రాత్రివేళ పూలతోటలోకి ప్రవేశించిన గంధర్వుడు ఆ శివ నిర్మాల్యాన్ని తొక్కడంతో, అతడి దివ్య మహిమలన్నీ నశించాయని పురాణ గాథ. అతడి తిరస్కరిణి శక్తి, ఆకాశ గమన శక్తి మాయమయ్యాయి. తెల్లవారితే రక్షకభటులు పట్టి బంధిస్తారని భయపడిన గంధర్వుడు దయామయుడు, సంకట నాశకుడు అయిన శివుణ్ని రాత్రంతా స్తుతించాడు. శివుడు అతణ్ని అనుగ్రహించి, దివ్య శక్తుల్ని తిరిగి ప్రసాదించాడు. అప్పుడు ఆ గంధర్వుడు తన లోకానికి తిరిగి వెళ్లిపోయాడు. 'పుష్పదంత' నామధేయుడైన ఆ గంధర్వుడు చేసిన 'శివ మహిమ్న స్తోత్రం' జగత్తులో ప్రసిద్ధమైంది.

ఆ అనర్ఘ స్తోత్రమే ఇప్పటికీ శివాలయాల్లో రుద్రాభిషేక వేళ నమక చమకాల రూపంలో వినవస్తోంది. అది భక్తుల గళాల్లో జాలువారుతూ పఠనీయంగా మారింది. 'ఓ పరమేశ్వరా! లోకంలోని మానవులు వేదాలని, సాంఖ్యమని, యోగమని... ఎన్నో మతాలు సృష్టిస్తున్నారు. తమదే గొప్పదని వాదిస్తున్నారు. ఇవన్నీ వారి అభిరుచులకు అనుగుణంగా సాగుతున్న వాదాలే. ఒక గమ్యస్థానం చేరడానికి పలు దారులుంటాయి. వాటిలో కొన్ని నేరుగా, మరికొన్ని చుట్టుతిరిగేవిగా ఉన్నట్లే ఈ మతాలు, వాదాలు కనిపిస్తాయి. ఎలా వెళ్లినా, గమ్యస్థానాన్ని చేరడమే



పరమార్థం. ఎన్ని మతాల సిద్ధాంతాల్ని అనుసరించినా, అవన్నీ స్వామిని చేరడానికే. నదులు ఎన్ని పాయలుగా చీలినా, చివరికి కలిసేది సముద్రంలోనే' అంటూ సత్యాల్ని ఆవిష్కరిస్తుంది ఆ స్తుతి!

శివ యథార్థరూపం ఎంతో గొప్పది. స్వర్గమార్గం నుంచి ప్రవహిస్తూ వస్తున్న ఆకాశగంగ ప్రవాహంలో, నక్షత్రాలు చిన్నపాటి బిందువుల్లా మారుతున్నాయి. సముద్రాలతో చుట్టిన భూమి ఒక చిన్న దీవిలా కనిపిస్తోంది. నదులు, సముద్రాలు, భూమి అన్నీ శివుడి శిరస్సుపై బిందువులా చేరాయి. ఇదీ స్వామి దివ్య స్వరూపం! ఈ రూపాన్ని ఎవరైనా వూహించగలరా... అంటూ సుందర వర్ణనలతో శివపారమ్యాన్ని విశదం చేస్తుంది స్తోత్రం! అందుకే ఇది శివభక్తుల పాలిట అమృత సింధువు. ఆయన మహిమ అనంతమని వారందరి ప్రగాఢ విశ్వాసం!.

పూర్వం తమిళనాట ఒక రాజు గారు ఉండేవారు. ఆ రాజు మహా శివ భక్తుడు. ఆయన భక్తికి మెచ్చిన పరమశివుడు ఒక నాడు ప్రత్యక్షం అయి, ఏమి వరం కావాలి అని అడుగుతారు. అప్పుడు ఆ రాజు, 'తండ్రీ, నేను భూలోకంలో యోగ్యమైన అన్ని పుష్పముల తోనూ మే పూజ చేసుకోగలగుతున్నాను, కాని మా ఈ భూలోకంలో లభించనివి, కేవలం మీరు ఉండే కైలాసంలో పూసే విశేష పుష్పాలు ఇక్కడ భూమి మీద కూడా పూసేలా వరమివ్వండి, వాటితో కూడా మిమ్మల్ని పూజించాలని ఉంది.' అని వరం అడుగుతారు రాజు గారు. మెచ్చిన ఆ ఉమాపతి కైలాసంలో ఉండే అనేక దివ్యమైన పుష్పాలను ఆ రాజు గారు ఉన్న చోట పూయిస్తాడు. ఈ రాజు గారు చక్కగా రోజూ, ఆ పూలతో కూడా శివ పూజ చేసుకుంటూ ఉంటారు.

ఇదిలా ఉండగా, చిత్రరథుడు అనే ఒక గంధర్వుడు ఉండేవాడు. ఆయన ఎంతో శ్రావ్యంగా గంధర్వ గానం చేస్తూ ఉండేవాడు. ఆ చిత్రరథుడు ఒకనాడు ఈ రాజు గారి పూలతోట మీదుగా ఆకాశంలో వెడుతూ ఉంటే, ఇంత అద్భుతమైన సువాసన వస్తోంది అని, చూసి, ఇవి ఏవో ప్రత్యేక దేవతా పుష్పాలు అని అర్థం అయ్యి, ప్రతీ రోజూ రాత్రి అందరూ నిద్రించిన వేళకి ఆ పూల వనం లోకి అదృశ్య రూపంలోవచ్చి, ఆ పూలన్నీ కోసుకుని వెళ్లి పూజ చేసుకునే వాడు. ఇలా కొన్ని రోజులు జరుగుతుంది. ఈ విషయం తెలిసిన రాజు గారు చాలా విచారించి, అయ్యో పరమశివుడు ఎంతో ప్రేమతో నాకు వరమిచ్చిన పుష్పాలను పూజకు వినియోగించలేకపోతున్నానే అని బాధపడి, ఒక ఉపాయం ఆలోచించి, ఆయన సేవకులను పిలిచి చెప్తాడు, 'రోజూ ఆయన తోటలో ఉండే పూవులను శివ పూజ అయిపోయిన తరువాత (నిర్మాల్యం అంటారు కదా..), ఆ నిర్మాల్యం తీసుకువెళ్ళి, పరమశివుడు వరమిచ్చిన కైలాస పుష్పములు ఉన్న తోట చుట్టూ చల్లమని చెప్తారు'.

యథావిధిగా ఆ చిత్రరథుడు అనే గంధర్వుడు ఈ తోటలోకి ప్రవేశిస్తాడు, అక్కడ శివ పూజ చేయబడిన నిర్మాల్యం ఉందని చూడక, పొరపాటున కాలితో తొక్కుతాడు. దానితో ఆయన యొక్క దివ్య శక్తులన్నీ నశించిపోయి, ఆయన అదృశ్య రూపంలో ఉండే శక్తి కూడా పోయి, మామూలు వ్యక్తిగా కనబడతాడు. వెంటనే సైనికులు వచ్చి బంధించి రాజు గారి ముందు ప్రవేశ పెడితే, ఆయన కారాగారంలో బంధిస్తారు. అప్పుడు కారాగారంలో ఉన్న ఆ గంధర్వుడు, పశ్చాత్తాపంతో పరమ శివుని కీర్తిస్తూ చేసిన అద్భుతమైన స్తోత్రమే ఈ శివ మహిమ్న స్తోత్రం. ఈ స్తోత్రం చేసిన తరువాత, శివుడు ప్రీతి చెంది, ఆయనకి మళ్ళీ గంధర్వ రూపం, శక్తులు ఇచ్చి రక్షిస్తాడు. అప్పటి నుంచి ఆయన పేరు, పుష్పదంతుడు , పుష్పదంతాచార్యులుగా మారింది. శివ స్తోత్రాలలో చాలా గొప్ప స్తోత్రము. ఇంత చక్కని స్తోతము చదివి, శివ కటాక్షం పొందుదాము.

విశేష ప్రాచుర్యం పొందిన శివస్తోత్రాల్లో శివ మహిమ్న స్తోత్రమ్ ఒకటి.

శ్రీ పుష్పదంత విరచిత
శ్రీ శివ మహిమ్నా స్తోత్రం
ఓంశ్రీమాత్రేనమః
అద్వైత చైతన్య జాగృతి

అథ శ్రీ శివమహిమ్నస్తోత్రమ్ ||

మహేశాత్ నాపరో దేవః మహిమ్నః నా పరో స్తుతిః
అఘోరాత్ నా పరో మంత్రః నాస్తి తత్త్వం గురో పరమ్
'మహేశ్వరుడిని మించిన దేవుడు లేడు,
మహిమ్న స్తోత్రాన్ని మించిన స్తుతి లేదు.
అఘోర మంత్రాన్నిమించిన మంత్రం లేదు.
గురువును మించిన పరతత్త్వం లేదు'.
మహిమ్నః పారం తే పరమవిదుషో యద్యసదృశీ
స్తుతిర్బ్రహ్మాదీనామపి తదవసన్నాస్త్వయి గిరః |
అథావాచ్యః సర్వః స్వమతిపరిణామావధి గృణన్
మమాప్యేష స్తోత్రే హర నిరపవాదః పరికరః || 1 ||
అతీతః పంథానం తవ చ మహిమా వాఙ్మనసయోః
అతద్వ్యావృత్త్యా యం చకితమభిధత్తే శ్రుతిరపి |
స కస్య స్తోతవ్యః కతివిధగుణః కస్య విషయః
పదే త్వర్వాచీనే పతతి న మనః కస్య న వచః || 2 ||
మధుస్ఫీతా వాచః పరమమమృతం నిర్మితవతః
తవ బ్రహ్మన్ కిం వాగపి సురగురోర్విస్మయపదమ్ |
మమ త్వేతాం వాణీం గుణకథనపుణ్యేన భవతః
పునామీత్యర్థేస్మిన్ పురమథన బుద్ధిర్

ధర్మ సందేహాలకు సమాధానాలు

వాలిసుగ్రీవుల జన్మవృత్తాంతంలో వాలం(తోక) నుండి వాలి, కంఠం నుండి సుగ్రీవుడు జన్మించాడంటారు ఇది విచిత్రంగా ఉంది – ఇందులో ఏదైనా విజ్ఞానం ఉందా?

ఎందుకు విచిత్రం! ఈ రోజుల్లో టిష్యుకల్చర్‌లో కాండభాగాన్ని కోసి కొత్త మొక్కల్ని ఉత్పత్తి చేయడం లేదా? కిష్కింధకు 'ఋక్షరజస్సుడు' అనే వానరుడు అధిపతి. బ్రహ్మసంకల్పంతో జన్మించిన ఈ వానరరాజు ఒకరోజు ఒక కొలనులో స్నానం చేద్దామని అందులోకి దిగాడు. వెంటనే వానరరాజు అందమైన స్త్రీరూపం ధరించాడు. (ఓ పర్యాయం పార్వతీదేవి తన చెలికత్తెలతో ఈ కొలనులో స్నానం చేస్తుంటే కొందరు రాక్షసులు యువతుల రూపం ధరించి అదే కొలనులో ప్రవేశించారు. వారిని రాక్షసులుగా గుర్తించిన పార్వతీదేవి 'పురుషులీ సరస్సులో దిగితే స్త్రీలుగా మారతారని' శపించింది. బ్రహ్మదేవుడు పార్వతిని వేడుకోగా ఆమె అనుగ్రహించి ఏ మగవాడైనా ఆ సరస్సులో మునిగితే వచ్చే ఆడరూపం ఒకేరోజు మాత్రమే



ఉంటుందని శాపం ఉపసంహరించింది) ఆకాశమార్గంలో వెళ్తున్న దేవేంద్రుడు, సూర్యుడు ఆమె అందానికి కామోద్రిక్తులైనారు, దేవేంద్రుని వీర్యం స్ఖలనమై ఆ స్త్రీమూర్తి వాలభాగంలో పడింది. మరుక్షణంలో వాలి జన్మించాడు. (వాల భాగం నుండి పుట్టినాడు కాబట్టి ఆయనకు 'వాలి' అని పేరు)తర్వాత సూర్యుని వీర్యం స్ఖలించి ఆ స్త్రీ మూర్తి గ్రీవంపై పడింది. (గ్రీవం అనగా కంఠం) అలా పడిన వీర్యం నుండి మరో వానర బాలుడు జన్మించాడు. అయనే సుగ్రీవుడు. ఇంద్రుడు తనమెడలోని హేమ మాలికను వాలిమెడలో వేసి వాలికి విశేష బలసంపదను అనుగ్రహించి స్వర్గానికి వెళ్ళి పోయాడు. సూర్యుడు సుగ్రీవుణ్ణి ఆశీర్వదించి 'శివాంశసంభూతుడు' (హనుమ) నీకు మేలుకలిగిస్తాడని చెప్పి పశ్చిమాద్రికి వెళ్ళాడు. ఋక్షర జస్సుడు బ్రహ్మదేవుని ద్వారా పైన చెప్పిన శాపవృత్తాంతం తెలుసుకొని వాలి సుగ్రీవులిద్దరిని పెంచి యుక్తవయస్సు వచ్చిన తర్వాత వాలికి తారతో, సుగ్రీవునికి రుమతో వివాహం జరిపించాడు. ఋక్షజస్సుడు వృద్ధుడైన తర్వాత కిష్కింధకు వాలిని రాజుగా సుగ్రీవుణ్ణి యువరాజుగా పట్టాభిషేకం చేసాడు.

పురాణ క్విజ్

తెలిసినవేంటో తేల్చుకోండి!
తెలియనివన్నీ తెలుసుకోండి..

1. బ్రహ్మదేవునికి ఒకే ఒక్క గుడి ఉంది అదెక్కడ?
2. ప్రసిద్ధి గాంచిన సూర్యదేవాలయం ఎక్కడ ఉంది?
3. వ్యాసుడు జైమినికి బోధించిన వేదం?
4. త్రేతాయుగంలో ధర్మదేవత పాదాల సంఖ్య?
5. పరీక్షత్తును కాటేసిన చంపిన సర్పం?
6. గాంధారి తండ్రి పేరు?
7. సోమద, చూళిల కుమారుడు?
8. భృగు మహర్షి నివసించే పర్వతం పేరు?
9. పరీక్షిత్తు భార్య పేరు?
10. పరీక్షిత్తు గురువు పేరు?

సమాధానాలు

1. రాజస్థాన్
2. కోణార్క్ (ఒరిస్సా)
3. సామవేదం
4. 3
5. తక్షకుడు
6 .సుబలుడు
7. బ్రహ్మదత్తుడు
8. ప్రస్రవణగిరి
9. ఇరావతి
10. కృపాచార్యుడు

షార్ట్ ఫిలిం చిత్రీకరణపై పోటీలు

విజయక్రాంతి, హైదరాబాద్: బాలల హక్కుల సంఘం ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ పోలీసు తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా ఆధ్వర్యంలో చెన్నైకి చెందిన పరివర్తన సంస్థ సహకారంతో 18నుండి23 సంవత్సరాల బాలికలకు లఘు చిత్రాలపై పోటీలు నిర్వహిస్తూ నాలుగు అంశాలలో ఏదైనా ఒక అంశాన్ని తీసుకొని ఒకటినుండి 3నిమిషాల వ్యవధి గల చిత్రాలను తీయాలని ఒకటి మీటూ రెండు గృహహింస మూడు మోసపోవద్దు నాలుగు విద్యార్థి మనస్తత్వం అనే ఏదైనా అంశంపై హెచ్.డి సెల్‌ఫోన్‌గాని హ్యాండీక్యామ్‌తో చిత్రీకరించిన బాలల సంఘానికి అందజేస్తే 24,27 తేదిలలో దిల్‌సుఖ్‌నగర్‌లోని అనిబిసెంట్ ఉమెన్‌కాలేజీలో జరుగుతుందని అనురాధరావు తెలిపారు.

సాగర్‌లో సబ్ మెరైన్ మ్యూజియం
పర్యాటక శాఖ ఏర్పాట్లు



విజయక్రాంతి, హైదరాబాద్: నగరానికి వచ్చే పర్యాటకులకు నెక్లెస్ రోడ్డులో ఏర్పాటు కానున్న యుద్ధవిమానాలు, సబ్‌మెరైన్‌ల మ్యూజియం కనువిందు చేయనుంది. ఇప్పటికే హుస్సేన్ సాగర్ కట్టపై యుద్ధట్యాంక్ ఓ ప్రత్యేక ఆకర్షణగా నిలువగా, కొత్తగా ఏర్పాటుకానున్న రక్షణ ప్రదర్శనశాల అదనపు ఆకర్షణగా నిలువనుంది. పర్యాటక శాఖ రక్షణ శాఖతో జరిపిన సంప్రదింపులు ఫలవంతమవుతున్నాయి. డీఆర్డీవో చైర్మెన్ సతీష్ రెడ్డి, పర్యాటక శాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశం ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. నౌకదళం వద్ద విరామంలో ఉన్న యుద్ధవిమాన సబ్ మెరైన్ ను తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చేందుకు అంగీకరించినట్లు టూరిజం అధికారులు వెల్లడించారు. వీటికి సంభందించిన చిత్రాలను విడుదల చేశారు. రష్యా పరిజ్ఞానంతో తయారైన ఈ యుద్ధ విమాన సబ్ మెరైన్ రక్షణ శాఖలో విశిష్టమైన సేవలందించాయి. వీటి ఏర్పాటుతో తెలంగాణ యువతకు రక్షణ శాఖ పట్ల అవగాహనతో పాటు, ఆ రంగాన్ని ఉపాధిమార్గంగా ఎంచుకోవటానికి ప్రోత్సాహం ఏర్పడనుందని అధికారులు భావిస్తున్నారు.

ఏబీవీపీ కార్యవర్గ సభ్యురాలిగా
సత్య సాత్విక నియామకం

విజయక్రాంతి, శేరిలింగంపల్లి: అఖిల భారత విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ ఆల్విన్‌కాలనీకి చెందిన సత్య సాత్విక నియమితులయ్యారు. ఇటీవల గుజరాత్ రాష్ట్రంలో జరిగిన ఏబీవీపీ 64వ జాతీయ కార్యవర్గ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో తెలంగాణ రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. అందులోబాగంగానే శేరిలింగంపల్లికి చెంది న సత్య సాత్విక రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా నియమితులైన సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గంలో చోటు లభించడం చాలా సం తోషంగా ఉందని అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

ఎమ్మెల్యేను సన్మానించిన బంజార భజరంగ్ సేవా సంఘం



విజయక్రాంతి, అంబర్‌పేట్: బంజార భజరంగ్ సేవా సంఘం సభ్యులు అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జె.రమేష్ నాయక్, పి.రాంచందర్ నాయక్, ఎం.కృష్ణగౌడ్, ఎం.రవి, జి.రావిందర్, ఏ.బిముడు, జి.రాంచందర్, ఎం.దసరు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిత్యం పోరాటాలు తప్పవు



- సమాఖ్య చైర్మెన్ రాపోలు రాములు

విజయక్రాంతి, బోడుప్పల్: బోడుప్పల్ ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాడం కోసమే బోడుప్పల్ కాలనీ సంక్షేమ సంఘాల సమాఖ్య (బీఎంసీడబ్లుఎఫ్)ఏర్పడిందని కాలనీల సమాఖ్య చైర్మెన్ రాపోలు రాములు అన్నారు..ఆదివారం బోడుప్పల్ రాజలింగం కాలనీలో జరిగిన సమాఖ్య సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ గతంలో బోడుప్పల్ లో ప్రజ సమస్యలపై పాలక ప్రతిపక్ష పార్టీలు మాట్లాడ లేని ప్రతిదాన్ని ప్రశ్నించు అను నినాదంతో బోడుప్పల్ కాలనీల సంక్షేమ సంఘాల సమాఖ్య ఫెడరేషన్ ఏర్పాటు అయిందని అన్నారు..నాడు ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేసిన అనేక పోరాటాల ఫలితాంగనే మంచినీటి సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారం అయ్యిందని గుర్తు చేశారు..

నూతన కమిటీ ఎన్నిక : బోడుప్పల్ కాలనీ సంక్షేమ సంఘాల సమాఖ్య నూతన కమిటీ అధ్యక్షులుగా బోమ్మక్ రమేష్‌ను ఏకగ్రివకంగా ఎన్నుకున్నారు...సమాఖ్య చైర్మెన్ గా రాపోలు రాములు ఎన్నికయ్యారు..జనవరి 27 వార్షికోత్సవ సభనాటికి పూర్తి స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

బ్రాహ్మణులను కించపరిస్తే ఊరుకోం

విజయక్రాంతి, సికింద్రాబాద్: బ్రాహ్మణులను కుక్కలుగా సంబోధిస్తూ హిందూ సంప్రదాయాలను కించపరిచే విధంగా భారతీయ హిందూ వివాహ సంప్రదాయాన్ని కూడా దూషిస్తూ జెమినీ టీవీ ప్రచారం చేసిన జూ లకటక కార్యక్రమంలో కొందరు నటులు బ్రాహ్మణులను దూషిస్తూ మాట్లాడారని, ఆ కార్యక్రమంలో నటించిన ప్రతి ఒక్కరిని అలానే జెమిని టివి ఛానల్ ఇన్‌చార్జిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ లో భాగ్యనగర్ అర్చక పురోహిత సంఘం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేసామని అధ్యక్షుడు గట్టు శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఇకపై హిందూ సంప్రదాయాల, బ్రాహ్మణుల పట్ల దూషించడం కించపరచడం లాంటివి చేస్తే ముందు ముందు బుద్ధి చెప్పడానికి వెనుకాడబోమని హెచ్చరించారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు దిశగా పనిచేయాలి



విజయక్రాంతి, అంబర్‌పేట్: రానున్న పార్లమెంట్ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అంబర్‌పేట్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జి.కిషన్‌రెడ్డి అన్నారు. కాచిగూడ డివిజన్ బీజేపీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం ఆదివారం బర్కత్‌పురలోని బీజేపీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు బి.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలలో జరిగిన పోరపాట్లును సరిదిద్దుకోవాలని, పునరవృతం కాకుండా చూసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ ప్రధాన కార్యదర్శి గౌతం రావు, కాచిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ బీజేపీ గ్రేటర్ ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, అశోక్ కులకర్ణి, కృష్ణకుమార్, సుభాష్‌పటేల్, క్షీర్‌సాగర్, సోమేష్, భల్వీర్, అరవింద్, హాజరిబాబు, ఎం.నర్సింగ్, ఆదినగేష్, రామదేవి, ప్రతిభ, వరలక్ష్మీ, ఆర్.సంతోష్, భీంరాజ్, అనంద్, సురేష్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు..
నేటి నుంచి తొలివిడత నామినేషన్లు

- 9వ తేదీ వరకూ గడువు
- 13న నామినేషన్ల ఉపసంహరణ



విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు తొలి విడత నామినేషన్ల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానున్నది. ఈనెల 1వ తేదీన గ్రామ పంచాయతీ ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ షెడ్యూల్ ప్రకారం తొలి విడతలో జరగనున్న 4480 గ్రామ పంచాయతీలకు సోమవారం నోటిఫికేషన్ విడుదల కానున్నది. అదే రోజు నుంచి అయా గ్రామ పంచాయతీల్లో సర్పంచు, వార్డు సభ్యులకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నది. ఈ ప్రక్రియ ఈనెల 9వ తేదీ వరకూ అయా గ్రామ పంచాయతీల్లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు సమర్పించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాల్లో పొందుపర్చిన విధంగానే సర్పంచు, వార్డు సభ్యులు అఫడవిట్లను సమర్పించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం పేర్కొన్నది. నామినేషన్ల ప్రక్రియ పూర్తికాగానే నిబంధనల మేరకు 10వ తేదీన నామినేషన్ల పరిశీలన అధికారులు చేపట్టనున్నారు. అదే విధంగా 11న రెవెన్యూ డివిజన్ అధికారుల (ఆర్డీఓ)కు పోటీ చేసే అభ్యర్థులు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది. 12వ తేదీన అభ్యర్థుల అప్పీల్‌ను ఆర్డీఓలు పరిష్కరించనున్నారు. 13న అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం గడువు విధించింది. 21వ తేదీన పోలింగు ఉదయం 7గంటల నుంచి 1గంటల వరకూ కొనసాగనున్నది. అదే రోజు కౌంటింగ్ పూర్తి చేసి సాయంత్రం వరకూ ఫలితాలను అయా రిటర్నింగ్ అధికారులు ప్రకటించనున్నారు.

రాష్ట్రంలో 12,732 గ్రామ పంచాయతీలు, 1,13,170 వార్డులకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. 19 గ్రామ పంచాయతీల్లో పలు కారణాలతో పాటు కోర్టుల్లో కేసులుండడం వల్ల ఎన్నికలు జరగడం లేదు. మరో 15 గ్రామ పంచాయతీల్లో పదవీకాలం పూర్తి కావడానికి ఇంకా సమయం ఉంది. ఈ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,13, 190 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది.

పంచాయతీ ఎన్నికలను మూడు విడతలుగా ఎన్నికలను నిర్వహించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తొలి విడతలో 4480 గ్రామ పంచాయతీల్లో, రెండో విడతలో 4137 పంచాయతీలకు, మూడో విడతలో 4115 గ్రామ పంచాయతీలకు పోలింగ్ నిర్వహించనున్నది. గ్రామ సర్పంచులుగా పోటీ చేసిన అభ్యర్థులు (జనరల్) స్థానాల్లో రూ.2000, రిజర్వుడు కేటగిరీ కింద రూ.1000, వార్డు మెంబర్ (జనరల్) రూ.500, రిజర్వుడు అభ్యర్థి అయితే రూ.250 చొప్పున ధరావత్తుగా చెల్లించాల్సి ఉంటుంది. ఎన్నికల ఖర్చుకు పరిమితి ఎన్నికల సంఘం విధించింది. 5వేల జనాభా దాటిన గ్రామ పంచాయతీల్లో పోటీ చేసే అభ్యర్థులు రూ.2.50లక్షలు, వార్డు మెంబర్లు రూ.50వేలు మించి ఖర్చు చేయరాదని, 5వేలు కంటే తక్కువ జనాభా కల్గిన గ్రామ పంచాయతీల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఖర్చును రూ.1.50లక్షలు, వార్డు మెంబర్లు రూ.30వేలుగా నిర్ణయించినట్టు నాగిరెడ్డి వెల్లడించారు. ఎన్నికల సంఘం నిర్ధేశించిన పరిమితి కంటే ఎక్కువగా ఖర్చుచేస్తే సర్పంచు, వార్డు మెంబర్ల తమ పదవులను కోల్పోవల్సి వస్తుంది.

ఫిబ్రవరి రెండో వారంలో ప్యాక్స్ ఎన్నికలు–17న నోటిఫికేషన్ విడుదల..?

- అదే నెల 25కల్లా డీసీసీబీ, టెస్కాబ్ ఎన్నికలు పూర్తి
- మొత్తం ప్యాక్స్ ఓటర్లు 20 లక్షల మంది

విజయక్రాంతి, హైదరాబాద్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్) ఎన్నికలకు ఈ నెల 17న నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ మేరకు రాష్ట్ర సహకారశాఖ రంగం సిద్ధం చేసింది. పంచాయతీ ఎన్నికలు ముగియగానే ఫిబ్రవరి రెండో వారంలో ఒకే రోజున 906 ప్యాక్స్ లకు ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. అదే రోజున ఓట్ల లెక్కింపు కూడా చేపట్టి గెలుపొందిన కమిటీని ప్రకటించనున్నారు. ఆ వెంటనే తొమ్మిది డీసీసీబీలు, తొమ్మిది జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలతోపాటు టెస్కాబ్ ల ఎన్నికలు పూర్తి చేయనున్నారు. ఈ ప్రక్రియంతా ఫిబ్రవరి 25కల్లా ముగించాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు.

ఎన్నికల అథారిటీకి చేరుకున్న ఓటర్ల జాబితాలు:

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలకంటే ముందే ఎన్నికల ప్రక్రియ ముగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎన్నికల ప్రక్రియ ఏర్పాట్లను రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ముమ్మరం చేసింది. ప్రాథమిక సహకార సంఘాలకు ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా కూడా తుది దశకు చేరుకుంది. రెండు జిల్లాలు మినహా మిగతా జిల్లాల నుంచి ఓటర్ల జాబితా ఎన్నికల అథారిటీకి అందింది. ఇందులో మొత్తం 18 లక్షల మందికిపైగా ఓటర్లు ఉన్నారు. మిగిలిన రెండు జిల్లాల నుంచి కూడా జాబితా వస్తే మొత్తం ఓటర్ల సంఖ్య 20 లక్షలకు చేరుకుంటుందని అధికారులు చెబుతున్నారు. సహకార సంఘంలో ఏడాది, అంతకంటే ఎక్కువ కాలం మెంబర్ గా కొనసాగిన వారినే ఓటరుగా గుర్తించనున్నారు. పూర్తిస్థాయిలో అన్ని జిల్లాల నుంచి ఓటర్ల జాబితా రాష్ట్ర సహకారశాఖ రిజిస్ట్రార్ ఆమోదానికి పంపాల్సి ఉంటుంది. వాటన్నింటిపై రాష్ట్రస్థాయిలో సహకారశాఖ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించనుంది. ఆ తరువాత తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. రాష్ట్రంలో ఉన్న ప్యాక్స్ లకు పర్సన్ ఇన్చార్జీలు పాలక వర్గాలుగా కొనసాగుతున్నారు. వాస్తవానికి గతేడాది జనవరిలో కొన్ని, ఫిబ్రవరిలో కొన్ని ప్యాక్స్ లకు పదవీకాలం ముగిసింది. దీంతో ఫిబ్రవరి రెండోవారంలో ఎన్నికలను నిర్వహించే సమయానికి పర్సన్ ఇన్చార్జీల పాలనకు సరిగ్గా ఏడాది పూర్తవుతుంది. మరోవైపు ఎన్నికలకు సంబంధించిన నిర్వహణ వ్యయాన్ని రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ నుంచి ఇవ్వనున్నారు.

ఎన్నికల సంఘం కార్యాలయంలో
గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు

విజయక్రాంతి, హైదరాబాద్: పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ప్రజలకు ఏర్పడే సందేహాలను నివృత్తి చేయడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం సలహా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఏసీ గార్డులో గల రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో తమ తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్ కుమార్ తెలిపారు. కార్యాలయాల పనివ్యవధితో పాటు రాత్రి 9 గం. నుండి ఉదయం 9 గం. వరకు కూడా పిర్యాదులు స్వీకరించ డం జరుగుతుందని ఆయన తెలిపారు. ఫిర్యాదులకై 04029802895 ఫోన్ చేయవచ్చని, అధికారులకు చర్య నిమిత్తము తెలియజేయబడుతుందని ఆయన తెలిపారు.

యువతతో దేశ నిర్మాణం: ప్రొఫెసర్ పోచన్న

విజయక్రాంతి ,అంబర్‌పేట్: దేశ భవిష్యత్ యువతపైనే ఆధారపడి ఉందని అవంతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.పోచన్న అన్నారు. నేటి యువత దేశాభివృద్ధిలో భాగస్వామ్యం ఐతే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. బర్కత్‌పురలోని అవంతి డిగ్రీ కళా శాలలో వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో లింగ ఆధారిత హింసపై నిర్వహించిన రెండు రోజుల వర్క్ షాపులో ఆయన ప్రసంగించారు. ప్రపంచంలోనే అతిపెద్ద స్థాయిలో 53 శాతం యువత భారతదేశంలో ఉన్నారని అన్నారు.

హార్వర్డ్ ఇండియా వార్షిక సదస్సు
కేటీఆర్‌కి ఆహ్వానం



విజయక్రాంతి, హైదరాబాద్: హార్వర్డ్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే హార్వర్డ్ ఇండియా వార్షిక కాన్ఫరెన్స్‌కు హాజరుకావాల్సిందిగా మాజీ మంత్రి , టిఆర్ఎస్ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షులు కె టి రామారావుకి ఆహ్వానం పలికింది. ఫిబ్రవరి 16, 17 వ తేదీల్లో అమెరికాలోని మసాచుసెట్స్ లో జరగనున్న ఈ సమావేశంలో వివిధ దేశాలకు చెందిన ప్రముఖ వ్యక్తులు హాజరుకానున్నారు. సమకాలీన భారత దేశం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లు , వివిధ అభివృద్ధి అంశాలపైన రెండు రోజుల పాటు ఈ సమావేశంలో చర్చించనున్నారు. సుమారు వెయ్యి మంది విద్యావేత్తలు , విద్యార్థులు, యువ వృత్తి నిపుణులు హాజరుకానున్న ఈ సమావేశానికి హాజరుకావాల్సిందిగా కేటీఆర్ కి ఆహ్వానం లభించింది. ఈ సమావేశంలో ప్రత్యేక వక్తగా హాజరై ప్రసంగించా ల్సిందిగా కేటీఆర్ యూనివర్సిటీ వార్షిక సదస్సు నిర్వాహకులు కోరారు.

టీకాంగ్ లో రచ్చకెక్కిన విభేదాలు

- ఓటమికి ఉత్తమ్ కుంతియాలే కారణం
- పార్టీ నుంచి సర్వే సస్పెన్షన్
- సస్పెండ్ చేసిన వారి భరతం పడతా:సర్వే



విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో విభేదాలు రచ్చకెక్కాయి. ఆదివారం గాంధీ భవన్‌లో జరిగిన మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గ సమీక్ష సమావేశంలో రసాభాస చోటుచేసుకుంది. ఈ సందర్బంగా మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ, టీపీసీసీ కార్యదర్శి బొల్లు కిషన్ల మధ్య వివాదం నెలకొంది. టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు కుంతియాపై సర్వే విమర్శలు గుప్పించారు.

దీంతో బొల్లు కిషన్, మహెష్ గౌడ్ సర్వే సత్యనారాయణ ప్రసంగాన్ని అడ్డుకొనే ప్రయత్నం చేశారు. అయినా కూడ సర్వే సత్యనారాయణ మాత్రం తగ్గలేదు. కిషన్ పై సర్వే సత్యనారాయణ ఆగ్రహంతో వాటర్ బాటిల్ ను విసిరేశారు. పార్టీ నాయకత్వం కొందరు దద్దమ్మలను, రౌడీలను పక్కన కూర్చోబెట్టుకొని తనపై దాడులకు పాల్పడే ప్రయత్నం చేసిందన్నారు. దీన్ని అడ్డుకొన్నవారిపైన ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం నుండి వాకౌట్ చేశారు. ఈ ఘటనకు నిరసనగా సోమవారం నాడు గాంధీ భవన్ ఎదుట నిరసన చేపట్టనున్నట్టు సర్వే ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై కాంగ్రెస్ పార్టీ సమీక్ష నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం నాడు మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సమావేశం గాంధీ భవనంలో జరిగింది.పార్టీలో ఏం జరుగుతోందో బట్టబయలు చేస్తాకాంగ్రెస్ పార్టీలో ఏం జరుగుతోందో తాను బట్టబయలు చేస్తానని ఆయన ప్రకటించారు. ఢిల్లీలో పార్టీ అధిష్టానానికి ఉత్తమ్ పై ఫిర్యాదు చేస్తానని సర్వే హెచ్చరించారు. పార్టీని బలోపేతం చేసే విషయమై తాను చెప్పిన మాటలను పార్టీ నాయకత్వానికి రుచించలేదన్నారు. అందుకే కొందరిని ఉద్దేశ్యపూర్వకంగానే తనపై దాడికి ప్రయత్నించారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి కారణాలు చెబుతుంటే మహేశ్ గౌడ్, బొల్లి కిషన్లతో ఉత్తమ్ తనపై దాడి చేయించినట్టు ఆరోపించారు. పార్టీలో కొందరు రౌడీ మూకలు ఉన్నారని ఒకరిద్దరు దద్దమ్మలు తనపై దాడి చేస్తున్నారని వ్యాఖ్యానించారు. పార్టీ గెలుపుకు సలహాలు ఇస్తుంటే, ఇది నచ్చనివారు తనపై దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. అర్హత లేని ఉత్తమ్‌కు పీసీసీ అధ్యక్ష బా ధ్యతలు ఇచ్చారని, ఆయనను పదవి నుంచి వెంటనే తొలగించాలని అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. సంఘటన జరిగిన వెంటనే సర్వేను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. అధిష్టానం ఆదేశాల మేరకు సర్వేను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ క్రమ శిక్షణ కమిటీ ఆదివారం ప్రకటించింది. మరోకవైపు సర్వే సత్యనారాయణ వీధి రౌడీలా ప్రవర్తించాడని, పార్టీ నేతలను తీవ్ర పదజాలంతో దూషించారని కిషన్ ఆరోపిస్తున్నారు.

సస్పండ్ చేసే అధికారం ఎవ్వరికి లేదు

పార్టీ నుంచి సస్పెండ్ చేయడంపై సర్వే సత్యనారాయణ ఘాటుగా స్పందించారు. తాను ఏఐసీసీ సభ్యుడినని, తనను సస్పండ్ చేసే అధికారం పీసీసీలో ఎవ్వరికీ లేదని తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. గతంతో కేంద్రమంత్రిగా వ్యవహరించానని, యూపీఏ ఛైర్పర్సన్ సోనియాగాంధీకి విధేయుడినని సర్వే అన్నారు. ఉత్తమ్, కుంతియా వల్లనే పార్టీ ఓడిపోయిందని, ఓటమికి కారణమైనవాళ్లే సమీక్ష చేయడమేంటని ప్రశ్నించానని ఆయన పేర్కొన్నారు. అసలు కాంగ్రెస్ అధిష్టానం వీరికి సమీక్ష చెయ్యమని చెప్పలేదని, ఎన్నికల్లో పోటీ చెయ్యని వాళ్లు సమీక్ష సమావేశంలో ఉండటమేంటని ఆయన ప్రశ్నించారు. నన్ను పార్టీ నుంచి సస్పండ్ చేసినవారిని విడిచిపెట్టేదిలేదని, వారి భరతం పడతానని, పదవులన్నీ ఊడపీకిస్తానని సర్వే హెచ్చరించారు.

హమారా షహర్



ప్రతి రోజూ రాళ్లు కొడితేనే కడుపు నిండేది. వృద్ధాప్యంలో ఉన్నా అసరా ఫించన్‌లు రావు. బతికి ఉన్నంత కాలం పని చేయాల్సిందే. ఇకనైనా ప్రభుత్వం దినసరి కూలీల సంక్షేమంపై శ్రద్ధ పెట్టాలి. ఈస్ట్ మారేడ్‌పల్లిలో గ్రానైట్ రాళ్లు కొడుతున్న కార్మీకులు

ప్రజలకు ఓటే ఆయుధం



- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్

విజయక్రాంతి, ముషీరాబాద్: ప్రజాస్వామ్య మనుగడకు ఓటు హక్కు తప్పనిసరని, ప్రజలకు ఓటే ఆయుధం అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్ పరిధిలోని జనప్రియ అపార్ట్మెంట్ దగ్గర బీజేవైఎం నగర అధ్యక్షుడు వినయ్ కుమార్ ఆధ్వర్యంలో ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో, బస్తీ, కాలనీలో ఉంటున్న ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఓటు నమోదు చేసుకోవడానికి ఈనెల 25 వరకు గడువు ఉన్నందున 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తెలంగాణా సహాయ కార్మిక కమిషనర్ల సంఘం ఆవిర్భావం



విజయక్రాంతి, మెహిదీపట్నం: తెలంగాణా సహాయ కార్మిక కమిషనర్ల సంఘం నూతనంగా ఆవిర్భవించిందని ఈ సంఘం తెలంగాణా గెజిటెడ్ ఆఫీసర్ల కేంద్ర సంఘంకు అనుబందంగా పనిచేస్తుందని తెలంగాణా సహాయ కార్మిక కమిషనర్ల సంఘం అధ్యక్షుడు బి.జాసన్ తెలిపారు. ఈ మేరకు సంఘం నాయకులు టిజిఓ రాష్ట్ర అధ్యక్షురాలు మమతను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. టిజిఓ రాష్ట్ర అధ్యక్షురాలు మమత మాట్లాడుతూ..కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పథకాల అమలులో అసిస్టెంట్ లెబర్ ఆఫీసర్‌ల పాత్ర కీలకమని చెప్పారు. సమావేశంలో ఉపాధ్యక్షులు ఎస్.రమేష్‌బాబు,కార్యదర్శి చంద్రశేఖర్‌గౌడ్, కే.భారతి, కార్యదర్శి బాలస్వామి, సిటి కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ, రాష్ట్ర స్థాయిలో
ఏబీవీపీ హైదరాబాద్ కార్యకర్తలకు స్థానం



విజయక్రాంతి, హైదరాబాద్: గుజరాత్‌లో ఇటీవల 64వ జాతీయ మహాసభలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ సభలకు హైదరాబాద్ నుంచి ఏబీవీపీ కార్యకర్తలు హాజరయ్యారు. గ్రేటర్ హైదరాబాద్‌కు సంబంధించి ఏబీవీపీ నాయకులకు పెద్దపీట వేయడం పట్ల ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ నగర కార్యదర్శి పగిడిపల్లి శ్రీహరి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పగిడిపల్లి శ్రీహరి మాట్లాడుతూ జాతీయ కార్యవర్గం, రాష్ట్ర కార్యవర్గంలో హైదరాబాద్ కార్యకర్తల స్థానంపై వారు చర్చించడం ఒక విధంగా కార్యకర్తలను ప్రోత్సహించడమేనన్నారు.జాతీయ కార్యదర్శిగా ఉదయ్, సీడబ్ల్యూసీ సభ్యులుగా ప్రవీణ్‌రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులుగా మట్ట రాఘవేందర్, అయ్యప్ప, పూజ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా ఎల్లస్వామి, శ్రవణ్‌లను నియమించినట్లు శ్రీహరి తెలిపారు. హైదరాబాద్ కార్యకర్తలకు జాతీయ, రాష్ట్రస్థాయిలో స్థానం కల్పించినందుకు జాతీయ నాయకత్వానికి శ్రీహరి ధన్యవాదాలు తెలియజేశారు.

మేరు కుల సంఘం సమస్యలు పరిష్కరిస్తా

- ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్

విజయక్రాంతి, ఉప్పల్: మేరు కుల సంఘం సమస్యలు పరిష్కారానికి సహకరిస్తానని ఎంబీసీ చైర్మన్ తాడూరిశ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఉప్పల్ కాప్రా సర్కిల్‌లోని మేరు కుల సంక్షేమ సంఘం 2019 నూతన కాలండర్ ఆవిష్కరణకు ముఖ్య అతిధులుగా ఎంబీసి చైర్మన్ తాడూరి శ్రీనివాస్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్, హెచ్‌బీ కాలని కార్పోరేటర్ గొల్లూరి అంజయ్య, మల్లాపూర్ కార్పోరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా మేరు కుల సంక్షేమ భవనానికి భూ కెటాయింపు విషంయం గురించి సియం కేసీఆర్ దృష్టికి తీసికెళతానన్నారు. . గొల్లూరు అంజయ్య మేరుకుల సంఘం నుద్దేశించి మాట్లాడుతూ కేసీఆర్ అనేక సంక్షేమ పలాలు ప్రతి ఒక్కరి అందేలా చేశారని, 24 గంటల కరెంటు వలన మేరు కులస్తులకు కుట్టు మిషన్లు వృత్తి పని కుంటు పడకుండా సజావుగా సాగుతున్నాయన్నారు. జిల్లా అధ్యక్షుడు రామగిరి మేరు కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షఉపాక్షులు కాటారం కృష్ణ, పొడిశెట్టి నర్సింహా, రాష్ట్ర జనరల్ సెక్రటరి రాగి పాపన్న,మట్టి సంగెవరన్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్, మురళీధర్, డీకొండ నర్సింగరావు, మహిళా నాయకులు బాయమ్మ, గజానన, జూన్9,నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీలికుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

విజయక్రాంతి, మెహిదీపట్నం: తెలంగాణా రాష్ట్ర నీలికుల సంఘం నూతన సంవత్సర 2019 క్యాలెండర్ ఆవిష్కరణ ఆదివారం కార్వాన్‌లోని షకిల్ ఫంక్షన్ హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్రీయ నీలికుల అధ్యక్షులు శ్రీ నారాయణ కాలప్‌గార్ ముఖ్య అతిధిలుగా విచ్చేసి మాట్లాడుతూ.. నీలికుల కులం అత్యంత వెనుకబడిన చేనేత కులమని రాజకీయంగా,ఆర్థికంగా చాలా వెనుకబడ్డారని ప్రభుత్వ సహాయం అందించాలని కోరారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి నీలికుల సంఘం అధ్యక్షులు ఎన్.అశోక్‌కుమార్, సంఘం ప్రధాన కార్యదర్శి అడ్కి మల్లికార్జున్, కోశాధికారి గౌని వీరన్న, సి.రమేష్, దొడ్ల పద్మారావు, పి.విజయ్‌నాథ్,ఎమ్.విజయ్‌కుమార్, వివిధ జిల్లాల నుండి వచ్చిన కుల పెద్దలు హాజరై నీలికుల పురోగతికి తీసుకోవలసిన చర్యల గురించి మాట్లాడారు.

ఈ నెల 8, 9న పలుచోట్ల నల్లా నీళ్లు బంద్

విజయక్రాంతి, హైదరాబాద్: నగరంలోని కొన్ని ప్రాంతాలకు మంగళవారం నీటి సరఫరా నిలిచిపోనుంది. కృష్ణా నుంచి నీటిని సరఫరా చేస్తున్న పంపింగ్ స్టేషన్ పరిధిలోని సబ్ స్టేషన్లలో మరమ్మతులు జరుగుతుండటంతో ఈనెల 8న ఉదయం 6 గంటల నుంచి 9వ తేదీ ఉదయం 6 గంటల వరకు నీటి సరఫరా నిలిచిపోతుందని వాటర్ బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది. ఈ పనుల నేపథ్యంలో రియాసత్ నగర్, సంతోష్ నగర్, వినాయకనగర్, సైదాబాద్, ఆస్మాన్ గడ్, చంచలగూడ, యాకత్‌పుర, మలక్‌పేట, మూసారాంబాగ్, నారాయణగూడ, బొగ్గులకుంట, అడిక్‌మెట్, శివం, చిలకలగూడ, బార్కాస్ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిచిపోనుందని జలమండలి అధికారులు తెలిపారు.

రక్షణమంత్రి మాటలన్నీ అబద్ధాలే..

(మొదటిపేజీ తరువాయి) హెచ్ఏఎల్‌కు ఆర్డర్లపై టైమ్స్ ఆఫ్ ఇండియా కథనాన్ని పూర్తిగా చదవాలంటూ రాహుల్‌కు చురకలంటించారు. హెచ్ఏఎల్‌కు రూ . లక్ష కోట్ల ఆర్డర్లు ఇచ్చే ప్రక్రియ జరుగుతోందని మాత్రమే తాను చెప్పినట్టు అందులో స్పష్టంగా ఉందన్నారు. ఆర్డర్ల జారీపై సంతకాలు చేశామని తాను ఎక్కడా చెప్పలేదన్నారు. 2014 నుంచి 2018 వరకూ హెచ్ఏఎల్‌కు ప్రభుత్వం రూ. 26,570 కోట్ల విలువైన కాంట్రాక్టులు అప్పగిస్తూ సంతకాలు జరిగాయని, మరో రూ. 73,000 కోట్ల విలువైన కాంట్రాక్టులు అప్పగించడంపై సంప్రదింపులు జరుగుతున్నాయని వివరిస్తూ నిర్మల సీతారామన్ కౌంటర్ ట్వీట్ చేశారు. దేశ ప్రజలను తప్పుదారి పట్టించినందుకు రాహుల్ పార్లమెంట్‌లో క్షమాపణ చెప్పి తన రాజీనామా చేస్తారా అని ఆమె ఘాటుగా ప్రశ్నించారు.

రాహుల్ ఏబీసీల నుంచి ప్రారంభించాలి: రక్షణ మంత్రిత్వ శాఖ

రాహుల్ ట్వీట్‌కు కౌంటర్‌గా రక్షణ మంత్రి కార్యాలయం కూడా ఆదివారం మరో ట్వీట్ చేసింది. రాహుల్ గాంధీ ఏబీసీల నుంచి ప్రారంభించవలసి ఉందని ఎద్దేవా చేసింది. 'రాహుల్ గాంధీ గారూ, మీరు నిజంగా ఏబీసీల నుంచి మొదలెట్టవలసి ఉన్నట్లు కనిపిస్తోంది. ప్రజలను తప్పుదోవపట్టించాలని మంకుపట్టుపట్టే మీలాంటివాళ్ళు వ్యాసాన్ని చదవకుండానే, దాన్ని ప్రస్తావిస్తారు" అని విమర్శించింది. కాగా రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందంలో భారీ అవినీతి జరిగినట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ గత కొన్ని నెలలుగా ఆరోపిస్తున్నారు. హెచ్ఏఎల్‌ను పక్కన పెట్టి అనిల్ అంబానికి లబ్ధి చేకూర్చేందుకు ప్రధాని మోదీ ఒప్పందాన్ని మార్చారని లోక్‌సభలో చర్చ సందర్భంగా మండిపడుతూ పలు ప్రశ్నలు సంధించారు. అయితే రక్షణ మంత్రి నిర్మల సీతారామన్ రఫేల్‌పై సుమారు రెండు గంటలపాటు పార్లమెంట్‌లో మాట్లాడారు. కాగా ఆమె పార్లమెంటులో అబద్ధాలు చెప్పారని, తన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేదని రాహుల్ ఆరోపించారు. అలాగే తాను అడిగిన ప్రశ్నలను ప్రజలు కూడా మోదీని అడగాలని ఆయన కోరారు.

శబరిమల ఉద్రిక్తతలపై నివేదిక ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి) విఫలమయ్యారన్న బీజేపీ వ్యాఖ్యలను ఆ రాష్ట్ర సీఎం పినరయి విజయన్ ఖండించారు. తాజా ఉద్రిక్తతలు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు సృష్టించినవేనని ఆయన విమర్శించారు. ఈ తరహా రాజకీయాలను తమ ప్రభుత్వం సహించబోదని స్పష్టం చేశారు. ఘర్షణలను కట్టడి చేయడంలో పోలీసుల వైఫల్యం ఏమీ లేదని, వారు సమర్థంగానే వ్యవహరించారని పేర్కొన్నారు. మరోవైపు కొన్ని గ్రామీణ ప్రాంతాలు మినహా కేరళ రాష్ట్రంలోని అన్ని చోట్ల బుధవారం నుంచి ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో అల్లర్లకు పాల్పడుతున్నారన్న అనుమానంతో రాష్ట్ర వ్యాప్తంగా 3,282 మందిని అరెస్టు చేసినట్లు ఆ రాష్ట్ర పోలీసులు వెల్లడించారు. అల్లర్లను ప్రోత్సహిస్తున్నవారిలో ఎక్కువ మంది బీజేపీ ఆర్ఎస్ఎస్ కార్యకర్తలే ఉన్నారన్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో పొత్తుతో లాభం లేదు

- డి.కె.అరుణ

విజయక్రాంతి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తులతో లాభం ఉండదని కాంగ్రెస్ సీనియర్ నేత డి.కె.అరుణ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్‌కు కంచుకోట మహబూబ్‌నగర్ జిల్లాలో ఓటమిని చూస్తే ఏదో జరిగిందన్న అనుమానం కలుగుతోందన్నారు. నగరంలో ఆదివారం ఆమె ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పార్టీ ప్రక్షాళనపై అధిష్టానం ఎప్పుడు నిర్ణయం తీసుకుంటుందో చూడాలన్నారు. పొత్తుల వల్ల అన్ని జిల్లాల్లో లాభం ఉండదని చెప్పామన్నారు. పొత్తుల వల్లే శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయామని కాదని, ఓటమికి చాలా కారణాలు ఉన్నాయని అరుణ అన్నారు.

ఫిబ్రవరిలో ఓటాన్ అకౌంట్

(మొదటిపేజీ తరువాయి) సమీక్షా సమావేశం నిర్వహించి బడ్జెట్ కేటాయింపులపై ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో ఈ నెలలో పూర్తిస్థాయి మంత్రివర్గం ఏర్పాటయ్యే అవకాశం ఉండటం దాని తర్వాతే కొత్త ఆర్థిక మంత్రితో సంబంధిత శాఖల మంత్రులు సమావేశమై బడ్జెట్ ప్రతిపాదనలను సమర్పించడానికి మరికొంత సమయం పడుతుందని దీంతో ప్రస్తుతం ఆదరాబాదరాగా బడ్జెట్ ప్రవేశపెట్టేకన్నా పార్లమెంట్ ఎన్నికల అనంతరం రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు నిర్వహించి బడ్జెట్‌లు ఆమోదించడం మేలని ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ముఖ్యమంత్రితో ఈ అంశాలపై చర్చించిన అనంతరం తుది నిర్ణయం వెలువడుతుందని విశ్వసనీయంగా తెలిసింది.

ఓటరు నమోదు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి

విజయక్రాంతి, ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మల్లాపూర్ డివిజన్ వార్డు కార్యాలయంలో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. ఓటు మన హక్కు కాబట్టి ఓటరుగా నమోదు చేసుకొని వచ్చే ఎన్నికల్లో మంచి నాయకున ఎన్నుకోనే భాద్యత మనందరికి ఉందని ఆయన పేర్కొన్నారు.

వచ్చే ఏడాదికి మహబూబ్‌నగర్ రైల్వే లైన్ పూర్తి

- గోవా, హుబ్లీకి తగ్గనున్న 102 కిలో మీటర్ల దూరం

కె. ప్రియకుమార్



హైదరాబాద్: మహబూబ్‌నగర్ – మునీరాబాద్ మధ్య తలపెట్టిన రైల్వే లైను నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ మార్గంలో దేవరకద్ర నుంచి జక్లేర్ వరకు 29 కిలోమీటర్ల రైలుమార్గం పూర్తై రైళ్ల రాకపోకలను ప్రారంభించారు. జక్లేర్ నుంచి కృష్ణ మిగిలిన 37 కిలోమీటర్ల పరిధిలో పనుల్లో దక్షిణ మధ్య రైల్వే వేగం పెంచింది. కృష్ణా తర్వాత రైలు మార్గం పనులను నైరుతి రైల్వే చేపట్టింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికల్లా ఈ రైల్వే లైనులో మునీరాబాద్ వరకు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల పరిధిలో మిగిలిన నిర్మాణం పనులు పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఈ మార్గం అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి గోవా, హుబ్లీ ప్రాంతాలకు వెళ్లే దూరం 102 కిలోమీటర్లు తగ్గడంతో పాటు, మహబూబ్‌నగర్ గ్రామీణ ప్రాంతాలకు రైల్వే సేవలు విస్తరించనున్నాయి. ప్రాజెక్టు విశిష్టతకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

మహబూబ్‌నగర్ – మునీరాబాద్‌ల మధ్య రూ. 1723 కోట్ల వ్యయం కాగా 247 కిలోమీటర్ల మేర కొత్తరైలు మార్గం నిర్మాణం 1997–98 ఆర్థిక సంవత్సరంలో మంజూరైంది. అందులో 66 కిలోమీటర్ల నిడివిగల మార్గం దక్షిణ మధ్య రైల్వే పరిధిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రాంతంలో ఉన్నది. మిగిలిన రైలు మార్గం నైరుతి రైల్వే పరిధిలో ఉన్న కర్ణాటక రాష్ట్రానికి చెందినది. రాష్ట్ర పరిధిలో రూ.372.09 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన దేవరకద్ర – కృష్ణా మధ్య 66 కిలోమీటర్ల నిడివిగల కీలకమైన కొత్త రైలు మార్గం నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయి.



దేవరకద్ర – జక్లేర్ (29 కిలోమీటర్లు) కొత్త రైలు మార్గం నిర్మాణం పూర్తి కావడంతో 2017 మార్చి 23న రైళ్ల ప్రయాణాన్ని ప్రారంభించారు. 2014–15 ఆర్థిక సంవత్సరం నుండి 2018 నవంబర్ వరకు ఈ మార్గం నిర్మాణం కోసం రూ.499 కోట్లు ఖర్చు చేశారు. 2018–19 సంవత్సరానికి బడ్జెట్‌లో రూ.175 కోట్ల నిధులు కేటాయించారు. జక్లేర్ – కృష్ణా మధ్య రైలు మార్గం పనులు పురోగమనంలో ఉన్నాయి. ఈ రైలు మార్గ నిర్మాణానికి 866 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతానికి 734 ఎకరాల భూమిని సేకరించి రైల్వేకి స్వాధీనం చేసింది. ఇంకా 132 ఎకరాలను రైల్వేకు స్వాధీనం చేయాల్సి ఉంది.

ఈ ప్రాజెక్టు ప్రధాన మంత్రి పర్యవేక్షణ బృందం (పీఎంజీ)లో చేర్చబడి పనుల పురోగతి ఎప్పటికప్పుడు సమీక్షి చేయబడుతున్నది. జక్లేర్ – కృష్ణ మధ్య మిగిలిన కొత్త రైలు మార్గ నిర్మాణం అత్యంత వేగంగా 2019–20 కల్లా పూర్తి చేయాలని లక్ష్యం నిర్ధేశించుకున్నారు.



ప్రాజెక్టుతో ప్రయోజనాలు

మహబూబ్‌నగర్ – మునీరాబాద్‌ల మధ్య నిర్మితమయ్యే కొత్త మార్గం నిర్మాణం సంపూర్ణమైతే మహబూబ్‌నగర్ జిల్లా – కర్ణాటకలోని రాయచూర్ జిల్లాలోని వెనుకబడిన ప్రాంతాల ప్రజల సామాజిక ఆర్థిక అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందని భావిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పెద్ద సంఖ్యలో అంటే 88.87 శాతం ఉన్న గ్రామీణ ప్రజలకు రైలు సేవలు, సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ఈ ప్రాంతాల ప్రజలకు రైల్వేతో అనుసంధానం ఏర్పడుతుంది. మహబూబ్‌నగర్ – మునీరాబాద్ కొత్త రైలు మార్గంతో హైదరాబాద్ నుండి హుబ్లీ, గోవాలకు మధ్య దూరం ప్రస్తుతం అందుబాటులో ఉన్న మార్గంతో పోలిస్తే సుమారు 102 కిలోమీటర్ల దూరం గణనీయంగా తగ్గుతుంది.

ప్రాజెక్టు ముఖ్యాంశాలివే

- మహబూబ్‌నగర్ – మునీరాబాద్‌ల (247 కిలోమీటర్లు) మధ్య కొత్త రైలు మార్గం అంచనా వ్యయం రూ.1723 కోట్లు.
- 2018 – 19 సంవత్సరానికి బడ్జెట్ కేటాయింపు రూ.157 కోట్లు.
- కృష్ణ – దేవరకద్ర (66 కిలోమీటర్లు) రైలు మార్గం అంచనా వ్యయం రూ.372 కోట్లు.
- ఇందులో భాగంగా 3 పెద్ద వంతెనలు, 82 చిన్న వంతెనలు, 5 రోడ్ ఓవర్ బ్రిడ్జీలు, 27 రోడ్ అంజర్ బ్రిడ్జీలు నిర్మించారు.
- మహబూబ్‌నగర్ – దేవరకద్ర – జక్లేర్ మధ్య కొత్త రైళ్లు ప్రవేశపెట్టడం వల్ల దేవరకద్ర – జక్లేర్ మార్గంలో రైలు సౌకర్యం లేని ప్రాంతాలు అభివృద్ధి పథంలో పురోగమించే అవకాశాలున్నాయి.
- మహబూబ్‌నగర్ – మునీరాబాద్‌ల మధ్య కొత్త రైల్వే మార్గం పూర్తయితే హైదరాబాద్ – హుబ్లీ, గోవాల మధ్య గణనీయంగా 102 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.

దేశంలో తొలిసారి ఎం ట్రైనర్ వ్యాన్

సమకూర్చుకున్న మెట్రో రైలు సంస్థ

- లాంఛనంగా ప్రారంభించిన ఎండీ ఎన్వీఎస్ రెడ్డి
- సిబ్బందికి పనిచేసే చోటే ఆధునిక ఏర్పాట్లపై శిక్షణ దీని ప్రత్యేకత

విజయక్రాంతి, హైదరాబాద్: మెట్రో రైలు స్టేషన్లలో మారణాయుధాలు, ప్రమాదకరమైన వస్తువులను అడ్డుకోవటంతో పాటు ఇతర భద్రత ఏర్పాట్లలో భాగంగా మరో అడుగు ముందుకు పడింది. మెట్రో రైలు వ్యవస్థలో భద్రతను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే రెండు మార్గాల్లో ప్రయణికుల రద్దీ పెరగటంతో పాటు త్వరలో హైటెక్ సిటీ మార్గం అందుబాటులోకి రానుంది. ఈ నేపథ్యంలో భద్రతా చర్యలపై మెట్రో అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా విధులు నిర్వహిస్తున్న చోటే సెక్యూరిటీ సిబ్బంది ఎప్పటికప్పుడు శిక్షణ ఇచ్చేందుకు మొబైల్ ట్రైనర్ వ్యాన్‌ను సమకూర్చుకున్నారు. ఆదివారం సంస్థ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఈ వ్యాన్‌ను లాంఛనంగా ప్రారంభించారు. భవన్ ప్రాంగణంలో బెంగాంపెట్లోని మెట్రో రైలువ్యాన్ (మొబైల్ ట్రైనింగ్ వ్యాన్)ను హెచ్ఎమ్ఆర్ఎల్ ఎన్వీఎస్‌రెడ్డి ప్రారంభించారు. మెట్రో రైలు స్టేషన్లలో, ఇతర సౌకర్యాలలో పనిచేస్తున్న భద్రతా సిబ్బందికి ఎక్కడికక్కడే శిక్షణ ఇస్తారు. దానిని భద్రతా శిక్షణలో 'ట్రాన్స్‌ఫార్మల్ లీప్' గా అభివర్ణించారు.



పనిచేసే విధానం

ఇది దేశంలో మొట్టమొదటిది, ఒక మొబైల్ వ్యాన్ ద్వారా భద్రతా సిబ్బందికి విధినిర్వహణలో శిక్షణ ఇవ్వటం దీని ప్రత్యేకత.టీవీ సెట్లు, సీసీటీవీ కెమెరా, ఫైర్ ఎక్విప్‌మెంట్, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు కలిగి ఉన్న ఈ మొబైల్ వాన్‌తో శిక్షణ ఇస్తారు. ఆడియోవీడియో ఫిలమ్స్, పి.పి.టి, పోస్టర్లు, బోర్డులు, హ్యాండ్ బుక్స్ తదితరాల ద్వారా ఈ శిక్షణను నిర్వహిస్తారు. ఇది నేషనల్ కమాండ్ సెంటర్ ద్వారా పర్యవేక్షించబడుతుంది. హార్డ్‌డిస్క్ జీపీఆర్ఎస్ తాజా టెక్నాలజీ ద్వారా ఎనేబుల్ చేయబడింది, దీని వలన సిబ్బంది స్థానాన్ని ట్రాక్ చేయవచ్చు. మెట్రో స్టేషన్లలో పని చేస్తున్న పోలీసు సిబ్బంది, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు చేస్తున్న మంచి పనులను ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేకించి తోలు రంధ్రాలు,



అత్యంత వాపుగల ద్రవాలలో మభ్యపెట్టే కత్తులు మోసుకెళ్ళే కొందరు ప్రయాణీకులను గుర్తించడం, పట్టుకున్న ఘటనలను గుర్తుచేశారు. వివిధ రకాల మెటల్ డిటెక్టర్లు, మొదలైనవాటిని జాగ్రత్తగా ఉపయోగించడం ద్వారా, భద్రతా తనిఖీల యొక్క ప్రాముఖ్యతను ప్రయాణీకులు అర్థం చేసుకోవటానికి, పట్టుబడిన ప్రమాదకరమైన పరికరాలపై ప్రజల్లో అవగాహన కల్పించలని సూచించారు. అదే సమయంలో, భద్రతా సిబ్బంది ప్రయాణికులతో మర్యాదగా ఉండాలని, మెట్రో స్టేషన్లలో స్నేహపూరిత విధానాలను పాటించాలని సలహా ఇచ్చారు. హైదరాబాద్ మెట్రో రైల్వే స్టేషన్లలో మూడు షిఫ్‌లలో సుమారు 900 మంది భద్రతా సిబ్బంది పనిచేస్తున్నారని హైదరాబాద్ డీసీపీ ఎ.ఎం.బాలకృష్ణ చెప్పారు. సీనియర్ అధికారులు డీవీఎస్ రాజు, లక్ష్మణ్, ఆనంద్ మోహన్, విష్ణు వర్ధనరెడ్డి, బీఎన్‌రాజేశ్వర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీబీఐ విచారణకు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి) ప్రత్యర్థులను వేధించే సంస్కృతిని బీజేపీ ప్రవేశపెట్టిందని, భవిష్యత్లో ఇది ఆ పార్టీకే ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. యూపీలో రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలిచేందుకు ఎస్పీ, బీఎస్పీ కృషి చేస్తున్నాయన్నారు. ఈ కూటమి విజయాలను ఆపాలనుకునేవారి వద్ద సీబీఐ ఉందన్నారు. తనను ప్రశ్నించాలని సీబీఐ అనుకుంటే, సమాధానాలు చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. అయితే బీజేపీ తప్పకుండా తెలుసుకోవలసిన విషయం ఒకటి ఉందన్నారు. ప్రజలు వారికి సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నట్లు బీజేపీ తెలుసుకోవాలన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో సీబీఐ విచారణతో తనను ప్రశ్నించారని, మరోసారి బీజేపీ తనపైకి సీబీఐని ఉసిగొల్పిందన్న ఆయన తాను ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. సీబీఐ ఎందుకు దాడులు చేపడుతోందో తనకు తెలియదని, వారికేం కావాలో అది తనను అడగవచ్చున్నారు. కాగా 2012–16 మధ్య ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా అఖిలేశ్ యాదవ్ ఉన్నారు. ఆ సమయంలో ఆయన గనుల మంత్రిత్వ శాఖను నిర్వహించారు. ఆ కాలంలో చేపట్టిన ఇసుక అక్రమ తవ్వకాల్లో నాడు సీఎంగా ఉన్న అఖిలేష్ యాదవ్ పాత్ర ఉన్నట్లు సీబీఐ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన్ను కూడా విచారించనున్నట్లు తెలుస్తోంది. ఇసుక తవ్వకాల్లో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలపై ఇప్పటికే ఐఏఎస్ అధికారి చంద్రకళ నివాసం సహా ఢిల్లీతోపాటు 12 చోట్ల అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. 2012–13 మధ్యలోనే ఈ అక్రమాలు జరిగినట్లు సీబీఐ పేర్కొంది. ఆ సమయంలో మైనింగ్ శాఖ బాధ్యతలను అప్పటి యూపీ సీఎం అఖిలేశ్ యాదవ్ నిర్వర్తించారు. ఆ తర్వాత మైనింగ్ శాఖను గాయత్రి ప్రసాద్ ప్రజాపతికి అప్పగించారు. దీంతో ఈ కేసులో ఆయనకు కూడా సమన్లు పంపించి విచారణ చేయనున్నట్లు సీబీఐ అధికారులు వెల్లడించారు. ఇసుక అక్రమ తవ్వకాల ఆరోపణలు ఎదుర్కొంటున్న సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్సీ రమేష్ మిశ్రా, బీఎస్పీ నేత రామ్ అవతార్ రాజ్పుత్ ఇళ్లలోను సీబీఐ అధికారులు శనివారం సోదాలు చేశారు. కాగా 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎస్పీ, బీఎస్పీ కలిసి పోటీ చేయాలని నిర్ణయించాయి. ఇరు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఖరారైనట్లు వార్తలు వచ్చిన వెంటనే అఖిలేష్ యాదవపై సీబీఐ విచారణ కలకలం రేపింది.

బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడిన వారిపైనే సీబీఐ దాడులు: కపిల్ సిబాల్

మరోవైపు అఖిలేష్ యాదవ్‌పై సీబీఐ దాడులు జరగొచ్చన్న వార్తలపై కాంగ్రెస్ నేత కపిల్ సిబాల్ స్పందించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఎస్పీ, బీఎస్పీ పొత్తు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ముందుగా ఊహించిందే జరుగుతోంది. బీజేపీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా వారిపై సీబీఐ దాడులు జరుగుతాయి. ఆ ప్రభుత్వ వైఖరి ఇలా ఉంది' అని కపిల్ సిబాల్ విమర్శించారు.

లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

విజయక్రాంతి, నర్సంపేట: నర్సంపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినంద నీయమని, ఇదే విధంగా కార్యక్రమాలు కొనసాగించాలని వరంగల్ రూరల్ జిల్లా కలెక్టర్ హరిత ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఆర్టీసీ సహకారంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ పాకాల వనదర్శిని యాత్ర అనే కార్యక్రమాన్ని ప్రతి ఆదివారం రూపొందించగా కలెక్టర్ హరిత ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరిత మాట్లాడుతూ అటవీ శాఖ వారితో కలిసి లయన్స్ క్లబ్ చేపట్టే ఈ కార్యక్రమం బాగుందని అన్నారు. ఈ సౌకర్యాన్ని అందరూ వినియోగించుకొని పాకాల అటవీ సంపదను చూసి ప్రకృతి పట్ల కృతజ్ఞతను చూపెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నరహరి రాజేందర్‌రెడ్డి, జోనల్ చైర్మన్ డాక్టర్ మట్ట భరత్ రెడ్డి, నల్లా భారతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

- జిల్లా ఎస్పీ అపూర్వరావు

విజయక్రాంతి, వనపర్తి: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా జరిగేలా పోలీసులు విధులు నిర్వహించాలని వనపర్తి ఎస్పీ అపూర్వరావు అన్నారు. వనపర్తి జిల్లా కార్యాలయంలోని సమావేశ భవనంలో జిల్లా పోలీసు అధికారులతో ఆదివారం నాడు జరిగిన పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో సంస్థాగత ఎన్నికలు ప్రశాంతంగా జరుగుటకు పూర్తి స్థాయిలో పోలీసు గస్తీ, పెట్రోలింగ్, బ్లూ కోర్ట్స్, గ్రామ పోలీసు అధికారులు నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని ఆమె చెప్పారు. ఎన్నికలకు సంబంధించి గ్రామాల్లో గొడవలు, మద్యం, డబ్బుపంపిణీ చేయడం లాంటి సమాచారం వస్తే వెంటనే అధికారులు స్పందించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించడంతో పాటు, ఎన్నికల సమయంలో గొడవలను సృష్టించే వ్యక్తులను గుర్తించి, వారి కదిలికలపై నిఘా పెట్టాలన్నారు.

పంచాయతీ రిజర్వేషన్లలో కేసీఆర్‌ది మోసపూరిత వైఖరి



- ఆర్. కృష్ణయ్య

విజయక్రాంతి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం తప్పిదంతో బీసీలకు దక్కాల్సిన 1400 గ్రామ పంచాయతీలు, 18 వేల వార్డులు చేజారిపోయాయని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆ. కృష్ణయ్య ఆందోళన వెలిబుచ్చారు. 22శాతం అమలు చేస్తామని చెప్పి వాస్తవంలో 18శాతం మాత్రమే అమలు చేశారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లు తగ్గిస్తుంటే వివిధ రాజకీయ పార్టీల్లోని బీసీ నేతలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పంచాయతీరాజ్‌లో 34శాతం బీసీ రిజర్వేషన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ అఖిల పక్షాలతో కలిసి ఆదివారం ధర్నాచౌక్‌లో మహాధర్నా చేపట్టారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నేతలు గుజ్జ కృష్ణ, సి. రాజేందర్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1980 నుంచి 1986 వరకు చేసిన అనేక పోరాటాలతో 34శాతం రిజర్వేషన్లను సంపాదించుకున్నామని తెలిపారు. ఎన్ని పోరాటాలైనా చేసి త్యాగాలకు సైతం వెనకాడకుండా వీటిని కాపాడుకోవలసిన బాధ్యత బీసీ నేతలతో పాటు అందరిపైనా ఉందన్నారు. రెండోసారి గెలిచిన సీఎం కేసీఆర్ ఏం చేసినా నడుస్తుందనే అహంకారంతో వ్యవహరించటం తగదన్నారు. హైకోర్టులో ఇంటీరియమ్ స్టేను ఎత్తివేయటంతో పాటు, పలు ప్రత్యామ్నాయాలున్నా కావాలనే ప్రయత్నం చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేల రద్దు కేసులో తీసుకున్న శ్రద్ధ బీసీలపై లేకపోయిందని ఎద్దేశా చేశారు. కార్యక్రమంలో టీజేఎస్ అధినేత ప్రొఫెసర్ కోదండరాం, రాష్ట్ర నాయకుడు ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్ రావులు మాట్లాడుతూ రిజర్వేషన్ల పరిరక్షణకు బీసీ సంఘాలు చేసే పోరాటాలకు తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ధర్నాలో టీడీపీ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి రామేశ్వర్, టీజేఎస్ నేత సత్యం గౌడ్, బీసీ నేతలు గుజ్జకృష్ణ, నీల వెంకటేష్, కోలా జనార్ధన్, అనంతయ్య, దాసు సురేష్, సి. రాజేందర్, జి. కృష్ణాయాదవ్, జైపాల్ ముదిరాజ్, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

'శబరిమల'పై కమ్యూనిస్టుల కుట్ర

(మొదటిపేజీ తరువాయి) వాతావరణ నెలకొనే విధంగా చర్యలు తీసుకోవాలని దత్తాత్రేయ సూచించారు.

రాజకీయ లబ్ధి కోసమే టీఆర్ఎస్ అబద్ధాలు

ఈ సందర్భంగా టీఆర్ఎస్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందాలన్న దురుద్దేశంతోనే.. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం సాయం చేయడం లేదంటూ టీఆర్ఎస్ ఆరోపిస్తోందన్నారు. టీమ్ ఇండియా స్ఫూర్తితో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మోడీ సర్కారు సత్సంబంధాలు కొనసాగిస్తున్నారని ఆయన చెప్పారు. తమ ప్రభుత్వం ఏ రాష్ట్రంపై సవతితల్లి ప్రేమ చూపించడం లేదన్నారు. నాలుగున్నరేళ్ల కాలంలో రూ. 2 లక్షల కోట్లను తెలంగాణకు కేంద్రం ఇచ్చిందన్నారు. 11 సాగునీటి ప్రాజెక్టులు, 24 గంటల విద్యుత్ సరఫరాకు ఉత్తర, దక్షిణ పవర్ గ్రిడ్ లను అనుసంధానం చేయడానికి యాదాద్రి పవర్ ప్రాజెక్టుకు రూ. 50 వేల కోట్లను కేటాయించిందని వివరించారు. తెలంగాణకు 24 గంటల కరెంట్‌ను కేంద్రమే ఇచ్చిందన్నారు. జాతీయ రహదారుల కోసం రూ.60 వేల కోట్లను ఖర్చు చేస్తోందని తెలిపారు. బయ్యారం స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి కేంద్రం సిద్ధంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వమే తప్పించుకునే ధోరణి అవలంబిస్తోందని దత్తాత్రేయ విమర్శించారు. రాష్ట్రానికి కేంద్రం మంజూరు చేసిన నిధులు, ప్రాజెక్టులు.. పథకాలపై ఓ పుస్తకాన్ని ప్రింట్ చేసి గ్రామ గ్రామాన పంపిణీ చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తామన్నారు. ఈ నెల 11, 12 తేదీల్లో పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశాలు ఢిల్లీలో జరుగుతున్నాయని, ఈ సమావేశాల్లో లోక్‌సభ ఎన్నికల కోసం పటిష్టంగా ప్రణాళిక రూపొందిస్తామని దత్తాత్రేయ తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు ఎస్ మల్లారెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు టీటీఎఫ్ మద్దతు

విజయక్రాంతి, హైదరాబాద్: సార్వత్రిక సమ్మెకు తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ (టీటీఎఫ్) మద్దతు ప్రకటించింది. ఈ మేరకు టీటీఎఫ్ అధ్యక్షుడు ఇ.రఘునందన్, ప్రధాన కార్యదర్శి కె.రమణ ఒక ప్రకటన విడుదల చేశారు. పోరాడి తెచ్చుకున్న చట్టాలను మోదీ ప్రభుత్వం కాలరాస్తున్నదని వారు విమర్శించారు. దేశవ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ సంఘాలు జనవరి 8, 9 తేదీల్లో తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఆ రెండు రోజులు మండల, డివిజన్, జిల్లా కేంద్రాల్లో జరిగే ర్యాలీలు, సమావేశాల్లో టీటీఎఫ్ కార్యకర్తలందరు పాల్గొనాలని వారు కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై పోరాటాలని, అందు కోసం ఉపాధ్యాయులందరు సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

నెట్ నిబంధన తొలగించాలి

- ఎస్సీ విద్యార్థుల ఆందోళన

విజయక్రాంతి, హైదరాబాద్: పరిశోధనల కోసం ప్రోత్సహించాల్సిన కేంద్ర ప్రభుత్వం, యూజీసీ కొత్త నిబంధనలతో ఎస్సీ విద్యార్థులను పరిశోధనల నుండి దూరం చేస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. నూతన నిబంధనలతో గత మూడు సంవత్సరాలుగా ఫెలోషిప్‌లను సకాలంలో విడుదల చేయకపోగా తాజాగా ఫెలోషిప్ అర్హత కోసం నెట్ నిబంధనను తప్పనిసరి చేయడంతో ఎస్సీ విద్యార్థులు నష్టపోయే అవకాశముందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీసీ, ఎస్టీలకు కాకుండా కేవలం ఎస్సీ విద్యార్థులకు మాత్రమే ఫెలోషిప్ కోసం నెట్ తప్పనిసరిగా కలిగి ఉండాలనే నిబంధన విధించారని వారు వాపోతున్నారు. గత మూడేళ్లుగా యూజీసీ ఫెలోషిప్‌లను విడుదల చేయకపోవడంతో ఇప్పటికే 6000 స్లాట్స్ నష్టపోయామని, ఆ 3 సంవత్సరాలతో కలిపి ఈ విద్యా సంవత్సరం 8000 స్లాట్స్ విడుదల చేస్తామని ఎదురు చూస్తున్న సమయంలో ఇలాంటి నిబంధన విధించడం సరికాదని ఎస్సీ విద్యార్థులు అంటున్నారు. దీనితో సామాన్య ఎస్సీ విద్యార్థులు పరిశోధన విద్యను మరిచిపోయే పరిస్థితి ఉంటుందన్నారు. అధ్యాపకుల నియామకానికి సంబంధించి 2021 సంవత్సరం నుంచి నెట్ నిబంధనను తప్పనిసరి అని ప్రకటించిన యూజీసీ, విద్యార్థుల పరిశోధనకు మాత్రం ఈ సంవత్సరం నుంచే అమలు చేయాల్సిన అవసరమేమొచ్చిందని వారు ప్రశ్నిస్తున్నారు. నెట్ తప్పనిసరి నిబంధనను తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌లను ఆదివారం రాష్ట్ర మాజీ మంత్రులు టీ. హరీష్‌రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డిలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ కమిటీ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అధికారులు అనురాధ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలలోగా పనులు పూర్తి చేయాలి

• సీఎంవో కార్యదర్శి భూపాల్‌రెడ్డి

విజయక్రాంతి, యాదగిరికొండ: యాదాద్రి ఆలయ అభివృద్ధి విస్తరణ పనులను ఆదివారం సీఎంవో కార్యదర్శి భూపాల్‌రెడ్డి, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావులు పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులలో వేగం పెంచాలన్నారు. బ్రహ్మోత్సవాలలోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. స్తపతుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలో సీఎం కేసీఆర్ యాదాద్రిలో పర్యటించనున్నందున పనులలో వేగం పెంచాలని లేదంటే సంబంధిత కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుందరరాజన్, ఆనందవేలు, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి, శిల్పార్ట్ స్థపతి మోగిలి ఆలయ ఈవో ఎన్ గీతారెడ్డి, సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.



అర్హులందరినీ ఓటరు జాబితాలో చేర్చాలి

• జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్

విజయక్రాంతి, కరీంనగర్: త్వరలో జరుగనున్న పార్లమెంటు ఎన్నికలను సంబంధించి జనవరి 1వ తేదీ 2019 వరకు 18 సంవత్సరాలు నిండిన అర్హులైన వారందరిని ఓటర్లుగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు డోర్‌టూ డోర్ సర్వే చేసి అర్హులైన ఓటర్లను గుర్తించాలని అన్నారు. ప్రతి బీఎల్వో హౌస్‌హోల్డ్ రిజిష్టర్ నిర్వహించి అందులో ఇంటి నంబర్ల వారిగా ఓటర్ల వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల సెల్‌ఫోన్ నెంబర్లు కూడా సేకరించి రిజిస్టర్‌లో నమోదు చేయాలని అన్నారు. జనవరి 25వ తేదీ వరకు క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ స్వీకరించాలని తెలిపారు. రెవెన్యూ, బూత్‌లెవల్, మున్సిపల్ బిల్‌కలెక్టర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. నగరంలోని అన్ని డివిజన్లలో ఇంటింటికి తిరిగి ఓటరు నమోదు చేయాలని అన్నారు. అలాగే జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలకు వెళ్లి 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటరు నమోదు చేయాలని సూచించారు. ఓటర్ల జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని, ఒక డివిజన్‌లోని ఓటరు ఇంకో డివిజన్‌లో పోలింగ్ కేంద్రంలో ఉంటే వాటిని సరిచేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వారిగా ఏ ఒక్క ఓటు కూడా తప్పి పోకుండా ఓటరు నమోదు చేసి ఈ ప్రక్రియను ఈ నెల 25 వరకు పూర్తి చేయాలని అన్నారు. సమావేశంలో జేసీ శ్యాంప్రసాద్‌లాల్, అసిస్టెంట్ కలెక్టర్లు ప్రావీణ్య, రాజర్షిషా, ఆర్డీవో ఆనందకుమార్, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, పడి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో తోపులాట

• రాష్ట్ర పరిశీలకుడి సాక్షిగా గలాటా..



విజయక్రాంతి, అశ్వారావుపేట: టీఆర్ఎస్ పార్టీ అశ్వారావుపేట నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు వర్గం ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి తోపులాటకు దారితీసింది. వివరాల్లోకి వెళితే అశ్వారావుపేట నియోజకవర్గంలో ఘోరంగా ఓటమి చవిచూసిన టీఆర్ఎస్ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ఆదివారం మండల పరిధిలోని వినాయకపురం గ్రామంలో మధ్యాహ్నం రెండు గంటలకు నియోజకవర్గ విస్తృతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి తక్కెళ్లపల్లి రవీందరరావు, జిల్లా ఇన్‌చార్జ్ నూకల నరేష్‌రెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిధులుగా హాజయ్యారు. సభను ప్రారంభించి రాష్ట్ర కార్యదర్శి రవీందరరావు మాట్లాడుతుండగా ఎంపీ వర్గీయులు ఒక్కసారిగా వేదికపైకి దూసుకువచ్చారు. తాటికి నియోజకవర్గ బాధ్యతలు అప్పగిస్తే తాము పంచాయతీ ఎన్నికలకు సహకరించేది లేదని తెగేసి చెప్పారు. కష్టపడి పనిచేసిన వారికి కనీస గౌరవం దక్కకుండా చేస్తున్నారని వాగ్వాదానికి దిగారు. తాటి చేసుకున్న తప్పిదాల వలనే ఎన్నికల్లో ఘోరంగా ఓటమి చెందారని తామంతా కష్టపడి పనిచేశామన్నారు. అయినా తమపై చిన్న చూపు చూస్తూ నిందలు మోపుతున్నారంటూ ఘర్షణకు దిగారు.

తాటికి బాధ్యతలు అప్పగిస్తే ఒప్పుకోము..

తాటికి నియోజకవర్గ బాధ్యతలు అప్పగిస్తే పార్టీ మరింత భ్రష్టు పట్టిస్తారని ఎంపీ పొంగులేటి ప్రధాన అనుచరుడు జూపల్లి రమేష్ అన్నారు. ఒకానొక దశలో కుర్చీలను విసురుకునేందుకు ఇరువర్గాలు సిద్ధపడ్డారు. విషయం గమనించిన అశ్వారావుపేట సీఐ అబ్బయ్య రంగప్రవేశం చేసి కార్యకర్తలకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. పార్టీ కార్యదర్శి రవీందరరావు కలుగజేసుకుని మాట్లాడుతూ.. వివాదాలకు ఇది వేదిక కాదని మీ సమస్యలను లిఖిత పూర్వకంగా తనకు అందజేయాలని కార్యకర్తల ప్రతి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో గొడవ సద్దుమణిగింది.



ఓసీపీ–2 ఓబీ పనులను అడ్డుకున్న రచ్చపల్లి భూ నిర్వాసితులు..!

• 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాకే పనులు నిర్వహించాలని డిమాండ్..!

విజయక్రాంతి, మంథని: మంథని నియోజకవర్గం పరిధిలోని రచ్చపల్లి గ్రామ సింగరేణి భూ నిర్వాసితులు ఆర్జీ –3 పరిధిలోని ఓసీపీ–2 ఓబీ పనులను ఆదివారం మరోమారు అడ్డుకున్నారు. 2005 చట్టం, 65 జీవో ప్రకారం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రూ. 2.30 లక్షలు ఇస్తామని అధికారులు చెబుతున్నారని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం మాత్రమే తమకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలని, అప్పటి వరకు ఎస్‌సిసి ఓబి పనులను అడ్డుకొని తీరుతామని నిర్వాసితులు మరోమారు హెచ్చరించారు. ఓసీపీ–2 విస్తరణలో భాగంగా రచ్చపల్లి గ్రామాన్ని 2013 నుంచి 2015 మధ్య కాలంలో సింగరేణి తీసుకోని ఇండ్లకు, వ్యవసాయ భూములకు నష్టపరిహారం చెల్లించింది కానీ నేటికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పునరావాసం కల్పించకపోవడంతో సదురు సింగరేణి భూ నిర్వాసితులు అందోళన బాట పట్టారు. గత పక్షం రోజుల్లో రెండు సార్లు పెద్దపల్లి జాయింట్ కలెక్టర్ వనజాదేవి, ఆర్జీ –3 జీఎం సూర్యనారాయణ రచ్చపల్లి భూ నిర్వాసితులతో ప్రత్యేక సమావేశం నిర్వహించినా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీపై స్పష్టత రాలేదు. రేపు, మాపు అనుకుంటూ మూడేళ్లుగా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించకుండానే అడ్రియాల, రచ్చపల్లి గ్రామాల చుట్టూ ఓబి డంపు యార్డు పనులు చేపట్టడంపై విసిగి వేసారిన నిర్వాసితులు వారం రోజుల క్రితం ఓసీపీ– 2ను దిగ్బందించారు. తాజాగా మరోమారు ఆదివారం ఓబీ పనులను అడ్డుకున్నారు. కార్యక్రమంలో రచ్చపల్లి, ఆడ్రియాల గ్రామస్థులు కనవేన శ్రీనివాస్, రాంపెల్లి నాగరాజు, కనవేన రమేష్, సల్పాల రమేష్, గుర్రాల సదానందం, కెక్కర్ల భూమయ్య, ప్రవీణ్, ఆకాష్, రాకేష్, శ్రీనివాస్, గోపాల్, రాజయ్య, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియామవళిని పకడ్బందీగా అమలు చేయాలి

• జిల్లా జాయింట్ కలెక్టర్ యాస్మిన్ బాషా

విజయక్రాంతి, సిరిసిల్ల: పంచాయతీ ఎన్నికలలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందిగా అమలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశించారు. ఎన్నికల ఉల్లంఘనలపై తక్షణమే స్పందించాలని అన్నారు. సోమవారం నుంచి మొదటి దశ ఎన్నికలకు నామినేషన్ ప్రక్రియ ప్రారంభ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు, పంచాయతీ రాజ్ అధికారులు ఎంపిడివోలతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని వేములవాడ, వేములవాడ రూరల్ బోయిన్‌పల్లి, చందుర్తి, రుద్రంగి మండలాలలోని గ్రామాలలో తొలిదశ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని సూచించారు. ఈనెల 7 నుంచి 9వ తేది వరకు నామినేషన్‌ల స్వీకరణ ఉంటుందన్నారు.10వ తేది నామినేషన్ల పరిశీలన, 11న ఉపసంహరణకు అవకాశం ఇవ్వాలన్నారు. జనవరి 21న మధ్యాహ్నం 1 వరకు పోలింగ్, 2 గంటలకు కౌంటింగ్ ప్రారంభం ఫలితాల విడుదల చేయాల్సి ఉంటుందన్నారు. మొదటి విడత ఎన్నికలలో జరిగే గ్రామాలకు సంబందించి అన్ని ఏర్పాట్లు ఆదివారం సాయంత్రం కల్లా సిద్దం చేయాలన్నారు. నోటిఫికేషన్ వివరాలు అన్ని గ్రామ పంచాయతీ కేంద్రాల్లో ప్రదర్శించాలన్నారు.జిల్లాలో మూడు చోట్ల స్టాటిక్ సర్వెలెన్స్ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ బృందాల ద్వారా ఎన్నికలు పారదర్శకంగా నిష్పక్షపాతంగా ధన, మద్య ప్రభావం లేకుండా ఎన్నికలు నిర్వహించాలన్నారు. ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరిగితే తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారులు,ఎంపిడివోలు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా సాధనకు కలిసికట్టుగా ఉద్యమిద్దాం: జూలకంటి

విజయక్రాంతి, మిర్యాలగూడ: మిర్యాలగూడను జిల్లాగా గుర్తించేంత వరకూ సబ్బండ వర్గాలు కలిసికట్టుగా ఉద్యమాలు జరపాలని, అప్పుడే ప్రభుత్వం దిగొచ్చి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుందని మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. జిల్లా సాధన సమితి సభ్యులు ఎంఏ.సాజిద్‌ఖాన్, కందుకూరి శ్రీధర్‌గుప్త, జాడి రాజు, సిహెచ్.పద్మల నేతృత్వంలో జరుగుతున్న రిలే నిరాహారదీక్షలకు ఆదివారం మద్దతు తెలిపిన అనంతరం మాట్లాడారు. అర్హత లేని ప్రాంతాలను ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాగా గుర్తించి అన్ని అర్హతలున్న మిర్యాలగూడను విస్మరించడం సరికాదన్నారు. సొంత జిల్లాలకు కేసీఆర్ అధిక ప్రేమ చూపుతూ కొన్ని ప్రాంతాలపై వివక్ష చూపడం ప్రజలను అగౌరవపర్చడమేనన్నారు. దీక్షల్లో జనసేన నాయకులు పవన్, వెంకటేష్, హుస్సేన్ కూర్చొన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డబ్బికార్ మల్లేష్, బీజేపీ నాయకులు బంటు సైదులు, కాంగ్రెస్ నాయకులు ముజ్జా రామకృష్ణ, ఫెయిత్‌బంజార ఆశ్రమ నిర్వాహకులు హన్యానాయక్ పాల్గొన్నారు.

దేశ రాజకీయాల్లో.. టీఆర్ఎస్ కీలకపాత్ర

• ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి

విజయక్రాంతి, మిర్యాలగూడ: దేశ రాజకీయాల్లో టీఆర్ఎస్ పార్టీ క్రియాశీలక పాత్ర పోషిస్తుందని ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ నల్లగొండ నుంచి పోటీ చేయనున్నట్టు వార్తలు వినవస్తున్నాయని, అలా చేస్తే తాము స్వాగతిస్తామన్నారు. కేసీఆర్‌ను 3–4 లక్షల మెజార్టీతో గెలిపిస్తామన్నారు.

కాంగ్రెస్‌కు ఓటమి తప్పదు..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన కొందరు కాంగ్రెస్ నాయకులు ఎంపీ స్థానాలకు పోటీ చేస్తామని ప్రకటనలు చేస్తున్నారని వారికి ఓటమి తప్పదన్నారు. గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని, అందులో భాగంగానే గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవమైన పంచాయతీలకు ప్రభుత్వం రూ.10 లక్షలు, ఎంపీ, ఎమ్మెల్యే నిధుల నుంచి మరో రూ.10 లక్షలు అందిస్తామన్నారు. పార్టీలకతీతంగా శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సమావేశంలో మాజీ శాసన సభ్యులు తిప్పన విజయసింహారెడ్డి, నాయకులు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, తిరునగరు భార్గవ్, ధనావత్ చిట్టిబాబునాయక్, ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి, మట్టపల్లి సైదులుయాదవ్, నూకల హనుమంతరెడ్డి, మగ్దుం పాషా, పెద్ది శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

బాధ్యతతో పనిచేసే ఉద్యోగులను సమాజం గుర్తిస్తుంది

• మాజీ ఎమ్మెల్సీ సీతారాములు

విజయక్రాంతి, నకిరేకల్: వృత్తిని దైవంగా భావించి బాధ్యతతో పనిచేసే ఉద్యోగులను సమాజం ఎప్పటికీ గుర్తిస్తుందని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు అన్నారు. నియోజకవర్గంలోని చిట్యాల మండలం చిన్నకాపర్తి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన కుకుడాల గోవర్ధన్ వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాలు చాలా మందికి దక్కుతాయని కానీ ఆ ఉద్యోగం ద్వారా ప్రజలకు దగ్గర అయిన వ్యక్తిని చిరకాలం ప్రజలు గుర్తుంచుకుంటారని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి పరమ పవిత్రమైనదని, భావిభారత పౌరుల భవిష్యత్తు వీరి చేతుల్లోనే ఉంటుందని, ఈ బాధ్యతలు నిర్వర్తించే వారు వృత్తి ధర్మంలో నిబద్ధత చూపించాల్సిన అవసరం ఉందని అన్నారు. బాలలను ఉన్నత స్థితిలో నిలిచేలా శక్తి వంచన లేకుండా కృషి చేయాలని సీతారాములు సూచించారు. నార్మాక్స్ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల జీవితం చాలా గొప్పదని ఆ దశలో మంచి విద్యా బుద్ధులు నేర్పించిన గురువులను జీవితాంతం గుర్తుంచుకుంటామని, ఆ వృత్తిలో ఉన్న వారంతా విద్యార్థులు తమ జీవితాంతం గుర్తుంచుకునే విధంగా వారిని తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన కుకుడాల గోవర్ధన్‌ను శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తులే కాదు.. నేర చరిత్రా వెల్లడించాలి!

• సర్పంచ్ అభ్యర్థులకు సవాలుగా మారిన అఫిడవిట్
• తప్పుడు సమాచారమిస్తే అనర్హత వేటు
• నేడు తొలి విడత నోటిఫికేషన్

విజయక్రాంతి, ఇల్లందు: స్థానిక సంస్థల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఆస్తులే కాకుండా.. వారి నేర చరిత్ర కూడా వెల్లడించాలని, అది కూడా అఫిడవిట్ రూపంలో సమర్పించాలని ఎన్నికల సంఘం పలు నిబంధనలు విధించింది. ఆ నిబంధనలు కాస్త సర్పంచ్ పదవికి పోటీకి దిగుతున్న అభ్యర్థులకు పెద్ద సవాల్‌గాను, తల నొప్పిగాను మారింది. అంతేకాక తప్పుడు సమాచారమిస్తే అనర్హత వేటు తప్పదని ఈసి పేర్కొంది. రాష్ట్ర వ్యాపితంగా మూడు విడతల్లో పంచాయితీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం ఉత్తర్వులు వెలువరించింది. ఈ నెల 21, 25, 30 తేదీల్లో ఎన్నికలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా మొదటి విడతగా నిర్వహించనున్న ఎన్నికలకు గాను 7వ తేదిన తొలి నోటిఫికేషన్ ఈసి విడుదల చేయనుంది. పంచాయితీ యుద్ధ క్షేత్రంలో దిగనున్న అభ్యర్థులకు ఉండాల్సిన అర్హతలు, పాటించాల్సిన నిబంధనలు, సమర్పించాల్సిన అఫిడవిట్‌లను ఎలక్షన్ కమీషన్ స్పష్టం చేసింది. దాని ప్రకారం సర్పంచ్, వార్డు సభ్యులు తమ ఆస్తులు, నేర చరిత్రల చిట్టా, విద్యార్హతలు తప్పనిసరిగా ఈసికి అందజేయాల్సి ఉంటుంది. నామినేషన్ పత్రాలతో పాటు వాటికి సంబంధించిన వివరాలతో కూడిన అఫిడవిట్‌ను అందించాల్సి ఉంది. ఆస్తుల వివరాలతో పాటుగా ఉమ్మడి కుటుంబ ఆస్తులు, పోలీస్ కేసులు, కోర్టు కేసులు, శిక్షలు ... ఇలా అన్నీ కూడా అందించాల్సిందే. పోటీ చేసే అభ్యర్థులు ఏదీ కూడా రహస్యంగా దాచుకోడానికి వీలు లేదు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఎమ్మెల్యే అభ్యర్థులు అందించే అఫిడవిట్ మాదిరిగానే సర్పంచ్ అభ్యర్థులు కూడా సమర్పించాలి. ఒకవేళ తప్పుడు సమాచారంతో కూడిన నామినేషన్ దాఖలు చేస్తే, అది కాస్త తిరస్కరణకు గురవుతుంది. 2003 సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నేర చరిత్ర, ఆదాయం, వ్యయాలు, ఆస్తులు, విద్యార్హతలతో కూడిన సమాచారాన్ని నామినేషన్ పత్రాలతో పాటు సమర్పించి, బహిరంగ పర్చాలనే నిబంధన విధించింది.



స్థానిక సమరంలో రేషన్ డీలర్లు

• పోటీకి అవకాశం కల్పించిన ఈసీ

విజయక్రాంతి, ఇల్లందు: గ్రామ పంచాయతీ ఎన్నికల పోటీలో నిలిచేందుకు రేషన్‌డీలర్లు సమాయత్తమవుతున్నారు. రేషన్ డీలర్లు కూడా పంచాయతీ ఎన్నికల్లో నిలబడవచ్చుని ఎన్నికల కమిషన్ (ఈసి) ప్రకటించడంతో వారు స్థానిక సమరానికి సై అంటూ బరిలోకి దిగుతున్నారు. గత ఎన్నికల్లో వీరికి ఈసి నిషేధం విధించింది. కాగా ఈసారి వారు స్థానిక ఎన్నికల్లో పోటీకి అర్హులేనంటూ ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో రేషన్‌డీలర్లు పంచాయతీ రణంలో దిగేందుకు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రేషన్‌డీలర్ల సంక్షేమసంఘం తాము పంచాయతీ పోరులో పాలుపంచుకోనున్నట్లు ప్రకటించింది. అందుకు సంబంధించి సంఘం జిల్లా అధ్యక్షులు ఊకె శేఖర్ రావు, ఉపాధ్యక్షులు అజ్మీర రామా, సైదమ్మ, ప్రచార కార్యదర్శి కోరం శ్రీరాములు తెలియజేశారు. తమకు పోటీ చేయడానికి అర్హత కల్పించడం పట్ల వారు హర్షం వెలిబుచ్చుతూ, ఈసికి కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా రేషన్‌డీలర్లతో పాటు, సింగరేణి, ఆర్టీసి కార్మికులు కూడా పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయవచ్చునని ప్రకటించింది. ఈ ప్రకటనతో వారు ఆనందం వ్యక్తం చేశారు. గత పంచాయతీ ఎన్నికల్లో పాల్గొన్నారనే కారణంతో రాష్ట్రంలో పలువురు రేషన్ డీలర్లను డీలర్‌షిప్ నుంచి తొలగించింది. కాని తాజాగా ఈసి ఇచ్చిన ఆదేశాలతో తిరిగి రేషన్ డీలర్లు రంగ ప్రవేశం చేస్తున్నారు. కొత్తగూడెం జిల్లా సహా తెలంగాణ రాష్ట్ర వ్యాపితంగా సర్పంచ్ పదవికి రేషన్ డీలర్లు పోటీ చేస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. తాము ఎప్పటి నుంచో అష్ట కష్టాలు పడుతూ రేషన్ షాపులు నడుపుతున్నామని, ప్రతి పంచాయతీ, ప్రతి గ్రామంలో తమకు అక్కడి ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయని, నిత్యం ప్రజలతో మమేకమై ఉండే తమకు ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా పరిచయాలు ఉన్నట్లు వారు పేర్కొంటున్నారు. తాము బరిలోకి దిగితే విజయం తమదేనని, అందులో ఎలాంటి సందేహం లేదని రేషన్ డీలర్లు ఎంతో విశ్వాసంతో చెబుతున్నారు. త్వరలోనే ఎక్కడెక్కడ ఏయే స్థానాలకు, ఎవరెవరు పోటీ చేయనున్నారో వెల్లడించనున్నట్లు వారు చెప్పారు.



కోరుట్ల సెగ్మెంట్లో రెండు గ్రామాలు ఏకగ్రీవం

• కోరుట్లలో తిమ్మాయిపల్లె, మెట్‌పల్లిలో పాటిమీది తండా..

విజయక్రాంతి, కోరుట్ల: జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గంలోని కోరుట్ల, మెట్‌పల్లి మండలాల్లో ఒక్కో గ్రామం చొప్పున 2గ్రామాలు ఆదివారం ఏకగ్రీవం అయ్యాయి. పంచాయతీ ఎన్నికల ప్రక్రియకు నోటిఫికేషన్ జారీ అయిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంత వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల వేడి పూర్తిగా తగ్గక ముందే పంచాయతీ ఎన్నికలు రావడంతో గ్రామ స్థాయి నేతలు ఎంతో ఉత్సాహంగా పావులు కదుపుతుండగా, టీఆర్ఎస్ హైకమాండ్ సూచనల మేరకు ఏకగ్రీవం కోసం దాదాపు అన్ని ప్రాంతాల్లో జరుగుతున్న కసరత్తులో భాగంగా కోరుట్ల సెగ్మెంట్లోనూ 2గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. కోరుట్ల మండలంలోని తిమ్మాయిపల్లె గ్రామంతో పాటూ, మెట్‌పల్లి మండలం పాటిమీది తండా గ్రామంలో గ్రామ పెద్దలు, ప్రజలు మూకుమ్మడిగా ఏకగ్రీవ తీర్మాణాలు చేశారు. తిమ్మాయిపల్లె గ్రామ సర్పంచ్‌గా శివరాత్రి రాజరెడ్డి, ఉపసర్పంచ్‌గా అరికుప్పుల పెద్దవెంకటిని ఎన్నుకున్నట్లు ఏకగ్రీవ తీర్మాణాన్ని చేసి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు వద్దకు రాగా, ఎమ్మెల్యే వారిని అభినందించి సన్మానించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు చీటి వెంకట్రావు, కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సింగిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు దారిశెట్టి రాజేశ్, తోట నారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే మెట్‌పల్లి మండలం పాటిమీది తండా సర్పంచ్‌గా జరుపుల బుజ్జి, ఉప సర్పంచ్‌గా గుగ్లావత్ మంగీనాయక్‌లతో పాటూ మరో ఆరుగురిని వార్డు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తీర్మాణించారు. కాగా ఇదే బాటలో మరికొన్ని గ్రామాల్లో సైతం ఏకగ్రీవం కోసం కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం.



వేతన బకాయిలు చెల్లించాలంటూ.. మున్సిపల్ కార్మికుల ధర్నా

విజయక్రాంతి, దేవరకొండ: కార్మికులకు వేతన బకాయిలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తూ మున్సిపల్ కమిషనర్ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని సిఐటియు నల్గొండ జిల్లాకార్యదర్శి నల్ల వెంకటయ్య తెలిపారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయం ముందు మున్సిపల్ కార్మికులు చేపట్టిన ధర్నా రెండవరోజుకు చేరింది. మూడునెలలుగా కార్మికులకు వేతనాలివ్వటంలేదని, వేతనాలు లేక కార్మికుల కుటుంబాలు బజారున పడ్డాయని ఈ విషయమై కమిషనర్‌ను ఎన్నిసార్లు అడిగినా దాటవేత మాటలు మాట్లాడుతున్నారే తప్ప సమస్య పరిష్కరించడం లేదని ఆయన అన్నారు. గతంలో కార్మిక సంఘాలు చేపట్టిన సమ్మెల ఫలితంగా సాధించుకున్న జి.వో 14 ప్రకారం మున్సిపల్ కార్మికుల వేతనాలను రూ.12వేలు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చి 10 నెలలు గడిచిందనీ, ఈ ఉత్తర్వు రాష్ట్రవ్యాప్తంగా అమలులో ఉన్నా ఇక్కడ మాత్రం ఇంకా అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఈ విషయమై కమిషనర్‌ను అడుగగా పట్టించుకోవడంలేదని ఆయన తెలిపారు. కార్మికులకు ఇవ్వాల్సిన బట్టలు, నూనెలు, సబ్బులు ఇతరత్రాతోపాటు పిఎఫ్, ఈఎస్‌ఐ అమలు కావడంలేదని, మున్సిపల్ కార్యాలయం బకాయిపడ్డ కార్మిక వేతనాలు వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగ భద్రతతోపాటు ప్రమాదబీమా పథకాలకు ప్రభుత్వ ఉత్తర్వు 14 ప్రకారం రూ.12వేలు ప్రతినెలా 5వ తేదిలోపే ఇవ్వాలని కార్మికులు ధర్నా చేపట్టారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు. ధర్నాలో పొట్టతారమ్మ, పొట్టి రాములు, బి.యేసు, వీరయ్య, లింగస్వామి, నర్సింహ్మా, మల్లమ్మ, వెంకటమ్మ, రత్నమ్మ, శక్రు, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


యాదాద్రికి పోటెత్తిన భక్తులు

విజయక్రాంతి, యాదగిరికొండ: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దర్శనార్థం మంగళవారం భక్తులు పోటెత్తారు. శనివారం సాయంత్రమే కొండకు చేరుకున్న భక్తులు ఆదివారం ఉదయం స్వామి వారిని దర్శించుకునేందుకు గంటల తరబడి ఓపికతో క్యూలైన్లలో వేచియుండి శ్రీవారిని దర్శించుకున్నారు. కొండపైన ఎటు చూసినా భక్తులతో సందడిగా మారింది. దర్మదర్శనం, ప్రత్యేక దర్శనం, ప్రసాదాలు, విష్ణుపుష్కరిణి, వద్ద భక్తులతో కిక్కిరిసి పోయాయి. కొండకింద తులసీవనం, గోశాల, యోగానంద నిలయ చెంత భక్తులతో సందడిగా మారింది.

సర్పంచ్ ఎన్నికల్లో.. ఏకగ్రీవం వైపు గ్రామాల చూపు

• ఇప్పటికే కొన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు ఏకగ్రీవం
• ప్రభుత్వ ప్రోత్సాహం కోసం గ్రామాల యత్నాలు

విజయక్రాంతి, వేములవాడ: స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండడంతో సర్పంచ్ స్థానాలను ఏకగ్రీవం చేసుకునేందుకు గ్రామస్తులు ప్రయత్నిస్తున్నారు. వేములవాడ నియోజకవర్గంలోని కోనరావుపేట మండలంలోని ఆజ్మీరా తండాకు చెందిన వ్యక్తిని ఏకగ్రీవం చేయగా, అదే మండలంలో నిమ్మపల్లి గ్రామంలోని ఊరు తండా వాసులు ఏకగ్రీవం కోసం ముమ్మర ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. దీంతో ప్రభుత్వం ప్రకటించే ప్రోత్సహంతో గ్రామాభివృద్ధి కోసం కేటాయించుకోవచ్చనే ఆలోచనలో పడ్డారు. ఇదే తరహాలో లక్ష్మీపూర్ తండా ఏకగ్రీవంగా సర్పంచ్‌ను ఎన్నుకోవడంతో మంత్రి కేటీఆర్ ఆ గ్రామ పంచాయతీకి అదనంగా తన ఎమ్మెల్యే నిధుల నుండి రూ. 15 లక్షలు అందజేస్తామనీ ప్రకటించిన విషయం విదితమే. ప్రభుత్వం మరో రూ. 10 లక్షలు కేటాయిస్తుంది. దీంతో గ్రామంలో మౌళిక సదుపాయల కల్పనకోసం ఈ నిధులు ఎంతో దోహద పడుతాయనే ఆలోచనలో ఆయా గ్రామాల పెద్ద మనుషులు మంతనాలు జరుపుతున్నారు. మూడు విడతలుగా నిర్వహించే సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా ఇప్పటికే పోటీలో నిలిచిన అభ్యర్థులు ప్రచారంలో మునిగితేలారు. కానీ పోటిలో నిలిచే ప్రతి అభ్యర్థి ధనబలం మీద ఆధారపడి ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. కానీ సమాన్యుడు ప్రజాసేవా చేసే ఆలోచనలో ఉన్న వ్యక్తులు ఎన్నికల బరిలో నిలిచేందుకు జంకుతున్నారు. ఎన్నికలు సమీపిస్తుండంతో అభ్యర్థులు ఓటర్లను అకట్టుకునేందుకు అభ్యర్థులు మహిళా సంఘాలు, కుల సంఘాలతో ఓట్లు సంపాదించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.



ప్రతిభావంతులకు స్వాగతం

ఇన్నాళ్లు స్థానికులకే తమ దేశంలో ఉద్యోగావకాశాలంటూ వీసా నిబంధనలను రోజురోజుకు కఠినతరం చేస్తున్న అమెరికా అధ్యక్షుడి ట్రంప్ వైఖరి మారింది. వలసదారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్న ట్రంప్ తొలిసారి ఇందుకు భిన్నమైన వ్యాఖ్యలు చేశారు. అమెరికా టాప్ యూనివర్సిటీల్లో చదువుతున్న విదేశీ విద్యార్థులు అమెరికాలోనే ఉండి దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ట్రంప్ అమెరికాలోని పాత వలస విధానాలు హాస్యాస్పదంగా ఉన్నాయని, దీని వల్ల ప్రతిభావంతులను కోల్పోతున్నామని తెలిపారు. చట్టబద్ధమైన వలస విధానాల్లో ఉన్న లొసుగులను తొలగించి ప్రతిభ ఆధారిత వలసలను ప్రోత్సహించాలని అన్నారు. చట్టబద్ధంగా, ప్రతిభ ఆధారంగా అమెరికాకు వలస వచ్చే ప్రజలను తమ ప్రభుత్వం స్వాగతిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. అమెరికాలో చాలా గొప్ప కంపెనీలు ఉన్నాయి. వీటిల్లో పని చేయడానికి ప్రతిభావంతులు కావాలి. అందుకే చట్టబద్ధంగా, మెరిట్ ఆధారంగా వచ్చే వారిని ప్రోత్సాహించాలని నిర్ణయించామన్నారు. కంపెనీల యజమానులు కూడా ఇదే విషయాన్ని తన దృష్టికి తెచ్చారని తెలిపారు. నాకు గొప్ప గొప్ప టెక్ కంపెనీల నుంచి ఫోన్లు వస్తున్నాయి. దేశంలోని మంచి విద్యాసంస్థలలో చదువుకున్న వారిని ఇక్కడ ఉంచలేకపోతున్నాం. వాళ్లు ఇక్కడి అత్యుత్తమమైన విద్యాసంస్థల్లో చదువుకుని తిరిగి చైనా, జపాన్, తదితర దేశాలకు వెళ్లిపోతున్నారు. వివిధ కారణాల వల్ల వారికి ఇక్కడ ఉండే అవకాశం ఉండట్లేదు. దీంతో ప్రతిభావంతులను కోల్పోతున్నాం. మనం అలా చేయకూడదంటూ కంపెనీల యాజమానులు తనకు విన్నవించారని ట్రంప్ తెలిపారు. ఈ సందర్భంగా చదువు పూర్తయిన విదేశీ విద్యార్థులు అమెరికాలో ఉండి ఉద్యోగం చేసుకునే విషయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ట్రంప్ ప్రస్తావిస్తూ గొప్ప కంపెనీలను, ప్రతిభావంతులను వదులుకోమని అన్నారు. ఆశ్రయంకావాలని కోరుకునే వారికి చట్టబద్ధమైన విధానాలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఆయుధాల వృద్ధి.. మానవాళికి ముప్పు

ఓ వైపు ప్రపంచంలో శాంతి, నిరాయుధీకరణకు ఉద్యమాలు, ఒప్పందాలు జరుగుతుండగా మరోవైపు పెను విధ్వంసాలు సృష్టించే ఆధునిక ఆయుధాల వ్యాపారం ఏటేటా పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశం. ఆయుధ వ్యాపారం మానవహక్కులను కాలరాస్తోందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆరోపిస్తోంది. యుద్ధాలను, తిరుగుబాట్లను అణచివేసేందుకు వినియోగిస్తున్న ఆయుధాలు అమాయక పౌరులను బలితీసుకుంటున్నాయని ఆమ్నెస్టీ ఆయుధ వ్యాపార నిపుణుడు అలివర్ ఫీలే ఆవేదన వ్యక్తం చేశారు. ఆయుధ వ్యాపారం ఎంత పెరిగితే మానవాళికి ముప్పు అంతగా పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ప్రపంచంలో శాంతి నెలకొనాలంటూ వేదికలపై ఉపన్యాసాలు ఇస్తూ భారీ ప్రకటనలు గుప్పించే అగ్రరాజ్యాలే ఆయుధ వ్యాపారంలో అగ్రాన ఉండటం విశేషం. అమెరికా, రష్యాల మధ్య ప్రచ్ఛన్నయుద్ధం ముగిసిన తర్వాత ఆయుధ వ్యాపారం కాస్త తగ్గింది. మళ్లీ అమెరికా, రష్యాలు ఆధిపత్యం కోసం ప్రయత్నాలు చేస్తుండటం, చైనా కూడ వీరికి పోటీలో ఉండటంతో 2002 నుంచి ఈ వ్యాపారం మళ్లీ ఊపందుకుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం ఏటా దాదాపు రూ.7లక్షల కోట్లు ఆయుధ వ్యాపారం సాగుతోందని స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సిప్రీ)కి చెందిన సీనియర్ పరిశోధకుడు పీటర్ వెజెమన్ చెబుతున్నారు. 2008–12తో పోలిస్తే 2013–17లో భారీ ఆయుధాల అమ్మకాలు 10 శాతం పెరిగాయని రక్షణ రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

ప్రపంచవ్యాప్తంగా జరిగే ఆయుధ విక్రయాల్లో 34 శాతం వాటా అమెరికాదేనని సిప్రీ స్పష్టం చేసింది. అమెరికా నుంచి భారీమొత్తంలో ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో సౌదీ అరేబియా ముందుంది. ఆయుధాల ఎగుమతి జాబితాలో అమెరికా తర్వాత స్థానం రష్యాదే. రష్యాతో పోలిస్తే అమెరికా 58 శాతం ఎక్కువ ఆయుధాలను ఎగుమతి చేస్తోంది. 2008–12తో పోలిస్తే 2013 –17 మధ్య కాలంలో అమెరికా ఆయుధ విక్రయాలు 25 శాతం పెరగగా, రష్యా విక్రయాలు 7.1 శాతం తగ్గాయి. ప్రపంచం మొత్తంలో ఆయుధ ఎగుమతుల్లో 74 శాతం వాటా అమెరికా, రష్యా, జర్మనీ, ఫ్రాన్స్, చైనాలదేనని సిప్రీ పేర్కొంది.

అమెరికా నుంచి చాలా దేశాలు ఆయుధాలు కొనుగోలు చేస్తున్నా, పశ్చిమాసియా దేశాలే ఎక్కువగా కొంటున్నాయి.2013–17మధ్య అమెరికా ఆయుధ ఎగుమతుల్లో దాదాపు సగం ఈ దేశాలకే జరిగాయి. పశ్చిమాసియా దేశాల్లో రాజకీయ అస్థిరత, అంతర్యుద్ధాలు ఎక్కువగా జరుగుతుండటమే దీనికి కారణం. ముఖ్యంగా సిరియా, యెమెన్లలో అంతర్యుద్ధాలు ఆయుధ వ్యాపారానికి ఊతమిస్తున్నాయి. సౌదీ ఆరేబియా, ఈజిప్టు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కూడా అమెరికా నుంచి ఆయుధాలు దిగుమతి జాబితాలో ముందున్నాయి. 2012–16 మధ్యలో పశ్చిమాసియా దేశాల ఆయుధ దిగుమతులు 86 శాతం పెరిగాయి.

అన్ని దేశాల్లో ఆయుధాల దిగుమతులు పెరుగుతుంటే ఆఫ్రికా దేశాల్లో మాత్రం తగ్గుతోంది. ఐదేళ్లలో ఈ దేశాల ఆయుధ దిగుమతులు 22 శాతం తగ్గాయి. ఆయుధాల దిగుమతులు తగ్గినంత మాత్రాన ఆఫ్రికా దేశాల్లో యుద్ధాలు జరగడం లేదని, ఆ దేశాలు ఆయుధాలను కొనడం లేదని కాదు. అంతర్జాతీయ స్థాయిలో ఆయుధ విక్రయాలను సాధారణంగా కాంట్రాక్టు విలువల ఆధారంగా లెక్కిస్తారు. భారీ ఆయుధాల కొనుగోలుకే కాంట్రాక్టులు ఉంటాయి. చిన్న, తేలికపాటి ఆయుధాలు ఈ లెక్కలోకి రావు. ఆఫ్రికా దేశాల్లో దిగుమతులు తగ్గడానికి కారణం ఇదే. ఈ దేశాలన్నీ చిన్న చిన్న ఆయుధాలనే బాగా కొంటున్నాయని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తెలిపింది.

అమెరికాతో వాణిజ్య, సాంకేతిక రంగాల్లోనే కాక ఆయుధ విక్రయాల్లో కూడా చైనా పోటీ పడుతోంది. చైనా తన రక్షణ బడ్జెట్‌ను పెంచుకోవడంతో పాటు ఆయుధ సరఫరాదారుగా కూడా మార్కెట్లోకి ప్రవేశించింది. తాజా లెక్కల ప్రకారం ప్రస్తుతం చైనా ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆయుధ విక్రేత. అమెరికా, రష్యా, ఫ్రాన్స్, జర్మనీల తర్వాతి స్థానం చైనాదే. ఇటీవలే బ్రిటన్‌ను పక్కకు నెట్టి చైనా ఐదో స్థానాన్ని ఆక్రమించింది. 2008–12తో పోలిస్తే 2013–17 మధ్య చైనా ఆయుధ ఎగుమతులు 38 శాతం పెరిగాయి. అమెరికా తర్వాత అత్యధిక రక్షణ బడ్జెట్ కలిగిన దేశం కూడా చైనాయే. అత్యాధునిక ఆయుధాల తయారీలో కూడా చైనా ముందుందని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్‌కు చెందిన పరిశోధకురాలు మియా నౌవెన్స్ తెలిపారు. సొంతంగా యుద్ధనౌకలను నిర్మించుకోవడమే కాకుండా పెద్ద ఎత్తున ఆయుధాలను విక్రయించడం ద్వారా బలమైన సైనిక శక్తిగా ఎదగాలని చైనా ఆకాంక్షిస్తోంది. 2013–17 మధ్య చైనా 48 దేశాలకు ఆయుధాలు విక్రయించింది. అయితే చైనా ఆయుధాల్లో ఎక్కువశాతం పాకిస్తాన్‌కే చేరతాయి. ఇది భారత్‌కు ఆందోళన కలిగించే అంశం. అమెరికా, రష్యా, జర్మనీ, ఫ్రాన్స్ దేశాలు ఆయుధాలు విక్రయించని ఇరాన్, వెనెజులా, సుడాన్, జింబాబ్వే వంటి దేశాలకు కూడా చైనా ఆయుధాలు విక్రయిస్తోంది. చైనా దూకుడుతో పోటీ పడేందుకు భారత్‌కూడా రక్షణ బడ్జెట్‌ను పెంచుతోంది. భారత్ రక్షణ దిగుమతులు 2008–12తో పోలిస్తే 2013–17లో 24 శాతం పెరిగాయి.

ఆయుధాల తయారీ, ఎగుమతుల్లో తాజా హవా యుద్ధ విమానాలదే. 2027 కల్లా యుద్ధ విమానాల మార్కెట్ రూ.16.6 లక్షల కోట్లకు చేరుతుందని, 3,243 యుద్ధ విమానాలు తయారవుతాయని ఫోర్‌కాస్ట్ ఇంటర్నేషనల్ అనే సంస్థ ద మార్కెట్ ఫర్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ పేరున విడుదల చేసిన అధ్యయన నివేదికలో పేర్కొంది. ఈ పదేళ్లలో తయారైన యుద్ధ విమానాలకంటే 13.1శాతం ఎక్కువ విమానాలు వచ్చే పదేళ్లలో తయారవుతాయని పేర్కొంది. వచ్చే పదేళ్లలో ఏటా సగటున 280 విమానాలు తయారవుతాయని వెల్లడించింది. ఇందులో 1,466 విమానాలు లాక్హీడ్ మార్టిన్ తయారు చేసే ఎఫ్–35 విమానాలేనని తెలిపింది. ఈ నివేదిక ప్రకారం వచ్చే పదేళ్లలో అమెరికా ఎక్కువగా ఎఫ్– 35 యుద్ధ విమానాలను కొంటుంది. భవిష్యత్తులో ఎఫ్– 35 విమానాలను చాలా దేశాలు కొనే అవకాశం ఉంది. ఈ మార్కెట్లో 45 శాతం వాటా లాక్హీడ్ సొంతం చేసుకోనుంది. బోయింగ్ ఎఫ్–16, ఎఫ్/ఏ–18ఈ సూపర్ హార్నెట్, లాక్హీడ్ ఎఫ్–16 యుద్ధ విమానాలకు కూడా మళ్లీ డిమాండు పెరుగుతోంది. పశ్చిమాసియా దేశాల నుంచి యుద్ధ విమానాలకు ఎక్కువ డిమాండు ఉండబోతోంది. వచ్చే పదేళ్లలో యూరోఫైటర్ టైఫూన్లు 95, డసాల్ట్ రఫేల్ విమానాలు 158 బయటకు వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు భారత ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. ఇలా అన్ని దేశాలు తమ ఆయుధ సంపత్తిని పెంచుకోవటంపై అమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆందోళన వ్యక్తం చేస్తోంది.

గణతంత్ర దినోత్సవానికి హాజరు ఎలా?

మీ లేఖ

రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల తెలంగాణ సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేసింది. సర్పంచ్ ఎన్నికలు మొత్తం మూడు విడతలలో నిర్వహించాలని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. అయితే రెండవ విడత పోలింగ్ జనవరి 25న ఉంది. ఈ తేదిన మార్చవలసిన అవసరం ఉంది. జనవరి 25 కౌంటింగ్, ఉపసర్పంచ్ ఎన్నిక అయ్యేవరకు అర్ధరాత్రి అవుతుంది. ఇక మరుసటి రోజు గణతంత్ర దినోత్సవం ఉంటుంది. ఎన్నికల విధులు నిర్వహించిన వారు గణతంత్ర్య దినోత్సవానికి హాజరు కాలేకపోతారు. కావున రాష్ట్ర ఎన్నికల సంఘం గణతంత్ర దినోత్సవంను దృష్టిలో ఉంచుకొని రెండోవిడత పోలింగ్ తేదిని జనవరి 25 నుంచి మరో తేదికి మార్చితే చాలా బాగుంటుంది. ఈ విషయమై రాష్ట్ర ఎన్నికల సంఘం ఆలోచించాలి.

– షేక్ అస్లాంషరీఫ్
శాంతినగర్, జోగులాంబ గద్వాల జిల్లా.

తానెవరో తెలుసుకోవటమే జ్ఞానం

విద్యా-విలువలు 11

మానవుడు అరిషడ్వర్గాలైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలతో బంధితుడైనాడు. కామాన్ని జయించితే కామేశ్వరుడవుతాడు. క్రోధాన్ని వీడితే రుద్రుడవుతాడు. లోభాన్ని జయిస్తే లోకాన్ని జయిస్తాడు. మద మోహాల్నివీడితే మదనమోహనుడవుతాడు. మాత్సర్యాన్ని వీడితే మచ్చ లేకుండా జీవిస్తాడు. బంధం కలిగించే మనస్సు ద్వారానే, బంధ విమోచనకూ సాధన చేయవచ్చు. మనస్సు అంటే సంకల్ప వికల్పాల మూట, వస్త్రం నుంచి ఒక్కొక్క దారం తీసేస్తే, వస్త్రం కనిపించకుండా పోయినట్లు, కోరికలు తొలిగించుకుంటూ పోతే, మనస్సు శూన్యమౌ వుతుంది. మనసు అనే కొలిమిలో కోరికలనే ఇంధనాన్ని వేసేకొలది, అగ్నికి ఆజ్యం పోసినట్లుగా పెరుగుతుందేగాని తరగదు. కనుక కోరికలను తగ్గించుకోవటమే మార్గం.

అందరిలో, అన్నిటిలో పరమాత్మ ఉన్నాడని విశ్వసించి, తదనుగుణంగా జీవించటమే జ్ఞానమార్గమని, ప్రకృతి చైతన్యాన్ని లేక పరమాత్మను తెలుసుకోవటమే జీవిత పరమార్ధమని, అందుకు మనిషి మానసిక స్థాయిని బట్టి కర్మ, భక్తి, యోగ, జ్ఞాన మార్గాలలో ఏ మార్గాన్నైనా అనుసరించి జీవితాన్ని సార్ధకం చేసుకోవచ్చునే విశాలభావమే హైందవధర్మం. అది ఏ ఇతర మతములను ద్వేషించదు. అది 'భిన్నత్వంలో ఏకత్వం'తో విరాజిల్లుతుంది. ఆధ్యాత్మిక జీవన మార్గమే సనాతన ధర్మం. ధార్మిక జీవన మార్గమే మతం. మతం అంటే మానవత్వమే.

పరమాత్మ మన చర్మ చక్షువులకు కనిపించదు. దుమ్ము పేరుకుపోయిన అద్దంలో ముఖం ఎలా కనిపించదో, అలానే మురికి భావాలతో నిండిన మనస్సుకు భగవద్దర్శనం అవదు. భక్తితో, ఆర్తితో పిలిచిన పిలుపే పరమాత్మకు వినిపిస్తుంది. పరమాత్మకు ప్రీతికరమైన 'సేవ' అనే తంత్రాన్ని ఆచరిస్తూ 'భక్తి' అనే మంత్రాన్ని జపిస్తే, దైవదర్శనం సాధ్యమే.

నైతిక మార్గాన్ని చక్కగా వివరించి, ఆచరించమని ఆజ్ఞాపించేదే మతం. అందుకే మతం ఒక సామాజిక అవసరం. పరమాత్మ అనేది ఒక తత్వం. దానిని అనుభూతిచెంది ఆనందించాల్సిందే, మనో నేత్రంతో దర్శించాల్సిందే. పాలల్లో వెన్న అంతా వ్యాపించి ఉన్నట్లే, పరమాత్మ ప్రకృతి నిండా వ్యాపించి ఉన్నప్పటికీ, పాలను వేడిచేసి, చల్లార్చి తోడుపెట్టి చిలికితేగాని వెన్న కనిపించినట్లు, సాధనతోనే పరమాత్ముడు సాధ్యపడతాడు.

సాగర గర్భంలో అమూల్యమైన రత్నాలున్నట్లే, మనసు లోతులలో అద్భుతమైన శక్తి ఉంది. ధ్యానంలో అంతర్ముఖంగా ప్రయాణిస్తే అది అవగతం అవుతుంది. నిరంతరం చలించే మనస్సుకు భగవాన్నామ స్మరణ బలహీన పరిచే సన్నివేశాల నుండి రక్షిస్తుంది. జీవుడు స్వయముగా బ్రహ్మమే. అజ్ఞానము వలన తాను దేహమన్న భ్రమలో ఉన్నాడు. తానెవరో తెలుసుకోవటమే జ్ఞానం.

కథ: ఒక అడవిలో పెద్ద గాలి – వాన వల్ల పులి పిల్ల, తన తల్లి నుండి వేరయి అడవి దాటి వచ్చి మేకల మందలో కలిసింది. మేకల యజమాని పులిపిల్లను కూడా మేకలతో పాటే పెంచాడు. అది మేకలతో పాటే ఆకులు, అలములు తింటూ, మేక పాలను త్రాగుతూ, పెరిగింది. ఒకరోజు పులి, తన పిల్ల – మేకలతో కలిసి ఉండటం చూచి, దానిని తీసికెళ్ళి నువ్వు పులివి, మేకవు కావు, అని ఎంత చెప్పినా పులి పిల్ల 'నేను మేకనే' అంటూ మేకలాగా అరుస్తూ, సాత్వికాహారమే తింటూ కాలం గడుపుతున్నది. అప్పుడు పులి ఒకరోజు తన పిల్లను తీసికెళ్ళి, నదిలోని నీటిలో పులిపిల్లకు దాని ప్రతిబింబం చూపించితే, అప్పుడు నమ్ముతుంది తాను మేకను కాదు, పులిని అని. ఆ విధంగా మానవుడు సరైన గురువు వద్ద చేరి, సాధన చేసి, ఆత్మజ్ఞానం పొందితే తాను దేహంకాదని, తనలో ఉన్న అంతరాత్మయే తాననే జ్ఞానం పొందుతాడు.

ఆధ్యాత్మిక సంపద భారతదేశ శక్తి

మన మనుగడకు వేదాలే ప్రమాణం. మన ప్రాచీనులు అనేక కళలలో ప్రావీణ్యులు. భారతదేశం మొదటినుంచీ ఇచ్చే దేశమేకాని పుచ్చుకునే దేశం కాదు. మన ప్రాచీన విశ్వవిద్యాలయాలు నలంద, నాగార్జున మొ॥ ప్రపంచ ప్రఖ్యాతి చెందినవి. వాటిలో విదేశస్తులు వచ్చి విద్య నభ్యసించేవారు. రాజనీతి, ఆర్ధికశాస్త్రం, వైద్యశాస్త్రం, గణితంలో మన పూర్వీకులు నిష్ణాతులు. భారతదేశం యోగభూమి, కర్మభూమి, త్యాగభూమి, ఆధ్యాత్మిక సంపదే భారత శక్తి. 'భా' అంటే ప్రకాశం, భగవంతుడు, 'ర' అంటే రతి, 'భారత్' అంటే భగవంతుని యందు రతి కలిగిన (ఇష్టపడే) దేశం అని అర్థం. మన జాతీయ జండాలో కాషాయరంగు త్యాగానికి, తెలుపు స్వచ్ఛతకు, ఆకుపచ్చ శాంతికి చిహ్నాలు. మధ్యలో ఉండే (అశోక) చక్రం ధర్మానికి ప్రతీక. మన నాణాలమీద, నోట్ల మీద రాజముద్ర క్రింద ఉండే నినాదం 'సత్యమేవ జయతే' వేదాల నుంచి తీసుకోబడింది. మన ప్రాచీన గ్రంథముల నుంచి పిల్లలు నేర్చుకోదగిన కొన్ని విషయాలను ఇచ్చట గమనించ గలరు.

ఉపనిషత్తులు:– వేదముల చివరలో వేద సారములుగా ఉన్నవి ఉపనిషత్తులు. మన దేహంలో ఒక అంతర్గత శక్తి ఉన్నదని, దానిని తెలుసుకోవటానికి మన జ్ఞానేంద్రియములను అంతర్ముఖం చేయాలని, అప్పుడు జ్ఞానోదయం అయి, మనం ఈ లోకంలోకి ఎందుకు వచ్చాం, దేహం చాలించిన తర్వాత ఎక్కడికి పోతాం, ఇవన్నీ ఏ నియమానుసారం జరుగుతున్నాయి అన్న విషయాలు బోధపడతాయి.

శ్రీ మద్రామాయణము:– శ్రీరాముని పితృవాక్యపాలన, ఏక పత్నీవ్రతము, ధర్మ ప్రవర్తన, సోదర ప్రేమ, హనుమంతుని ధైర్యం, కుశాగ్ర బుద్ధి కుశలత, నిస్వార్ధ సేవ నేర్చుకోవాలి. శ్రీరాముడు ఎన్నో కష్టాలు భరిస్తూ కూడా శాంతంగా ఉండి అందరికి ఆదర్శప్రాయుడైనాడు.

శ్రీ మద్ మహాభారతము:– ధర్మరాజు యొక్క 'ధర్మ నిరతి' చాలా గొప్పది. కాని, ఎన్ని మంచి గుణాలున్నా ఒక్క చెడ్డగుణం చేటు తెస్తుందని, పడవఎంత మంచిదైనా, ఒక చిన్న చిల్లి పడవను ముంచుతుదని తెలుస్తుంది. కర్ణుని నుంచి – 'మనం ఎంత మంచివారయినా చెడువారితో స్నేహం చెరుపు చేస్తుందని' గుర్తుంచుకోవాలి. అభిమన్యుడి నుంచి – 'సగంసగం పరిజ్ఞానంతో పనులు చేయరాదని' నేర్చుకోవాలి.

శ్రీమద్ భగవద్గీత:– అర్జునుడు రధ కళ్ళాలను పరమాత్మ చేతికి ఇచ్చినట్లు మనం అనన్య చింతననే కర్మలనాచరించాలని, 'సకల కార్యములు పరమాత్మ వల్లే జరుగుచున్నవని, మనం ఆయన చేతుల్లో పనిముట్టునని విశ్వసించాలి. సర్వులయందున్న ఆత్మ ఒకటే అన్న జ్ఞానం పొందాలి.

శ్రీమద్భాగవతం:– పరమాత్మకంటే తాము తెలివిగలవారమనుకుని, తమకు అసాధ్యమైన పరిస్థితులలో తప్ప మరణం సంభవించకూడదన్న వరాలు, రాక్షసులు కోరుకున్నప్పటికీ, పరమాత్మ ఆ వరాలను పాటిస్తూనే, అసాధ్యాలను సుసాధ్యం చేస్తూ, మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామ, శ్రీరామ, శ్రీకృష్ణ అవతారాలలో వారిని సంహరించారు. పరమాత్మకంటే తాము తెలివిగలవారమనుకోవటమే రాక్షసత్వం. కలియుగంలో బుద్ధ అవతారంలో ధర్మం పాటించమని భోదించారు. అధర్మం పెచ్చుమీరిపోయినపుడు, రాబోవు కల్కి అవతారంలో పరమాత్మ దుష్టులనందరినీ మూకుమ్మడిగా సంహరించి ధర్మాన్ని కాపాడుతాడు.

– వ్యాకరణం వేణుధర శాస్త్రి

ఉద్యమం కారణంగానే బడ్జెట్ సమావేశాలు వాయిదా

1969 మార్చి శాసనసభ సమావేశంలో స్పీకర్ శ్రీ బి.వి. సుబ్బారెడ్డి తెలంగాణ ప్రస్తావన, పోలీసుల హింసాకాండ ప్రస్తావన ఎప్పుడు ఎవరు ఏ రూపంలో లేవనెత్తినప్పటికీ వారిని అడ్డుకొని బాధ్యతారహిత, అనవసరపు వ్యాఖ్యలను పదేపదే పునశ్చరణ చేసి ప్రజలలో భయోత్పాతాన్ని, తెలంగాణవారంటే అసహ్యాన్ని కలుగజేసే ప్రయత్నం చేశారు. తెలంగాణలో ఆంధ్రుల ఆస్తిపాస్తులకు, ప్రాణాలకు భద్రత లేదని ఆయన పదే పదే అన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని నాయకులను అప్రతిష్టపాలు చేయాలన్నదే ఆయన ముఖ్య ఉద్దేశ్యం. శాసనసభ బడ్జెట్ సమావేశాలు తెలంగాణ ఉద్యమం కారణంగానే ముందుగా నిర్ణయించిన ప్రకారం ఫిబ్రవరిలో కాకుండా మార్చి నెలకు వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా ముందు అనుకున్నంత కాలం కాక నామమాత్రంగా కొద్దిరోజులు మాత్రమే సభలు జరిపి సంవత్సరానికి బదులు నాలుగు మాసాల కాలానికే బడ్జెట్‌ను ఆమోదించారు.

అణగారి ఉన్నవారు ఎవరైనా ఎంతటి బలహీనులైనా, ఒకసారి తలయెత్తారంటే, ఏ శక్తియైన, ప్రత్యేకించి పోలీసులు, తుపాకులు వారిని అణచలేవని రుజువు చేసే సంఘటన శాసన సభ సమావేశాల సమయంలో జరిగినది. ప్రజలంటే భయకంపితులయే ప్రజా ప్రతినిధులు అసంఖ్యాకులైన సాయుధ పోలీసులను చుట్టూ కాపలా ఉంచుకొని చీమలు దోమలు సైతం లోపలికి రాజాలవనే ధీమాతో సమావేశాలు జరుపుకొంటూండగా ఒక రోజు అకస్మాత్తుగా అసెంబ్లీ లాబీలు 'జై తెలంగాణ' నినాదాలతో మారుమ్రోగాయి. సాహసవంతులైన పాతిక మంది విద్యార్థులు, విద్యార్థినులు 'శాసన సభ్యుల'ను అపహాస్యం పాలు చేయాలన్న ఉద్దేశ్యంతో, ఎలాగో పోలీసుల కండ్లు గప్పి, ఒకరొక్కరే శాసన సభ లాబీలో ప్రవేశించి, అకస్మాత్తుగా నినాదాలు ఇచ్చే సరికి ప్రజా ప్రతినిధులు భయకంపితులై పలాయనం చిత్తగించే ప్రయత్నం చేయగా, పోలీసులకు మతిపోయింది.

అయితే, తెలంగాణ రాష్ట్రోద్యమం క్రమంగా పుంజుకొంటున్న దశలో మార్చి 10వ తేదిననే, తెలంగాణను స్వతంత్ర ప్రతిపత్తికల ప్రాంతంగా రూపొందించాలని శ్రీ లక్ష్మణ్ సూచించారు. పదిరోజుల అనంతరం కూడ ఆయన ముఖ్యమంత్రితో మళ్ళీ ఈ విషయం చర్చించి, ఆ తర్వాత ఢిల్లీ వెళ్ళి కేంద్ర నాయకులకు కూడా తన అభిప్రాయాన్ని నివేదించారు. ఆయన వాదనను ఎవరూ పట్టించుకొనలేదు.

మార్చి 27వ తేదిన శ్రీ కొండా లక్ష్మణ్ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఇంచుమించు అన్ని తరగతుల ప్రజలకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సంబంధం ఉన్న తెలంగాణ సమస్యపై ప్రభుత్వవైఖరి, కేంద్ర నాయకులతో ముఖ్యమంత్రి చర్చల ధోరణి సమస్యను దాటవేసేదిగా ఉన్నవనీ, అందువల్ల తాను ప్రజలలో ఒకడిగా ఉంటూ తన అభిప్రాయాలు స్వేచ్ఛగా వెల్లడించే అవకాశం పొందేందుకై మంత్రి పదవిని త్యజిస్తున్నానని శ్రీ లక్ష్మణ్ తన రాజీనామా లేఖలో వ్రాశారు. మార్చి 11వ తేదిననే రాజీనామా ఇచ్చినప్పటికీ, ముఖ్యమంత్రి విజ్ఞప్తిపై 15 రోజులు మంత్రిగా కొనసాగి కేంద్ర రాష్ట్ర నాయకులకు పరిస్థితిని వివరించి, వారు సరిదిద్దగలరని ఆశించానని ఆయన వెల్లడి చేశారు.

ఏప్రిల్ 5వ తేదీ సాయంత్రం పోలీసులచే ప్రజా సమితి కార్యాలయం నుండి రాజకీయ ఖైదీగా అదుపులోకి తీసుకొనబడిన ఆదిరాజు వెంకటేశ్వరరావు నిర్బంధంతోనే ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం తెలంగాణ ఉద్యమకారులపై ప్రయోగించడం మొదలైంది. మర్నాడు 6వ తేదీ వేకువ జామున మదన్‌మోహన్, మల్లిఖార్జులను నిర్బంధించడం జరిగింది. ముందుగానే ఉద్యోగుల సంఘం నాయకుడు శ్రీ కె.ఆర్. అమోస్‌ను ముషీరాబాద్ జైలులో నిర్బంధించియుండిరి. ఆ తరువాత ఛద్రీ విశాల్‌పిట్టి, ఎస్.బి.గిరి, పులి వీరన్న, యం. సత్యనారాయణరావు, న్యాయవాది బాగారపు శీతారామయ్య, రమణయ్య, సి.నర్సిరెడ్డి మొదలైన వారిని రాజకీయ ఖైదీలుగా నిర్బంధించారు.

ఒక ప్రత్యేక విషయమేమిటంటే, ఎప్పుడూ ఏ ఉద్యమంలో జరగని విధంగా తెలంగాణ ఉద్యమంలో అనేకమంది పత్రికా రచయితలపై ప్రభుత్వం దాడి కొనసాగించింది. ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులలో అధికులు ఆంధ్రప్రాంతపు వారే అయినందున ఈ దాడులు నిరసించబడలేదు. శ్రీ ఆదిరాజు వెంకటేశ్వరరావు, శ్రీ యం.ఎ. రషీద్ (నిజామాబాద్) ను ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం క్రింది రాజకీయ ఖైదీలుగా నిర్బంధించగా, పత్రికా రచయితలు శ్రీ ప్రతాప్‌కిషోర్, శ్రీ రఘువీరరావు, ఖమ్మంకు చెందిన శ్రీ జె. సూర్యనారాయణను మరికొందరిని 151 సెక్షన్ క్రింద నిర్బంధించారు.

మొదటి నుండే ఉద్యమానికి సంబంధించిన వార్తలే ఎవరూ వ్రాయకూడదనే అభిప్రాయంతో ఉన్న ముఖ్యమంత్రి పత్రికా సంపాదకుల కూడా ఒక దానిని ఏర్పాటు చేసి ప్రభుత్వానికి సహాయపడవలసిందిగా వారిని అభ్యర్థించారు. ఈ సమావేశానికి ముందు రాత్రి ట్రంక్ టెలిఫోన్‌లో, అధికార దర్పంతో మాట్లాడే ధోరణిని ప్రదర్శించగా ముఖ్యమంత్రిని ఆంధ్రజ్యోతి సంపాదకులు, రాజ్యసభ సభ్యుడు శ్రీ నార్ల వెంకటేశ్వరరావు తలవాచేట్లు చివాట్లు పెట్టారు. తమ చెప్పుచేతులలో ఉండే పత్రికా రచయితలపై తప్ప మిగతా వారందరిపై ఆగ్రహంగా ఉన్నారు.

నాడు కొన్ని వేలమంది జైళ్ళల్లో ఉన్నప్పటికినీ, నగరంలోనే కాక తెలంగాణా ప్రాంతమంతటా ప్రతి పాఠశాలను, స్త్రీ, పురుష భేదం లేకుండా, విద్యార్థులు సత్యాగ్రహ శిబిరాలుగా మార్చారు. ప్రతి పాఠశాల ముందు అప్పటికే కొన్ని వారాలుగా లక్షల మంది విద్యార్థులు కార్యాచరణ సంఘం ఆధ్వర్యంలో సత్యాగ్రహాలు ప్రారంభమైనవి.

ఏప్రిల్ 11వ తేదిన నగరంలో జరిగిన సామూహిక సత్యాగ్రహంలో ప్రముఖ కాంగ్రెస్ శాసన సభ్యులు శ్రీ కె. అచ్యుతరెడ్డి, శ్రీ టి. అంజయ్య, శ్రీ యం. మానిక్ రావు, శ్రీ యం.యం. హషీమ్ ప్రభృతులు కూడా పాల్గొన్నారు. ఈ 'నేరానికి' ఆ తర్వాత వారు కాంగ్రెస్ నుండి పిసిసి పెత్తందారులచే 'బహిష్కరించ'బడినారు.

శిబిరాల దృశ్యాలను ప్రధాని, లేక కేంద్ర మంత్రులు, లేకపోతే పార్లమెంట్ సభ్యులు ప్రత్యక్షంగానో ఫోటోల ద్వారానో చూడడం ముఖ్యమంత్రికి ఇష్టం లేకుండెను. అందువలన సత్యాగ్రహ శిబిరాలను ధ్వంసంచేసి విద్యార్థులను హడలకొట్టాలని ఎన్నో రాత్రులు పోలీసులతో మెరుపుదాడులు జరిపించి వేల మంది సత్యాగ్రహులను అరెస్టు చేయించి, వందల గుడారాలు పీకివేయించినా, నిమిషాలలో మళ్ళీ మళ్ళీ ఈ శిబిరాలు వెలిశాయి.

అయూబ్ ఖాన్‌ను మించిన నియంత శ్రీ బ్రహ్మానంద రెడ్డి. తెలంగాణా ప్రాంతాన్ని పోలీసు శిబిరంగా మార్చి ప్రజలను నాలుగు నెలలు నానా చిత్రహింసలకు గురిచేసిన అనంతరం అప్పటివరకు అతని కల్లబొల్లి కబుర్లు నమ్మి అతనికి వత్తాసు పలికిన ప్రధాని ఇందిరాగాంధీకి కనువిప్పు కలిగింది. ఏప్రిల్ మాసంలో వేల మంది తెలంగాణ ప్రజాసమితి నాయకులు, విద్యార్థి నాయకులు కారాగారంలో బంధించబడిన దరిమిలా రెచ్చిపోయిన ప్రజలు ఉధృతంగా ఉద్యమాన్ని నిర్వహించాలని దీక్ష పూనడంతో శ్రీమతి ఇందిరాగాంధి కొందరు తెలంగాణా ప్రముఖులతో ఢిల్లీలో హడావిడిగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

కేంద్ర ప్రభుత్వ మాజీ మంత్రి యం. చెన్నారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ మాజీ మంత్రులు కొండా లక్ష్మణ్ బాపూజీ, నూకల రామచంద్రారెడ్డి, ప్రాంతీయ సంఘ అధ్యక్షులు శ్రీ జె. చొక్కారావు తప్ప ఈ సమావేశానికి ఆహ్వానింపబడిన మిగతా వారంతా ముఖ్యమంత్రికి వంతపాట గాళ్ళే. వీరుగాక ప్రతిపక్షాలకి చెందిన నాయకులు కొందరిని కూడా ప్రధానమంత్రి ఈ సమావేశానికి ఆహ్వానించి యుండిరి. ఉద్యమాన్ని నిర్వహిస్తున్న ప్రజాసమితి నాయకులను కాని, విద్యార్థి కార్యాచరణ సంఘం నాయకులను గానీ ఈ చర్చలకు పిలవలేదు. వారిలో అధిక సంఖ్యాకులు అప్పుడు ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం క్రింద జైళ్ళలో క్రుక్కబడి ఉన్నారు. **(సశేషం)**

– ఆదిరాజు వెంకటేశ్వర రావు

'రా(హుల్)ఫెల్' డౌన్ డీల్!

వసుధా(స)మయం

'బోఫోర్స్ కుంభకోణం మీ ప్రభుత్వాన్ని కూల్చింది. రాఫెల్ కొనుగోలు ఒప్పందం మోడీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకువస్తుంది' అని రక్షణ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ మొన్న శుక్రవారం పార్లమెంట్‌లో తమ ఉపన్యాసంతో నిజంగానే యుద్ధ భేరి మ్రోగించారు! ఇటీవల జరిగిన ఎన్నికలలో మూడు రాష్ట్రాలను కైవసం చేసుకున్న ఆనందంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ కొంత మాటల్లోనూ రాటుదేలిన మాట వాస్తవమే . రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలులో భారీఎత్తున కుంభకోణం జరిగిందనీ, ఆ విషయం మీద చర్చించకుండా మోడీ పరిపోతున్నారనీ, రాఫెల్‌పై దర్యాప్తు జరపకూడదని సుప్రీంకోర్టు ఎక్కడ అనలేదనీ రాహుల్ అంటూ తాము అధికారంలోకి వస్తే క్రిమినల్ నేరం క్రింద బాధ్యులను శిక్షిస్తామని చెలరేగిపోయారు.


రక్షణశాఖ అభ్యంతరాలను కూడా కాదని మోడీ నిరయణ్ణ తీసుకుని, అనిల్ అంబానీ సంస్థకు కాంట్రాక్టు దక్కేలా చేశారని, యుద్ధవిమానం ధరను రూ.1600 కోట్లుగా నిర్ణయించి యూపీఏ ప్రభుత్వ హయాంలో 126 విమానాల కొనుగోలు అనుకుంటే దానిని 36కు తగ్గించి దేశభద్రత అంశాన్ని పరిగణించినట్లు లేదని రాహుల్ ఎద్దేవా చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాని కూలద్రోయడానికి రాఫెల్ కుంభకోణం అస్త్రాన్ని కాంగ్రెస్ సానబెట్టడం చేస్తోంది.

రాఫెల్ ఒప్పందంపై రాహుల్ సవాళ్ళను రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ తన రెండు గంటల సుదీర్ఘ ప్రసంగంలో దీటుగా ఎదుర్కోవడం అందరి అభినందనపాత్రమయ్యింది. పార్టీకి ముడుపులు ముట్టనందుకే కాంగ్రెస్ తమ యూపీఏ ప్రభుత్వ హయాంలో యుద్ధవిమానాల కొనుగోలు కాంట్రాక్టును తొక్కిపెట్టి పార్టీ డబ్బుల కోసం దేశభద్రతనే ప్రమాదంలో పడివేసిందనీ, పొరుగువున్న చైనా, పాకిస్థాన్ వైమానికదళాలు పెద్ద ఎత్తున కొత్త విమానాలు కొనుగోలు చేసుకుని అదే సమయంలో తమ స్థితిని మెరుగుపరుచుకుంటూంటే భారతవైమానిక దళాన్ని బవహీన స్థితికి నెట్టింది కాంగ్రేస్ ప్రభుత్వమేనని నిర్మల వివరించారు.

యూపీఏ 2007లో బేరమాడినప్పుడు యుద్ధ విమానంధర రూ.526కోట్లు కావచ్చు కానీ పండ్లధరలే ఏటికేడాదిగా మారిపోతున్నప్పుడు ఈ ధర తాము వైమానికదళ పటిష్టతకు కట్టుబడి సమాయత్తమైనప్పుడు రూ.1600 కోట్లకు చేరినా వేనుకడుగు వేయలేమని అన్నారు. నిజానికి యూపీఏ బేరమాడిన ధరకన్నా ఇప్పటి లెక్కల్లో ఇది తొమ్మిది శాతం తక్కువేనని, పైగా తామ బేరమాడిన యుద్ధవిమానం శస్త్రసహితమైన మరింత మెరుగైనదనీ, కాంగ్రెస్ హయంలో 18 విమానాల కొనుగోలుకే ప్రతిపాదనలు చేస్తే భారత వైమానికదళం అవసరాలు, అభ్యర్థనలమేరకే 36విమానాలు కొనుగోలుచేయడం జరుగుతోందన్నారు. ఈ 2019లోనే మొదట యుద్ధవిమానం రాఫెల్ దేశానికి వచ్చేస్తోందని, మూడేళ్లలోగానే ముప్ఫై ఆరు యుద్ధవిమానాలతో మన వైమానిక దళం దేశభద్రతలో మరింత పరిపుష్టమవుతుందనీ ఆమె వెల్లండించడం నిజంగా ప్రజానందదాయకమే!

రాహుల్ ఊరికే గగ్గోలు పెడుతున్నారుగానీ ఆయనకసలు ఈవిషయంపై సీరియస్‌నెస్ వుందా అని నిర్మల అడిగిన ప్రశ్న సహేతుకంగానే తోస్తోంది. ఎందుకంటే పార్లమెంట్‌లో ఈ అంశంపై మునుపు అరుణ్‌జైట్లీ మాట్లాడుతుంటే కాంగ్రెస సభ్యులు పేపర్ విమానాలు విసిరారు. మొన్న శుక్రవారం రాఫెల్ డీల్‌పై చర్చలో భాగంగా అన్నాడిఎంకె ఎంపి తంబిదురై మాట్లాడుతుంటే రాహుల్ గాంధీ కన్నుగీటి 'కొట్టు కొట్టు కన్నుగొట్టు ' అన్న పిల్ల చేష్టలు చూపారు. ఆరు నెలల క్రితం లోక్‌సభలో ప్రధాని మోడీ వద్దకు వెళ్ళి ఆయన్ను హత్తుకుని వచ్చి కూర్చుంటూ తన పక్కనే ఉన్న జోతిరాదిత్య సింధియా వైపు చూసి కన్నుగొట్టిన వైనం జనం ఇంకా మరిచిపోలేదుకదా! ఈ వ్యవహారసరళి మరి రాహుల్‌ను పెద్దమనిషి తరహాలో నిలబెట్టేదిగా కాక 'ఫెల్‌డౌన్' చేసేదిగానే ఉంది.

మోడీ గాని, నిర్మలాసీతారామన్ గాని రాహుల్ వలే సంపన్న కుటుంబాల నుంచి వచ్చిన వారు కాదు. కానీ వారిని అబద్ధాలకోరులుగా , దొంగలుగా అవమానించటం వారి వయసునూ, పెద్దరికాన్ని దృష్టిలో ఉంచుకునయినా రాహుల్ వంటి యువ నేతలు చేయాల్సిన పనికాదు. రాఫెల్ యుద్ద విమానాల కొనుగోలు ఒప్పందాన్ని కాంగ్రెస్ తమ హయాంలో పదేళ్లు నాన బెట్టింది. మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పధ్నాలుగా నెలల్లో ఖరారు చేసింది. 2002లో భారత వైమానికదళం 42 స్క్వాడ్రన్‌ల యుద్ధవిమానాలు కలిగి వుండేది.2007కు 36కు, 2015కు 33 స్క్వాడ్రన్‌లకు తగ్గిపోయాయి. ఈ కాలంలోనే మన పొరుగున ఉన్న చైనా అయిదోతరం యుద్ధవిమానాలు 400 చేకూర్చుకోగా , పాకిస్థాన్ ఎఫ్–16 విమానాలను రెట్టింపు చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ కాంట్రాక్టు హాల్‌కు దక్కకపోవటం గురించి మాత్రమే వగచుతూ ప్రధానికి ఆశ్రితపక్షపాతం అంటగడుతున్నారనీ, అనిల్ అంబానీ సంస్థకు సెట్‌ఆఫ్ కాంట్రాక్టు దక్కడంలో గూడుపుఠాణీ ఏమీ లేదని విశ్వసనీయత చేకూరడం అవసరం. నిజానికి ఆ దిశగా రక్షణమంత్రి మరింత వివరణ ఇచ్చి ఉంటే బాగుండేది. రాఫెల్‌పై కాంగ్రెస్‌ది అసత్య ప్రచారం అని త్రిప్పికొట్టడంలో నిర్మలాసీతారామన్ చూపిన వాగ్ధాటి నిజంగా ప్రతిపక్షంపై యుద్ధ విమానంలా దూసుకుపోయిందన్న మాట మాత్రం నిజం.



సుధామ
9849297958

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

విజయక్రాంతి, వనపర్తి: గ్రామ పంచాయితీ ఎన్నికల్లో భాగంగా వనపర్తి తాలుకాలో సోమ వారం గ్రామ పంచాయితీ సర్పంచ్‌ల నామినేషన్ల స్వీకరణ పర్వం ప్రారంభం కానుంది. వనపర్తి తాలుకాలో మొదటి విడతలో వనపర్తి, గోపాల్‌పేట, రేవల్లి మండలాల గ్రామాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈనెల 9వ తేదీన నామ పత్రాల స్వీకరణకు చివరి రోజు. అదే విధంగా 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల పరిశీలన ఉంటుంది. సక్ర మంగా ఉన్న నామ పత్రాల్లోని అభ్యర్థుల జాబితాల తయారీ సాయంత్రం 5 గంటల తర్వాత ఉంటుంది. 11వ తేదీన అప్పీలుకు చివరి రోజు. 12 వ తేదీన అప్పీలు పరిష్కారానికి చివరి రోజు. 13వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజు. అదే విధంగా అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రచురణ సాయంత్రం 3 గంటల వరకు ఉంటుంది. 21వ తేదీన పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుంది.

పోడు రైతులకు పట్టా పాసుపుస్తకాలు అందేలా కృషి చేస్తా: సీతక్క

విజయక్రాంతి, ములుగు: పోడు రైతులకు పట్టా పాసు పుస్తకాలు అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ప్రతి రైతుకు పట్టా పాసు పుస్తకాలు అందేలా కృషి చేస్తానని ములుగు శాసన సభ్యురాలు ధనసరి సీతక్క అన్నారు. ఆదివారం నాడు మండలంలోని అంగన్నగూడెం, జగ్గన్నగూడెం, లాలాయి గూడెం, సర్వాపూర్, పెగడపల్లి, రాయినిగూడెం, కొత్తూరు, కన్నాయిగూడెం, జంగాలపల్లి గ్రామాలలో సీతక్కకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ములుగు ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా ఘనంగా సన్మానించారు. అనంతరం సీతక్క ఆయా గ్రామాల ప్రజల స్థానిక సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతక్క ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఏజెన్సీ గ్రామాల్లో చాలా మంది రైతులు పోడు వ్యవసాయం చేసుకుని కొన్ని సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్నారని కానీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. తప్పనిసరిగా పోడు భూముల విషయమై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకవచ్చి అసెంబ్లీలో మాట్లాడి ప్రతి ఒక్కరికీ పట్టాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే స్థానిక సర్పంచ్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు వారి సత్తాను చాటాల్సిన అవసరం ఉందని సీతక్క అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మస్రగాని వినయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ వేముల సమ్మిరెడ్డి, నాయకులు కుమార్‌గౌడ్, ఎండీ చాంద్ పాషా, ఆకుతోట చంద్రమౌళి, మాజీ సర్పంచ్‌లు ఈగ కృష్ణయ్య, ఈక రాజన్న, పంజాల తిరుపతి, బానోతు రవిచందర్, ఎండీ అహ్మద్ పాషా, మహేందర్, సమ్మయ్య, తుపాకుల ప్రభాకర్, ఎర్రబెల్లి దేవేందర్‌రావు, మంకిడి పూర్ణచందర్, కోగిల మహేష్, గంద్రత్ దయాకర్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు కర్లపల్లి విద్యార్థులు

విజయక్రాంతి, ములుగు: గత నెల 28 నుంచి 30 వరకు గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు జరిగిన క్రీడలలో కర్లపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కల్తీ శ్రీనివాస్, పీఈటీ యాలం ఆదినారాయణ తెలిపారు. ఈ సందర్భంగా కర్లపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో రాష్ట్ర క్రీడలకు ఎంపికైన వారిని ఆశ్రమ పాఠశాలలో సన్మానించి అభినందించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ కర్లపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు షాట్పుట్ క్యారమ్స్, కోకో, వాలీబాల్ క్రీడల్లో సంతోష్, పద్మారావు, అజయ్, తిరుపతి, ప్రభాస్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 8 నుంచి 10 వరకు భద్రాచలంలో రాష్ట్ర ఐటీడీఏ స్థాయి క్రీడలు నిర్వహించడం జరుగుతుందని ఈ క్రీడల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు పాల్గొంటారని శ్రీనివాస్ తెలిపారు.

అమెరికాలో మానుకోట వాసిపై కాల్పులు

విజయక్రాంతి, మహబూబాబాద్: మానుకోట పట్టణానికి చెందిన పూస సాయికృష్ణపై అమెరికాలోని మిచిగాన్ రాష్ట్రంలో కాల్పులు జరిగాయి. ఈ నెల 3న ఈ సంఘటన జరిగింది. ఈ కాల్పుల ఘటనపై మానుకోట పట్టణంలో కలకలం రేగింది. మహబూబాబాద్ పట్టణానికి చెందిన పూస ఎల్లయ్య, శైలజ దంపతుల కుమారుడు సాయికృష్ణ లారెన్స్ టెక్నో యూనివర్సిటీ సౌత్ ఫీల్డ్‌లో యంఎస్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చేస్తున్నాడు. అమెరికాలోని మిచిగాన్ రాష్ట్రంలో ఒక రెస్టారెంట్‌లో పార్సిల్ తీసుకొని వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులకు పాల్పడ్డారని, కాల్పులలో సాయికృష్ణ కుడిచేతిపై, మెడపై బుల్లెట్ గాయాలు అయినట్లు తెలిసింది. ప్రస్తుతం వారి సమీప బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు సాయికృష్ణ ప్రాణాపాయం నుంచి బయటపడి కోలుకుంటున్నట్లు తెలిసింది. అతని నుంచి డబ్బులు, కారు, గుర్తింపు కార్డు అపహరించినట్లు బంధువులు తెలిపారు.

వంటింటి కష్టాలు తీర్చేందుకే ఉజ్వల

విజయక్రాంతి, నాగర్‌కర్నూల్: దళిత మహిళలు ఎదుర్కొంటున్న వంటింటి కష్టాలను తీర్చేందుకే ప్రధాని నరేంద్రమోడీ ఉజ్వల పథకాన్ని ప్రవేశపెట్టారని బీజేపీ నాయకులు చందు అన్నారు. ఆదివారం నాడు మండల పరిధిలోని మంథటి గ్రామంలో ఉజ్వల పథకం ద్వారా మహిళలకు సిలిండర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు కట్టెల పొయ్యిపై వంటలు చేయకుండా ఉండేందుకు మొదటి దఫాలో దళిత మహిళలకు ఉచితంగా సిలిండర్లు పంపిణీ చేయడం జరిగిందని, త్వరలోనే ఈ పథకాన్ని బడుగు బలహీన వర్గాల ప్రజలందరికీ వర్తించేలా చర్యలు తీసుకోవడం జరిగింది తెలిపారు. రాష్ట్రంలో లక్షలాది మంది మహిళలను ఈ పథకంలో లబ్ధిదారులుగా చేర్చడం జరిగిందని వివరించారు. జిల్లాలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా సిలిండర్లను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎంపీటీసీతో పాటు పలువురు నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీని అడ్డుకున్న గ్రామస్తులు

విజయక్రాంతి, బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలోని పోచారం కాలనీ వాసులు ఆదివారం ఇసుక లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ నిత్యం పదుల సంఖ్యలో లారీలు ఓవర్ లోడ్‌లతో వెళుతున్నాయని, దీని వలన తమ రోడ్లు చెడిపోతున్నాయని అన్నారు. దీని వలన తమకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. దుమ్ము ధూళి ద్వారా తమ ఆరోగ్యాలు చెడిపోతున్నాయని ఓవర్‌లోడ్‌తో లారీలు పోకుండా కట్టడి చేయాలని వారు అన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై పూర్ణేశ్వర్ సంఘటనా స్థలానికి చేరుకుని కాలనీ వాసులకు నచ్చజెప్పడంతో అడ్డుకున్న లారీలను వారు విడిచిపెట్టారు.

సమాన పనికి సమాన వేతనమివ్వాలి

విజయక్రాంతి, బాన్సువాడ: ఈ నెల 8, 9 తేదీల్లో జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్. సిద్దిరాములు అన్నారు. ఆదివారం బాన్సువాడ సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 10 కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ, ఇన్సూరెన్స్ సంఘాల పిలుపు మేరకు సమ్మె నిర్వహిస్తున్నామని అన్నారు. కేంద్రంలో బీజేపీ దిగి వచ్చి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం 18000 రూపాయల వేతనం ఇవ్వాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లాలో 22 మండలాల్లో ధర్నాలు చేయాలని అన్నారు.

కోర్టు తీర్పును సాకుగా చూపి బీసీలను అణగదొక్కే కుట్ర: జాజుల

విజయక్రాంతి, నిజామాబాద్‌అర్బన్: సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సాకుగా చూపి బీసీలను రాజకీయంగా అణగదొక్కే కుట్ర జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం వెనుకబడిన తరగతులకు కల్పించిన రిజర్వేషన్ల హక్కులను కాపాడుకునేందుకు ఐకమత్యం అవసరం అన్నారు. బీసీలకు అమలు అవుతున్న 34 శాతం రిజర్వేషన్లను 22 శాతానికి తగ్గిస్తూ ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇది గ్రామస్థాయిలో బహుజనులు, వెనుకబడిన తరగతులు తమ హక్కులను కోల్పోయే విధంగా చేస్తుందని పేర్కొన్నారు. బీసీలకు జనాబా దామాషా ప్రకారం దక్కాల్సినవి దక్కకపోగా తీవ్ర అన్యాయం ఒక్క మనరాష్ట్రంలోనే జరుగుతుందని పేర్కొన్నారు. రిజర్వేషన్లను దక్కించుకునేందుకు ప్రాణత్యాగానికి వెనుకాడమని అన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నరాల సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అంజనేయులు, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై సీబీఐ విచారణ జరపాలి

విజయక్రాంతి, ఆర్మూర్: తలారి సత్యం, చేపూర్ రవి హత్య కేసుల్లో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై సీబీఐ విచారణ జరిపించాలని జాతీయ ఎస్సీ కమిషన సభ్యులు రాములుకు జిల్లా ఎమార్పీఎస్ అధ్యక్షులు మైలారం బాలు ఫిర్యాదు చేశారు. వీరి హత్య కేసులో సీబీసీఐడీ విచారణ జాప్యం జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సీబీఐ విచారణ జరిపించాలని కోరారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై ఫిర్యాదు చేసినా ఇంత వరకు కేసు నమోదు చేయలేదన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే ఆయినందునే కేసు నమోదులో జాప్యం జరుగుతుందని ఆరోపించారు. ఆయన వెంట దేవన్న, బాబు, రాజన్న, గంగారాం తదితరులు వున్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీ...

- అవసరం ఉన్నా లేకున్నా టెస్టులు, స్కానింగ్
- పర్సంటేజీల కోసం వైద్యుల సిఫార్సు
- రోగులు, సిబ్బంది ప్రాణాలతో చెలగాటం



విజయక్రాంతి, నిజామాబాద్: నిజామాబాద్ జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో ప్రైవేటు ఆసుపత్రుల వైద్య వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. ప్రైవేటు ఆసుపత్రులు వైద్యాన్ని అద్భుతమైన వ్యాపారంగా మార్చాయి. బహుళ అంతస్తుల భవనాల్లో ఆసుపత్రులను నిర్వహిస్తూ రోగులను అందినకాడికి దోచుకోవడమే ధ్యేయంగా పెట్టుకున్నాయి. ఏ చిన్న జ్వరం వచ్చినా, ఆరోగ్యం సరిగా లేదని ప్రైవేటు ఆసుపత్రికి వెళ్తే వేల రూపాయలు బిల్లు చెల్లించుకోవాల్సిందే. అవసరం ఉన్నా లేకున్నా ఎక్స్‌రే, స్కానింగ్ చేయించి వైద్యులు రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇందుకు కారణాలు లేకపోలేదు. టెస్టులు, ఎక్స్‌రే, స్కానింగ్‌లు తీయిస్తే సంబంధిత కేంద్రాల నుంచి డాక్టర్లకు 40 నుంచి 50 శాతం కమీషన్ అందుతుంది. కమీషన్ల కక్కుర్తితో ప్రైవేటు ఆసుపత్రులు రోగులకు పరీక్షలు చేయిస్తూ అందిన కాడికి దండుకుంటున్నాయి. జిల్లాలో వందకుపైగా ల్యాబ్, ఎక్స్‌రే, స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. ఇందులో 50 శాతం వైద్య ఆరోగ్యశాఖ అనుమతులు లేకుండా అక్రమంగా కొనసాగుతున్నాయి.

టెస్టులు చేయించుకుంటేనే వైద్యం

ప్రైవేటు ఆసుపత్రికి వెళ్తే టెస్టులు చేయించుకోనిదే వైద్యం అందటం లేదు. తమ వద్ద వైద్యం కోసం వచ్చే వారికి టెస్ట్‌లు, స్కానింగ్‌లు, ఎక్స్‌రేలు తీయించాలని సిఫార్సు చేయడం ప్రైవేటు వైద్యులకు వృత్తిలో భాగంగా మారింది. ఏ చిన్న అనారోగ్యం ఉందని వెళ్లినా డాక్టర్ తన ముందున్న పుస్తకాలను తీసుకుని వాటిలో కొన్నింటిపై టిక్కులు పెట్టి చేతిలో పెడుతున్నారు. చీటీలపై పలురకాల టెస్టులు ఉండటంతో ఏ టెస్ట్ చేయాలో అందులో పేర్కొనడంతో వారు డాక్టర్ రాసిన ల్యాబ్‌కు వెళ్లి టెస్‌లు చేయించుకోవాల్సిందే. టెస్టులు చేయించుకుని రిపోర్టు వస్తేగానీ అనారోగ్య సమస్య చెప్పరు, మందులు రాయరు. ఇదీ డాక్టర్ల పనితీరు. టెస్టుల తర్వాత ఏమీ లేదని, అంతా బాగానే ఉందని రిపోర్టు వచ్చిన వారు అనవసరంగా వేల రూపాయలు ఖర్చయ్యాయని తల పట్టుకోవడం తప్ప చేసేదేమీ ఉండటం లేదు.

ఆర్‌ఎంపీ, పీఎంపీలకు కమీషన్లు

గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు పట్టణ ప్రాంతాల్లోని ప్రైవేటు ఆసుపత్రులు, వైద్యుల వద్దకు రోగుల పంపితే వారి నుంచి కమీషన్ అందుతుంది. కమీషన్ రోగుల ఫీజు నుంచే వెళ్తుంది. అందుకే ఆసుపత్రులు, వైద్యులు అవసరం ఉన్నా లేకున్నా డబ్బుల కోసం రకరకాల టెస్టులు చేయించి బిల్లును పెద్ద ఎత్తున పెంచుతున్నాయి. పలు ఆసుపత్రుల్లో మా వద్ద ఆర్‌ఎంపీ, పీఎంపీలకు కమీషన్ ఇవ్వబడదు అని బోర్డులు ఏర్పాటు చేయడం గమనార్హం. దీన్ని బట్టి అర్థమవుతుంది ప్రైవేటు ఆసుపత్రులు తమ వద్దకు రోగులను పంపే వారికి కమీషన్లు ఇస్తాయనేది.

రోగుల ప్రాణాలతో చెలగాటం

ప్రైవేటు ఆసుపత్రులు, వైద్యులు రోగుల ప్రాణాలతో చెలగాటం అడుతుంటే స్కానింగ్, ఎక్స్‌రే కేంద్రాలు వారి వద్ద పనిచేసే సిబ్బంది ప్రాణాలతో చెలగాటం అడుతున్నాయి. ఒకసారి సీటీ స్కాన్ గానీ ఎక్స్‌రే గానీ తీయిస్తే కనీసం 6 నెలల వరకు తిరిగి తీయించుకోవద్దని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. రేడియేషన్ ప్రభావంతో క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. రోగులకు సిటీ స్కాన్, ఎక్స్‌రేలు తీసే సిబ్బంది ఆరోగ్యం విషయంలో ఆయా ల్యాబ్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. రోజుకు 20 వరకు మాత్రమే సీటీ స్కాన్లు, ఎక్స్‌రేలు తీయాల్సి ఉన్నా ల్యాబ్ యాజమాన్యాలు ఇష్టానుసారంగా వారితో పనిచేయిస్తున్నాయి. సిబ్బందిపై అధిక రేడియేషన్ ప్రభావం పడుతోంది. వారి ఆరోగ్యం గాలికొదిలి లాభార్జనకు ల్యాబ్‌లు పనిచేస్తున్నాయి.

అధికారుల నిర్లక్ష్యం

జిల్లాలో అనుమతులు లేకుండా అక్రమంగా స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లు ఉన్నా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనికి కారణం చాలా వరకు ప్రైవేటు ఆసుపత్రులు అనుబంధంగా ల్యాబ్‌లను ఏర్పాటు చేసుకోవడమే. అధికారులు వచ్చినప్పుడు మేనేజ్ చేయడంతో వారు ఏం జరిగినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అవసరం ఉన్నా లేకున్నా టెస్టులు రాస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న ప్రైవేటు ఆసుపత్రులు, వైద్యుల విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.



గద్వాలలో చెడ్డీ గ్యాంగ్ కలకలం

- ఆందోళనలో పట్టణవాసులు

విజయక్రాంతి, జోగులాంబ గద్వాల: ప్రశాంతంగా ఉన్న గద్వాల పట్టణంలో కలకలం రేగుతోంది. పట్టణంలోని వేణు అపార్ట్‌మెంట్‌లోకి గుర్తు తెలియని ఆరుగురు వ్యక్తులు ముఖానికి మాస్కులు వేసుకొని, చెడ్డీలతో (చెడ్డీగ్యాంగ్) సంచరించినట్లు సీసీ పుటేజీలో రికార్డు అయిన విషయం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేయటంతో పట్టణవాసులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా గద్వాల పట్టణం ప్రశాంతంగా ఉంది. ఎలాంటి అలజడులు లేవు. చిన్న చిన్న దొంగతనాలే తప్ప పెద్ద ఎత్తున దొంగతనాలు జరిగిన దాఖలాలు లేవు. అంతర్‌రాష్ట్ర ముఠా పట్టణంలో సంచరించిందనే వార్తలతో పట్టణవాసులకు భయం పట్టుకుంది. వేణు అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం అర్ధరాత్రి అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించి సీసీ కెమెరాలన పైకెత్తి అపార్ట్‌మెంట్‌లో ఉన్న గదుల తలుపులను కొట్టినట్లు స్థానికులు తెలిపారు. ఎవరూ కూడా తలుపులు తెరవకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అపార్ట్‌మెంట్ వాసులతో పాటు పట్టణ శివారు ప్రాంతవాసులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. చెడ్డీగ్యాంగ్ దొంగతనాలకు వచ్చి హత్యలు కూడా చేస్తారని గతంలో బయట పడటంతో పట్టణవాసులు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని కాలం వెళ్లదీస్తున్నారు.

భయపడాల్సిన అవసరం లేదు... పోలీసులు

పట్టణంలో మాస్కులు వేసుకొని తిరుగుతున్న చెడ్డీగ్యాంగ్‌కు భయపడాల్సిన అవసరం ఏమీ లేదని పట్టణ ఎస్సై సత్యనారాయణ అన్నారు. కాలనీలలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నా, గమనించినా తప్పకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. చెడ్డీగ్యాంగ్ చోరీకి యత్నించిన అపార్ట్‌మెంట్ సీసీ పుటేజీలు పరిశీలించామన్నారు. పట్టణంలో పెట్రోలింగ్‌ను మరింత పకడ్బందీగా చేపడతామన్నారు. పట్టణంలో ఎలాంటి దొంగతనాలు జరగకుండా పోలీసులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటారని ఎస్సై తెలిపారు.

టీఆర్‌ఎస్ ప్రలోభాలకు తలొగ్గకుండా సేవకులనే ఎన్నుకోవాలి: రేవూరి

విజయక్రాంతి, నర్సంపేట: గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో అధికార టీఆర్‌ఎస్ పార్టీ పెట్టే ప్రలోభాలకు తలొగ్గకుండా గ్రామానికి నిజాయితీగా సేవ చేసే వారిని సర్పంచ్‌లుగా, వార్డు సభ్యులుగా ఎన్నుకోవాలని తెలుగు దేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. నర్సంపేట పట్టణ కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం తెలుగు దేశం పార్టీ నర్సంపేట నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రేవూరి మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను చూసి కార్యకర్తలు అధైర్యపడి కృంగిపోవద్దని, టీఆర్‌ఎస్ పార్టీ అన్నీ అబద్ధాలే చెబుతుందని, గత ఎన్నికల్లో ఆ మాటలు నమ్మి రాష్ట్ర ప్రజలంతా మోసపోయారని మళ్లీ ఇప్పుడు అబద్ధాలు చెప్పి సర్పంచ్ ఎన్నికల్లో గెలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని దీనిని ప్రజలు గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. గ్రామాల్లో మంచి వ్యక్తులు, సేవాభావం గల వారిని సర్పంచ్‌లుగా, వార్డు సభ్యులుగా ఎన్నుకుంటేనే గ్రామం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని, గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉంటుందని అన్నారు. ఇప్పుడు అధికార పార్టీ గ్రామాల్లో నజరానాల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని, డబ్బుల ప్రలోభాలకు లేక ఇతర ఒత్తిళ్లకు తలొగ్గి సర్పంచ్‌లను వార్డు సభ్యులను ఎన్నుకుంటే అయిదేళ్లు ప్రజలు పశ్చాత్తాప పడాల్సిందేనని అన్నారు. టీడీపీలో సుశిక్షితులైన నాయకులు, కార్యకర్తలు ఉన్నారని నిస్వార్థంగా గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సేవాభావంతో పనిచేసే నాయకత్వం టీడీపీ అని, బేషజాలకు పోకుండా గ్రామాల్లో అధికార పార్టీని ఎదుర్కొవడానికి పార్టీ నాయకులు ఏకతాటిపైకి వచ్చి నిజాయితీగా పని చేసే సేవకులైన పార్టీ కార్యకర్తలను ఎంపిక చేసి బరిలో నిలపాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఎర్ర యాకూబ్ రెడ్డి, అజ్మీర శ్రీనివాస్, జాటోతు సంతోష్ నాయక్, వేముల బొందయ్య, కొయ్యడి సంపత్, కొమ్మాలు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవానికి విముఖత పోటీకే మొగ్గు

- గ్రామాల్లో ఊపందుకున్న పంచాయతీ పోరు


విజయక్రాంతి, అలంపూర్: పంచాయితీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే గ్రామాల్లో పంచాయతీ పోరు షురూ అయింది. ఇప్పటికే ఆదేశాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం అందుకనుగుణంగా ప్రణాళికలు రుపొందిస్తోంది. రిజర్వేషన్లు ఖరారు కావడంతో గ్రామాల్లో ఎన్నికల కోలాహలం మొదలైంది. ఎవరికి వారే గ్రూపులు కట్టుకుని కట్టుబాట్లు పెట్టుకుని మరి పంచాయితీ ఎన్నికలకు సిద్ధమౌతున్నారు. పరస్పరం సహకారం చేసుకుందాం అంటూ చర్చలు జరుపుతున్నారు. ఒక నోటిఫికేషన్ వెలువడక ముందు నుంచే గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. ఇక అభ్యర్థులు తెరమీదకు రావడంతో మందుబాబులకు పండగే పండగ. అసెంబ్లీ ఎన్నికలలో పంచిన మద్యం ఇంకా గ్రామాల్లో ఖాళీ కానే లేదు, అప్పుడే పంచాయతీ ఎన్నికల మద్యం వచ్చి చేరుతుంది.

గ్రూపు రాజకీయాలు షురూ..

గ్రామాల్లో ఉండే మాజీలు, చోటా మోటా నాయకులు పార్టీలకతీతంగా గ్రూపులు కడుతున్నారు. నేతలు కూడా గెలుచుకుని రండి అంటూ తమ అనుచరులకు ఆదేశాలిస్తున్నారు. ఇక గ్రామాల్లోని నాయకులు పార్టీలను పక్కనబెట్టి వ్యక్తిగత గ్రూపులు కడుతున్నారు. గ్రామాల్లో ఉండే ముఖ్యంగా రెండు వర్గాలు ఒకతాటిపైకి వచ్చి రిజర్వేషను ఏవరికీ వచ్చినా పరస్పరం సహకారం అందించుకుందాం అంటూ చర్చలు జరుపుతున్నారు. ఇక రిజర్వేషన్లను ఖరారు కావడంతో ఇప్పటి నుంచే తమ తమ అనుచరులకు మద్యం జోరుగా పంపిణీ చేస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో అయితే కుల సంఘాలతో చర్చలు జరుపుతూ వారడిగిన వాటికి అంగీకారం తెలుపుతూ ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

గెలుచిన వారే మావారు.. నాయకుల ధోరణి

ముఖ్యంగా పంచాయతీ ఎన్నికలలో రాజకీయ పార్టీల అవశ్యకత అంతగా ఏర్పాడదు.. ఎందుకంటే గ్రామానికి సర్పంచే ప్రధానం. అభ్యర్థి వ్యక్తిగతంపై ఆధారపడే ఈ ఎన్నికలలో రాజకీయ నాయకులు నిశిత పరిశీలనలోనే ఉండేందుకు ఇష్టపడుతుంటారు. ప్రస్తుతం రాష్ట్రంలో కారుజోరు హుషారుగా ఉంది. దీంతో చాల గ్రామాల్లో ఒకే పార్టీ నుంచి ఇద్దరికి మించి పోటీలో ఉండే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి గ్రామాలకు రాజకీయ నాయకులు రాంరాం అంటున్నారు. ఎందుకంటే ఎవరికి సహకారం అందించినా మరో వర్గం దూరమయ్యే అవకాశం లేకపోలేదు. దీంతో గెలిచినవారే మావారు అన్న ధోరణిలో ఉన్నారు నాయకులు.



క్యాట్-18 ఫలితాల్లో టైం ఇనిస్టిట్యూట్ విద్యార్థుల ప్రతిభ

విజయక్రాంతి, వరంగల్ అర్బన్: క్యాట్–2018 ఫలితాల్లో వరంగల్ టైమ్ (ట్రియంఫాంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్) కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఆదివారం వెలువడిన సీఏటీ–2018 ఫలితాల్లో టైమ్ కోచింగ్ సెంటర్‌లో కోచింగ్ తీసుకున్న విద్యార్థులు నిపున్ అగర్వాల్ 99.92 శాతం, సంజనారెడ్డి 99.53 శాతం, పార్థ్ గోస్వామి 97.04శాతం, బీహెచ్ మణికంఠ 95శాతం, గౌరవ్ మాలిక్ 92.81శాతం, జలక్ బన్సాల్ 92.44శాతం, కౌషిక్ రంజన్ 91.89శాతం, సాయి శశాంక్ 88.55శాతం ఉత్తీర్ణతను సాధించారు. ఈ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన ఈ ఎనిమిది మంది విద్యార్థులను టైమ్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ చిట్టిమళ్ల నాగరాజు అభినందించారు.

పదండి పోదాం.. పల్లెపోరుకు..

విజయక్రాంతి, మహబూబ్‌నగర్: పల్లెపోరుకు సర్వం సిద్ధమయ్యింది. ఇటు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు, అటు పంచాయతీలో పోటీ చేసేందుకు స్థానికులు పల్లెబాట పట్టారు. స్థానికంగా తమ సత్తా నిరూపించుకునే సమయం ఆసన్నమైందని వివిధ పార్టీలకు చెందిన చోటా మోటా లీడర్లు ఆరాటపడుతున్నారు. పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గత కొంత కాలంగా ఆశావాహులు గ్రామంలో వివిధ అభివృద్ధి పనుల్లో భాగం పంచుకుంటున్నారు. రిజర్వేషన్ల పుణ్యమా అంటూ అవకాశం దక్కకపోయినా తమ మద్దతుతో ఎవరినో ఒకరిని రంగంలో నిలబెట్టి గెలిపించుకోవాలనే దిశగా పావులు కదుపుతున్నారు. 50 శాతం రిజర్వేషన్ల మూలంగా మహిళలకు కేటాయించే పంచాయతీ స్థానాల్లో తమ భార్యలను నిలబెట్టి గెలిపించుకోవాలనే ఆశగా నేతలు ఆలోచిస్తున్నారు. ఈ మేరకు వివిధ పార్టీల నేతలు సమర్థులైన నేత కోసం సమాచారాన్ని సేకరించినట్లు తెలుస్తుంది. ఇటీవలనే అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో తాజా ఎమ్మెల్యేలు కూడా తమ సత్తా నియోజకవర్గంలో నిరూపించుకోవాలంటే ఎక్కువ మందిని సర్పంచ్‌లను గెలిపించుకోవాలనే ఆశగా పథకాలు రచిస్తున్నారు.

ఈ నెల 7, 11, 16 తేదీల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఇందు కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి 1682 గ్రామ పంచాయతీల్లో సాఫీగా ఎన్నికలు నిర్వహించడానికి అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఇందులో మహిళా రిజర్వేషన్ల కోటా కింద 841 గ్రామ పంచాయతీల్లో మహిళలు పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నారు.

గ్రామాల్లో సందడి వాతావరణం

ఇటీవలే శాసన సభ ఎన్నికలు ముగిసినప్పటికి వెంటనే గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలంటూ న్యాయస్థానం ఆదేశించడంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొన్నది. మొదటి విడత నోటిపికేషన్ జారీ నేటి నుంచే ప్రారంభం అవుతుండగా ఆశావహులు అంతా నామినేషన్లు వేయడానికి సిద్ధమయ్యారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా రాజకీయాలకు రావాలనుకునే వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వివిధ పార్టీలు అంగబలం అర్థబలం ఉన్న అభ్యర్థిని రంగంలో దించాలని అన్వేషిస్తున్నారు.

ఏజెన్సీలో అభ్యర్థులు కరువు

- గందరగోళంగా వార్డుల విభజన

విజయక్రాంతి, అచ్చంపేట: నియోజకవర్గ పరిధిలోని అమ్రాబాద్ మండలం ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఇక్కడ సర్పంచ్ పదవులకు సంబంధించి ఎస్‌టీ వర్గీయులకే రిజర్వేషన్‌ను కేటాయించడం జరిగింది. కాగా గత 2013 ఎన్నికల్లో అమ్రాబాద్ మండలంలో కేవలం కుమ్మరోనిపల్లి గ్రామంలో ఎస్సీలు లేని కారణంగా గత 5 ఏళ్ళుగా ఇక్కడ స్పెషల్ ఆఫీసర్ పాలన సాగింది. ప్రస్తుతం తండాలను గ్రామ పంచాయతీలుగా విభజించి ఎన్నికలు నిర్వహిస్తున్న క్రమంలో ఐదు గ్రామపంచాయతీల్లో సర్పంచ్‌గా పోటీ చేసేందుకు ఎస్‌టీ కేటగిరీకి చెందిన వ్యక్తులు లేని కారణంగా కుమ్మరోనిపల్లి, వంగురోనిపల్లి, కల్ములోనిపల్లి, లక్ష్మాపూర్(బికె), మన్ననూర్ ప్రశాంత్ కాలనీ గ్రామ పంచాయతీలలో సర్పంచ్ ఎన్నికలు లేనట్లే. కాగా ఈ ఐదు గ్రామపంచాయతీలలో దాదాపుగా 8 వార్డులు వుండగా 4 ఎస్‌టీలకు, 4 జనరల్ కేటగిరీగా రిజర్వేషన్లు రావడంతో ప్రస్తుతం 4 ఎస్‌టీ వార్డుల్లో కూడా అభ్యర్థులు లేక ఎన్నికలు జరిగే అవకాశం లేదు.



ఇదిలా ఉండగా వార్డుల విభజనలో ప్రభుత్వం విచ్చలవిడితనం పాటించిందని, ఒకే కుటుంబానికి చెందిన భార్యభర్తలు గతంలో ఒకే వార్డులో ఉండగా ప్రస్తుతం భార్యను ఒకవార్డులో, భర్తను ఒక వార్డులో విభజించి ఓటర్లను గందరగోళంలో పడేసిందని గ్రామస్తులు వాపోతున్నారు. దీనికి తోడు వార్డుల వారీగా అందించిన ఓటర్ లిస్టులో మరణించిన వారిని తొలగించకుండా అలాగే ఇచ్చారని, కనీసం వారిని డిలీట్ చేసినట్లు కూడా లేదని, సోమవారం నుంచి నామినేషన్లు ఉండగా ఇప్పటి వరకు కూడా కొన్ని గ్రామాలకు ఓటర్ లిస్టులు అందనేలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం అచ్చంపేట నియోజకవర్గ ఫరిధిలో కొన్ని గ్రామపంచాయతీల్లో అభ్యర్థులను ఖరారు చేయడం, ఏకగ్రీవం చేయడం కూడా మొదలు కావడం విశేషం.

అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట పడేనా..?

- అధికారుల అనుమతితోనే నింపామంటున్న ట్రాక్టర్ యజమానులు
- కొలిక్కిరాని అధికారుల దర్యాప్తు...!
- నేడు తేలనున్న భవితవ్యం



విజయక్రాంతి, బోధన్: బోధన్ మండలంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. పట్ట పగలే అక్రమంగా ఇసుక రవాణా జోరుగా కొనసాగుతోంది. గుట్టు చప్పుడు కాకుండా రెవెన్యూ అధికారులు, ట్రాక్టర్ యజమానుల కుమ్మక్కై యథేచ్చగా ఇసుక రవాణా జరుపుతున్న సంగతి ప్రస్తుతం బోధన్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల బోధన్ మండలం మందర్న క్వారీలో పట్టుబడ్డ 13 అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు వాటిని బోధన్‌లోని రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. ఇంతలో ట్రాక్టర్ యజమానులు రెవెన్యూ అధికారులు నింపమంటేనే మేం ఇసుక నింపామని సదరు రెవెన్యూ అధికారి అనుమతితోనే ట్రాక్టర్‌లలో ఇసుక నింపామని అన్నారు. లేదంటే అంత దర్జాగా ఇసుక దొంగతనం చేసే ధైర్యంగానీ, దుస్సాహసంగానీ ఎవరూ చేయరని వారు వాపోతున్నారు. పర్మిషన్‌లు వస్తాయని అధికారులు చెప్పటంతోనే మేము ట్రాక్టర్లు నింపామని డ్రైవర్లు చెబుతున్నారు. అటు అధికారులు మాత్రం ఇదంతా అక్రమ ఇసుక రవాణాయేనని, ఏ రెవెన్యూ అధికారి వారికి అలా చెప్పలేదని చెబుతున్నారు. ఇంతటితో ఆగ్రహానికి లోనైన ట్రాక్టర్ యజమానులు సదరు రెవెన్యూ అధికారులపై మండిపడటంతో విషయం కాస్తా సోషల్ మీడియా, ప్రింట్ మీడియా ద్వారా అందరికీ తెలియటంతో జిల్లా కలెక్టర్ ఈ విషయంపై విచారణ చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన జిల్లా మైనింగ్ అధికారులు అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానుల వివరాలు సేకరించినట్టు సమాచారం. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశమైన మైనింగ్ అధికారులు పూర్తి విచారణ జరిపి దోషులుగా తేలిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టడానికి వెనకాడమోమని తెలిపారు. రెవెన్యూ అధికారులు తప్పించుకోవటానికి మమ్మల్ని కావాలనే ఇరికించారని తమ తప్పేమీ లేదని ట్రాక్టర్ యజమానులు చెప్పుకొస్తున్నారు. ఈ విషయంపై దర్యాప్తు కొలిక్కి రాకపోవటంతో ఇసుక ట్రాక్టర్ల లెక్కతేలేదెప్పుడోనని, తమపై ఏ కేసులు బనాయిస్తారో అని ట్రాక్టర్ యజమానులు భయపడుతున్నారు. మరోవైపు ఈ ఇసుక అక్రమ రవాణా కేసు భవితవ్యం నేడు తేలనుందని విశ్వసనీయ సమాచారం. ఈ కేసులో ఎవరు బలవుతారో, ఎవరు బయట పడతారో వేచి చూడాలి మరి. ఇక నుండైనా అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట పడితే బాగుంటందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

ఏకమై.. ఏకగ్రీవం చేయండి

- కలిసికట్టు ఎన్నికల్లో ప్రయోజనాలెన్నో

విజయక్రాంతి, డోర్నకల్: గ్రామస్తులంతా ఒక్కటైతే.. పార్టీ విభేదాలను పక్కన పెట్టి.. కలసికట్టుగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటే.. ఏకగ్రీవంగా సర్పంచ్‌ని, వార్డు సభ్యులను ఎన్నుకోవచ్చు. గ్రామాల్లో ప్రశాంత వాతవరణం, ఐదు సంవత్సరాలు గ్రామభివృద్ధిపైనే దృష్టిసారించే అవకాశం ఉంటుంది. పార్టీల విభేదాలకు, వర్గ రాజకీయాలకు దూరంగా ఉండవచ్చు. పైసా ఖర్చు లేకుండా అందరి ఇష్టం మేరకు పదవులను సొంతం చేసుకోవచ్చు. ఆ తరువాత గ్రామాభివృద్ధిపై దృషి సారించవచ్చు. సర్పంచ్ ఎన్నికలకు స్థానిక ప్రజలు, నాయకులు, యువకులు ఆలోచించాల్సిన సమయం ఇదే.గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలన్న ఏకైక లక్ష్యంతో, ఐకమత్యంతో ముందుకు సాగితే.. అభివృద్ధి ఫలాలు అందుకోవచ్చు. గ్రామ పంచాయతీ మొత్తాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారంటే... ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల సజరానాను అందుకోవచ్చు. అంతేకాకుండా ఏకగ్రీవమైన సర్పంచ్ గ్రామాభివృద్ధి కొరకు కొంత సహాయాన్ని అందజేస్తాడు. డోర్నకల్ నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాల్లో ఏకగ్రీవంగా గ్రామ పంచాయతీలను ఎన్నుకునేందుకు కొన్ని గ్రామాల్లో ప్రయత్నాలు ఆరంభించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వు అయిన గ్రామాల్లో ముమ్మరంగా చర్చలు జరుపుతున్నారు. వారిని కుర్చోబెట్టి చర్చిస్తున్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి మహోత్సవం

విజయక్రాంతి, బోథ్: బోథ్ మండల కేంద్రంలో ఆదివారం ఉదయం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో సుబ్రమణ్య స్వామి విగ్రహ ఊరేగింపు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత హనుమాన్ మందిరం వద్ద నుంచి సుబ్రమణ్య స్వామి ఉత్సవ విగ్రహ ఊరేగింపు మొదలుకొని ప్రధాన వీధుల గుండా గాంధీచౌక్, మార్కండేయ మందిరం, వాటర్ ట్యాంక్, భగత్‌సింగ్ చౌక్‌ల గుండా నిర్వహించారు. స్వామి విగ్రహ ఊరేగింపుతో పట్టణంలో శరణు ఘోషతో మార్మోగింది. స్వామి వారి విగ్రహ ఊరేగింపులో స్వామికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలుకగా, కార్యక్రమంలో పాల్గొన్న మండలంలోని పలు గ్రామాల దీక్షా పరులు భక్తిపారవశ్యంతో నృత్యాలను చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, మేర్గ దాస్, జాదవ్ రఘువీర్, స్వాములు కథం ప్రభాకర్, వినోద్, అభిలాష్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

విజయక్రాంతి, కాగజ్‌నగర్: అపోలోమెడ్ స్కిల్, టిఎస్ సీసీడీసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత నైపుణ్యశిక్షణ, వసతి, ఉపాధి కార్యక్రమాన్ని ఈ నెల 8 తేదిన కాగజ్‌నగర్ పట్టణంలోని వినయ్ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు కాగజ్‌నగర్ టౌన్ సీఐ వెంకటేశ్వర్ తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసక్తి గల అభ్యర్థులు తమ స్టడీ సర్టిఫికెట్లతో హాజరు కావాలని అన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి

విజయక్రాంతి, పటాన్‌చెరు: పార్టీలకతీతంగా పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ఆదివారం యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో గూడెం మహిపాల్‌రెడ్డి ఎమ్మెల్యేగా రెండవ సారి ఘన విజయం సాధించిన సందర్భంగా మండల ప్రజా పరిషత్తు ప్రాంగణంలో యోగ బృందం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వారు పూలమాలలు, గజమాలలు, శాలువాలతో సత్కరించి, సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ సాకి చెరువు అభివృద్ధి కోసం రూ.11 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. దుర్గం చెరువు మాదిరిగా సాకి చెరువును అభివృద్ధి చేస్తామని, పట్టణంలోని తిమ్మక్క చెరువును మిని ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆ రెండు చెరువులను సుందరీకరణ జరిగితే ప్రజలకెంతో ఉపయోగపడుతుందన్నారు. దీంతో పాటు పట్టణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించనున్నట్లు తెలిపారు. నియోజకవ ఇంకా చేయాల్సిన అభివృద్ధి చాలా ఉందన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళి కలు రూపొందించామని ప్రజలందరూ అభివృద్ధిలో భాగ్యస్వామ్యం కావాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం ఎంపీపీ ఎన్.యాదగిరియాదవ్, జిన్నారం జెడ్పీటీసీ కుంచాల ప్రభాకర్, నాయకులు మాణిక్‌ప్రభు, సి.గోపాల్‌రెడ్డి, బాసిరెడ్డి నర్సింహారెడ్డి, నాగసాని సత్తయ్య, యోగా బృందం సభ్యులు బల్వీందర్‌సింగ్ యాదవ్, అడ్వకేట్ నర్సింలు, సంజీవరెడ్డి, మెట్టుకుమార్‌యాదవ్, టి.రాజన్‌సింగ్, కె.ఎల్లయ్య పాల్గొన్నారు.

సమ్మెకు ఎస్ఎఫ్ఐ మద్దతు



విజయక్రాంతి, కాగజ్‌నగర్: జాతీయ కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ఫెడరేషన్‌లు ఐక్యంగా ఈనెల 8,9వ తేదిల్లో నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రి సమ్మెకు పిలుపునిచ్చాయి, ఈ సమ్మెకు ఎస్ఎఫ్ఐ కుమ్రంభీం జిల్లా కమిటి పూర్తి మద్దతు ఇస్తుందని జిల్లా కార్యదర్శి చాపిలె సాయికృష్ణఅన్నారు. ఆయన మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం గత నాలుగున్నర ఏండ్లుగా ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలతో దూకుడుగా కొనసాగిస్తుందని అన్నారు. దేశంలో అధిక ధరలు , ఉపాధి కల్పన వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం, ప్రజా పంపిణి వ్యవస్థను పటిష్టం చేయడం రైతాంగానికి మద్దతు ధరలు, తదితర ప్రజా సమస్యలను పట్టించుకునే తీరికే ప్రభుత్వానికి సయం దొరకడం లేదని అన్నారు. సమ్మెకు ఎస్ఎఫ్ఐ పూర్తి మద్దతు తెలుపుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు తుమ్మిడి భీమేష్, జిల్లా ఉపాధ్యక్షులు జునుగరి రమేష్, మొర్లె పున్నమ్, జిల్లా కమిటి సభ్యులు సుజాత, ప్రణాళిక, తేజ, వినోద్, చిరంజీవి, ప్రకాస్‌లు పాల్గొన్నారు.

చెట్టుకు ఢీకొన్న లారీ

విజయక్రాంతి, దుబ్బాక: అదుపుతప్పి లారీ చెట్టుకు గుద్దుకున్న సంఘటన దుబ్బాక మండల చిట్టాపూర్, ధర్మాజీపేట గ్రామాల మధ్య చొటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రామాయంపేట వైపునుంచి సిద్దిపేట వైపునకు వస్తున్న ఏపి24టీఏ 1234 నెంబర్ గల లారీ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. దీంతో లారీలో ఉన్నా క్లీనర్‌కు కాలు విరిగింది. ప్రమాదంపై కేసు నమోదు చేశామని భూంపల్లి ఎస్ఐ రాజేష్ తెలిపారు.

ఖాతా ఉంటేనే పోటీ చేయాలి

- పంచాయతీ, ఇంటిపన్ను బకాయిలుంటే చెల్లించాలి
- నామినేషన్‌తో పాటు రసీదు జత చేయాలి
- ఎక్కడి నుంచి పోటీ చేసిన అక్కడ ఓటరై ఉండాలి
- క్రిమినల్ కేసుల్లో దోషులుగా నిర్ణారణ అయితే అనర్హులు
- నేడే తొలివిడత నామినేషన్ల ప్రారంభం

విజయక్రాంతి, సంగారెడ్డి: పల్లెపోరు సమీపిస్తున్న వేల ఎన్నికల కమిషన్ కొత్త కొత్త నిబంధనలను తెరమీదకు తెస్తుంది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎవరు అర్హులు, ఎవరు అనర్హులు అంటూ తేల్చేసింది. మెదక్ ఉమ్మడి జిల్లాలోని 1615 పంచాయతీ బరిలో దిగే వారు ఏం చేయాలి.

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు నామినేషన్ల పరిశీలన తేదీ వరకు 21సంవత్సరాలు వయసు కలిగి ఉండాలి. పోటీ చేయదలచుకున్న అభ్యర్థి ఎవరైతే ఉంటారో వారు గ్రామంలో ఓటర్గై ఉండాలి. అంతే కాకుండా ఏదైతే వార్డులో పోటీ చేయాలనుకుంటున్నారో ఆ వార్డులోని ఓటరే ప్రతిపాదకుడిగా ఉండాలని పోటీదారులతో పాటు ప్రతిపాదకుల ఓటరు క్రమసంఖ్యను నామపత్రంలో తప్పని సరిగా రాయాల్సి ఉంటుంది. పంచాయతీకి ఎలాంటి బకాయిలు కలిగి ఉండకూడదు. ఇంటి పన్ను చెల్లించాల్సి ఉంటే పంచాయతీ కార్యదర్శిని కలిసి చెల్లించాలి. చెల్లించిన అనంతరం రసీదు నమాపత్రంతో పాటు కలిపి రిటర్నింగ్ అధికారులకు ఇవ్వాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులయితే నామపత్రంతో పాటు కులధృవీకరణ పత్రాన్ని జతచేయాలి. నామినేషన్ పత్రంలో పేరును ఏవిధంగా రాస్తారో దానిని అనుసరించే గుర్తులను



కేటాయిస్తారు. తెలుగు వర్ణమాల ప్రకారం పోటీ చేసే వారిలో ఎవరి అక్షరం ముందుగా వస్తుందో పరిశీలించి ఆ మేరకు నిర్ణయం తీసుకుంటారు.

అర్హులు అనర్హులు: పంచాయతీ ఎన్నికల్లో పోటీకి అర్హులు, అనర్హులెవరో ఎన్నికల కమిషన్ సూచించింది. సింగరేణి, ఆర్టీసీ సంస్థల్లో మేనేజింగ్ ఏజెంట్, మేనేజర్, సెక్రటరీ స్థాయిలో ఉన్న వారు మినహా మిగతా వారు పోటీ చేయడానికి అర్హులే. ప్రభుత్వ పెట్టుబడులు 25శాతం కంటే తక్కువ ఉన్న సంస్థల్లో పనిచేసే మేనేజింగ్ ఏజంటు, మేనేజర్, సెక్రటరీ స్థాయివారు పోటీ చేయవచ్చు. అంతే కాకుండా రేషన్ డీలర్లు, సహకార సంఘాల సభ్యులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు రాజీనామా చేశాక అది నామినేషన్ల పరిశీలన రోజు వరకు ఆమోదం పొందిన వారు అర్హులే. క్రిమినల్ కేసుల్లో దోషిగా నిర్ధారిస్తే వారు పోటీకి అనర్హులు. ఆ తీర్పుపై స్టే వస్తే అర్హులు కాగా అదే గ్రామానికి చెందిన వారైన ఓటరు జాబితాలో పేరులేనివారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, అంగన్‌వాడి వర్కర్లు, నీటి వినియోగదారుల సంఘం సభ్యులు, హిందూ మత సంస్థల చట్టం, దేవాదాయశాఖ సెక్షను 15ప్రకారం ఏర్పాటైన సంస్థల సభ్యులు అనర్హుల జాబితాలో ఉన్నారు.

నామినేషన్లు.. ధరావతు: ఈ నెల 7న ఉదయం 10.30గంటల నుంచి నామపత్రాలు స్వీకరిస్తారు. సర్పంచ్‌గా బరిలో దిగే జనరల్ అభ్యర్థులకు రూ.20 వేలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుంది. అదే విధంగా వార్డు సభ్యునిగా తలపడే జనరల్ అభ్యర్థి రూ.ఐదు వందలు కాగా, బీసీ, ఎస్సీ, ఎస్టీ వారికి రూ.250గా కట్టాల్సి ఉంటుంది.

ఖర్చుపై నిఘా: పంచాయతీ ఎన్నికల్లో పోటీలో నిలబడే వారికి బ్యాంకు ఖాతా తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఐదు వేలు అంత కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో రూ.2.50లక్షలకు మించి ఖర్చు పెట్టకూడదని, ఐదు వేలకంటే తక్కువగా ఉన్నా ప్రాంతాల్లో రూ.1.50లక్షల వరకు మాత్రమే ఖర్చు పెట్టాలని ఎన్నికల కమిషనర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

ఉరుకులు.. పరుగులు: పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే బ్యాంకుఖాతా లేని అభ్యర్థులు కొంత టెన్షన్‌కు గురవుతున్నారు. నామినేషన్ గడువుకు మరో 48 గంటల గడువు ఉండడంతో శనివారం ఎలాగో గడిచిన 6న ఆదివారం బ్యాంకులకు సెలవుదినం కావడంతో కొందరు ఆందోళన చెందుతున్నారు. బ్యాంకుల దిశానిర్దేశాలను పాటిస్తూ కావలసిన పత్రాలు, ఫోటోలు ఖాతా ఉన్న వారి సంతకం కోసం ఉరుకులు పరుగులతో బ్యాంకుల వద్ద సందడి నెలకొంది.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

విజయక్రాంతి, ఆదిలాబాద్: రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ దివ్యదేవరాజన్ పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశమందిరంలో శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లతో ఖర్చులకు సంబంధించిన వివరాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన వారు తమపేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలన్నారు. దీనికోసం హౌస్‌హోల్డ్ రిజిస్టర్‌ను నిర్వహి స్తామన్నారు.

ప్రతి బీఎల్ఓ తన పరిధిలోని ఇంటింటికి వెళ్లీ ఒక్కో కుటుంబం వివరాలను సేకరిస్తున్నామ న్నారు. కుటుంబ సభ్యుల పేర్లు, వయస్సు, ఓటుహక్కు కలిగి ఉన్నవారి ఎపిక్‌నెంబర్, పార్ట్‌నెంబర్, సీరియల్ నెంబర్ వంటి వివరాలను సేకరించడంతో పాటు ఓటుహక్కులేని వారి వివరాలను ఫారం–6లో నమోదు చేస్తారన్నారు. ప్రజలు బీఎల్ఓలకు సహకరించాలని కోరారు. పోటీచేసిన అభ్యర్థులంతా నిర్ణీత గడవులోపే ఖర్చుల వివరాలు, స్టేట్‌మెంట్లను ఓచర్లను సమర్పించారన్నారు. ఎన్నికలను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన సలహాలు, సూచనలను అందజేయవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు గంగాధర్, ఎంసీ సీ నోడల్ అధికారి క్రిష్ణ, ఆర్డీఓ పాల్గొన్నారు.

నేటి ప్రజావాణీ రద్దు

ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించే ప్రజావాణీ అర్జీల స్వీకరణలో భాగంగా ఈ నెల 7వ తేదీన జరుగాల్సిన ప్రజావాణీని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ దివ్యదేవరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రజావాణీని రద్దుచేశామని జిల్లా ప్రజానీకం ఈ విషయాన్ని గమనించాలని ఆమె సూచించారు.

పంచాయతీ ఎన్నికలపై పార్టీల గురి

విజయక్రాంతి, ఆదిలాబాద్: గ్రామ పంచాయతీ తొలివిడత ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుండటంతో ప్రధాన రాజకీయపార్టీలు పంచాయతీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టిసారించాయి. జిల్లాలోని మెజార్టీ పంచాయతీ స్థానాలను కైవసం చేసుకునేదిశగా కసరత్తను షూరు చేసాయి. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన టీఆర్ఎస్ పంచాయతీ ఎన్నికల్లోనూ అదే ఊపును కొనసాగించి తన సత్తాచాటాలని భావిస్తోంది. గడిచిన ఎన్నికల్లో జరిగిన లోటుపాట్లను ఈ సారీ అధిగమించి ఎలాగైన పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ సీట్లను కైవసం చేసుకుని అధికార టీఆర్ఎస్‌కు తగిన సమాధానం చెప్పాలని కాంగ్రెస్, బీజేపీలు యోచిస్తున్నాయి. ఆదిశగా పార్టీశ్రేణులను సమయాత్తం చేస్తున్న నేతలు గెలుపే లక్ష్యంగా ప్రత్యేక వ్యూహాలకు పదును పెడుతున్నారు. గ్రామాల్లో పలుకబడి కలిగి ఉండి, ఆర్థికంగా బలమైన వారిని బరిలో నిలుపాలని భావిస్తున్న నేతలు ఆదిశగా కసరత్తు చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికలు పరోక్ష పద్దతిన జరుగుతున్నప్పటికి రాజకీయపార్టీలు సైతం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుండటంతో పల్లెల్లో సందడి వాతావరణం కన్పిస్తోంది.

ఇలా అన్ని పార్టీలు తమ తమ శ్రేణులను నూతనోత్సాహంలో ముంచెందుకు సిద్ధపడ్డాయి. ఆయానియోజ కవర్గ నేతలు, ఇన్‌చార్జీలతో ఇప్పటికే మమేకమై గెలుపోటములపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అన్ని పార్టీలు పంచాయతీ ఎన్నికలపై గురి పెట్టారు. కానీ ప్రజలు ఎవరికి పట్టం కడతారో వేచి చూడాల్సిందే?

ఆకుపచ్చ ఆరోగ్యలో భాగస్వాములు కండి

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు

విజయక్రాంతి, సిద్దిపేట: ఆకుపచ్చ ఆరోగ్య సిద్దిపేటలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు పిలుపునిచ్చారు. ఆదివారం పద్మశాలి జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీ, క్యాలెండర్ ఆవిష్కరణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేతలను ఆదుకోవడంలో తమ ప్రభుత్వం ఎప్పుడు ముందు ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా కోటి 38 లక్షల చేనేత రుణాలను 556 మంది తీసుకున్నారని వాటిని త్వరలోనే మాఫీ చేస్తామని ప్రకటించారు. చేనేతల అభివృద్ధి కోసం సిద్దిపేట, దుబ్బాకలలో హ్యాండ్ లూం క్లస్టర్‌లు ఏర్పాటు చేసామని ఆయన తెలిపారు. చేనేత లలోని ప్రతి ఒక్కరూ సమస్య పరిష్కరం దిశగా సమాజ ఐక్యతకు పాటుపడాలని పిలుపునిచ్చారు.



కాంట్రాక్ట్ లెక్చరర్‌ల సమస్యలు పరిష్కారం

కేసిఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావడం కాంట్రాక్ట్ లెక్చరర్‌ల పాలిట వరంగా మారిందని, టీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ లెక్చరర్‌లకు బాసటగా ఉంటుందని హరీష్ రావు అన్నారు. సిద్దిపేటలోని ప్రెస్ క్లబ్‌లో జరిగిన కాంట్రాక్ట్ లెక్చరర్‌ల క్యాలెండర్ ఆవిష్కరణకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ లెక్చరర్‌లకు బాసటగా ఉంటూ భద్రత కల్పిస్తుందని, నాటి ఉద్యమంలోను నేటి ప్రభుత్వంలోను తమది ఆత్మీయబంధం అని అన్నారు. సీఎం దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హమీనిచ్చారు.

సుదర్శన యాగంతో సుభిక్షం

సుదర్శన యాగంతో ప్రజలంతా సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని హరీష్ రావు కోరుకున్నారు. ఆదివారం సిద్దిపేటలోని దికొండ మైసమ్మ దేవాలయ ప్రాంగణంలో జరుగుతున్న శ్రీసుదర్శణ నారసింహ యాగం మహపూర్ణాహుతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో యగ్నయాగాలకు సిద్దిపేట కేంద్రంగా మారడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పొన్నాల ప్రాంతంలో వికాస తరంగిణి గోదా గోష్టి ఆధ్వర్యంలో జరిగిన గోదా పూజ, సుదర్శణ హవనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి పరామర్శ

హైదరాబాద్ నుంచి సిద్దిపేట వస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరోత్తం రెడ్డికి ప్రజ్ణాపూర్ వద్ద ప్రమాదం జరగడంతో విషయం తెలుసుకన్న హరీష్ రావు ఆయనను ఫోన్‌లో పరామర్శించారు. ప్రమాద సంఘటనకు సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం కాపాడుకోవాలని, వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అంతకుముందు ప్రముఖ వ్యాపారవేత్త, ముస్లిం మైనారిటి నాయకుడు అబ్దుల్ లతిఫ్ మృతి చెందిన విషయం తెలుసుకుని ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఇలా పలు కార్యక్రమాలతో ఆయన బిజీబిజీగా గడిపారు.

మంత్రి వర్గంలో 'సోలిపేట'కు చోటు?

విజయక్రాంతి. దుబ్బాక: దుబ్బాక నియోజకర్గ ఎమ్మెల్యే ఇటీవల గెలిచిన చిట్టాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి, మాజీ జర్నలిస్టు సోలిపేట రామలింగారెడ్డి అధిక మెజార్టీతో గెలిచిన విషయం అందరికి తెలిసిందే. గత 20సంవత్సారాలుగా ఎమ్మెల్యేగా చేస్తున్న విషయం విదితమే. దుబ్బాక నియోజకవర్గన్ని రంగాలో అభివృద్ధి చేసింది ఏకైక వ్యక్తి రామలింగారెడ్డే. రాష్ట్రప్రభుత్వం గుర్తించి దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డికి రాష్ట్ర అటవి శాఖ లేదా గృహ నిర్మాణ శాఖ మంత్రిగా కేటాయించే ఆవకాశాలు ఉన్నట్లు విశ్వనీయ వర్గాల సమాచారం. లేదా వ్యవసాయ శాఖ మంత్రిగా ఇచ్చిన ఆశ్చర్యపోవాల్సిన అవకాశం లేదు. నిత్యం పేద ప్రజలకోసం ఆలోచించేచ్చే వ్యక్తి రామలింగారెడ్డి. తాను రోజు 24 గంటల్లో 20 గంటలు ప్రజల మంచి కోరే వ్యక్తి దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డి అని అని అన్నారుజనవరి 18 తేదిన ప్రమాణ స్వీకారం చేసే మంత్రుల్లో మన దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి ఉంటారని దుబ్బాక నియోజకవర్గ ప్రజలు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు. మరి రామలింగారెడ్డికి మంత్రి వర్గంలోలో చోటు దక్కుతుందా అని పలువురు అనుకుంటున్నారు. మరి మంత్రిగా సోలిపేట అయితే దుబ్బాకను మరిపోయే అవకాశాలు ఎంతైన ఉన్నట్లు ప్రజలు అనుకుంటున్నారు. ఏదిఎమైన రామలింగారెడ్డి మంత్రి అయ్యాడంటే చోట, బాడ కాంట్రాక్టర్లు లాభపడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. లింగన్న మంత్రి అయ్యాడంటే దుబ్బాక నియోజకవర్గంలో కాంట్రాక్టర్లకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. ఇటీవల కాంగ్రేస్ పార్టీ నుండి మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి టీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ముత్యంరెడ్డికి కూడ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా నియమిండం జరుగుతున్నట్లు సమాచారం. ముత్యంరెడ్డి ఒక రైతు కాబడ్డి ఆయనకు రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా నియమించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. లేదా ఎమ్మెల్సీగా గవర్నర్ కోటలో నియమించి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి మంత్రిగా నియమించే ఆవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

విజయక్రాంతి, బోథ్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువజనోత్సవాల్లో భాగంగా ప్యూపిల్స్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రగతి పాఠశాలలో బోథ్‌లోని అన్ని పాఠశాలల, కళాశాలల విద్యార్థిని విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం, ఫోటో గుర్తింపు పోటీలను నిర్వహించడం జరిగిందని సొసైటి సభ్యులు తెలిపారు. ఈ పోటీల్లో 160 మంది విద్యార్థులు పాల్గొన డం జరిగిందని, ఈ పోటీలను మండల విద్యాధికారి గణపతి, పోటీ పరీక్షల అధ్యాపకుడు రమణాగౌడ్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు 12వ తేదిన బహుమతులను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటి సభ్యులు కార్తిక్, సుచరిత, హరీష్, సంతోష్, అనిల్, రోహిత్, శ్రీనివాస్, సాయికృష్ణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కళాశాల క్రికెట్ పోటీలు

విజయక్రాంతి, కాగజ్‌నగర్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవ క్రీడాపోటీల సందర్భంగా ఆదివారం క్రికెట్ పోటీలు హోరాహోరిగా నిర్వహించబడ్డాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ సుమన్ మొదట టాస్ వేసి క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులల్లో నూతనోత్తేజాన్ని ఉత్సాహన్ని పెంపొందించడానికి వార్షకోత్సవ క్రీడల్లో భాగంగా క్రికెట్ పోటీ ప్రారంభించారు. పోటీల్లో 8 టీంలు తరలపడగా, మొదటి స్థాయి ఆర్ట్స్ టీం, రెండ స్థానంలో వోకేషనల్ టీం నిలిచిందన్నారు. గెలుపొందిన టీంల విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ సుమన్ అభినందించారు.



అధ్యపాకులు రవి,రహీం, అశోక్ , బిక్షపతిలు ఎంపైర్లుగా పర్యవేక్షించారు.

ఏకగ్రీవంపై గురి

విజయక్రాంతి, దుబ్బాక: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవం చేసినట్లైతే గ్రామానికి ప్రత్యేకంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని, టీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో ఉన్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలవడం ఖాయమని దుబ్బాక నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇంఛార్జీ శేర్ల రమేష్ ముదిరాజ్ అన్నారు. టీఆర్ఎస్ పార్టీ నిధుల ప్రకటనపై కాంగ్రెస్, బీజేపీలు దృష్టి సారించి పంచాయతీలపై జెండా ఎలా ఎగరవేయాలన్న సమాలోచనల్లో మునిగిపోయారు. జిల్లాల వారీగా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, పంచాయతీలో పోటీపడే నేతలతో అంతర్గతంగా సమాచారాన్ని తెప్పించుకుంటున్నారు. ఏది ఏమైనా రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో పరాభవాన్ని మరిచిపోవాలంటే కనీసం పంచాయతీ ఎన్నికల్లోనైనా సత్తా చాటాలనే ఉత్సాహంలో పార్టీలు ఉన్నాయి.


జాబ్‌మేళాకు అనూహ్య స్పందన

విజయక్రాంతి, ఆదిలాబాద్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలనే ఉద్దేశ్యంతో సాయి వైకుంఠట్రస్ట్, స్వాస్ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభించింది. స్థానిక జిల్లా పరిషత్ సమావేశమందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి యువతీ, యువకులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యుడు జోగు రామన్న ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్‌మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. యువత ప్రభుత్వ కొలువుల పైనే ఆలోచించకుండా ప్రైవేట్‌రంగంలోనూ మంచి ఉద్యోగాలను పొందేందుకు ప్రయత్నించాలన్నారు. యువత తమ తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా సమాజంలో మంచి గౌరవాన్ని పొందాలని పిలుపునిచ్చారు. అనంతరం జాబ్‌మేళాకు హాజరైన 22 కంపెనీల ప్రతినిధులు నిరుద్యోగుల విద్యార్హత, ఇతరాత్ర శిక్షణలకు సంబంధించిన ధృవీకరణపత్రాలను పరిశీలించి ఉద్యోగాలకు ఎంపిక చేసారు. ఈ మేళాలో 2,200 దరఖాస్తులు రాగా విద్యార్హతలు, వారి నైపుణ్యాన్ని పరిగణలోకి తీసుకుని 450మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ చైర్‌పర్సన్ రంగినేని మనీషా, నిర్వాహకులు రఘువీర్‌యాదవ్, ప్రణయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం.. పది మంది భక్తుల దుర్మరణం

- మృతులంతా తెలంగాణలోని మెదక్ జిల్లా వాసులే
- భారీ కంటైనర్ ఢీ కొట్టడంతో ప్రమాదం
- కన్నీరు మున్నీరవుతున్న గ్రామస్తులు
- సీఎం కేసీఆర్ సంతాపం.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

విజయక్రాంతి, సంగారెడ్డి: కఠోర దీక్షతో సుమారు 45రోజులుగా అయ్యప్ప దీక్షలో ఉండి మొక్కులు తీర్చుకొని తిరుగు ప్రయాణంలో ఉన్న అయ్యప్ప భక్తులకు తెలియదు ఆ క్షణంలో మృత్యు ఒడికి చేరుతున్నామని.. ఎంతో ఆనందంగా ఉత్సాహంగా ప్రయాణిస్తూన్న తమను ఓ భారీ వాహనం రూపంలో మృత్యువు ఆవహించబోతుందని. ఊరు కాని ఊరు, రాష్ట్రం కాని రాష్ట్రంలో దైవదర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో వారి వాహనాన్ని భారీ కంటైనర్ లారీ ఢీ కొట్టడంతో వారి దేహాలు చెల్లాచేదురయ్యాయి. దేహాలన్ని చిధ్రమయిపోయాయి. అప్పటి వరకు అయ్యప్ప నామస్మరణతో మిన్నంటిన ఆ వాహనం రోదణలతో



మారుమోగింది. రక్తపు మరకలతో నిండిపోయి మృతదేహాలు చెల్లా చెదురుగా రోడ్డుపై పడిపోయి మారణహోమన్ని తలపించింది. జరిగిన ఘోర ఘటనతో వాహనంలోని పది మంది మృత్యువాత పడగా మిగతావారు తీవ్రగాయాల పాలు కాగా.. విషయం తెలిసిన మెదక్ జిల్లాలో విషాదం నెలకొంది.

తమిళనాడులో పుదుకొట్టై వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అయ్యప్ప భక్తులతో వెళ్తున్న మెదక్ జిల్లా నర్సాపూర్ నుంచి సుమారు 16మందితో వెలుతున్న వాహనాన్ని ఎదురుగా వస్తున్న ఓ భారీ కంటైనర్ లారీ ఢీ కొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న అయ్యప్ప భక్తులు ఏడుగురు అక్కడిక్కడే ప్రాణాలు కొల్పొగా రామేశ్వరం నుంచి శబరిమల వెలుతుండగా పుదికొట్టై సమీపంలోని జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులకు పుదికొట్టై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చికిత్స పొందుతూ ముగ్గురు ముగ్గురు ప్రాణాలు కొల్పోయారు. మిగత వారు క్షతగాత్రులుగా మిగిలారు. మృతుల్లో నాగరాజు(35), మహేష్ (28), కుమార్ (22), శ్యామ్, ప్రవీణ్, కృష్ణ, సాయి, అంజనేయులు, సురేష్ వ్యాన్ డ్రైవర్ ఉన్నారు. మృతులంతా మెదక్ జిల్లా నర్సాపూర్ మండల ఖాజీపేట, మంతూర్ గ్రామానికి చెందిన వారే కావటంతో ఘటన తెలిసిన అనంతరం ఆ ఇరు గ్రామాల్లో విషాదం చోటుచేసుకుంది. దైవదర్శనాకికని వెళ్లిన తమ వారు, మిత్రులు, బంధువులు, కుటుంబ సభ్యులు మృత్యువాత పడ్డారని తెలియడంతో గుండెలు బాదుకున్నారు. నలుదిక్కులు పిక్కటిల్లెలా రోదించారు. దీంతో ఆ ప్రాంతాల్లో విషాదం చోటుచేసుకుంది.

సీఎం కేసీఆర్ సంతాపం

తమిళనాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన అయ్యప్ప భక్తులు మృతి పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబ సభ్యులకు ఆయన తన సానుభూతిని తెలిపారు. గాయపడిన క్షతగాత్రులకు తొందరగా కోలుకోవాలని వారికి మెరుగైన వైద్య సదుపాయం అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే రాష్ట్ర నీటిపారుదల శాఖ మాజీ మంత్రి టి. హరీష్‌రావు ప్రమాదం జరిగిన తీరును అక్కడి జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి వాకబు చేశారు. మృతదేహాలను సాధ్యమైనంత త్వరగా పంపించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆయన కలెక్టర్‌ను కోరారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

పెద్దపులి చర్మం పట్టివేత.. ఐదుగురి అరెస్ట్

- పరారీలో ఇంకొందరు
- 2017లో కనిపించకుండా పోయిన పులిగా గుర్తింపు

విజయక్రాంతి, బోథ్: ఆదిలాబాద్ జిల్లా కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్ పులుల వేటగాళ్లకు కేంద్రంగా మారింది అడవుల్లో పెద్ద పులులను చంపి వాటి చర్మాన్ని అమ్ముకుంటున్నారు. కొంత మంది ముఠాగా ఏర్పడి ఈ ఘాతుకానికి పాల్పడుతున్నారు. తాజాగా ఇచ్చోడలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పెద్ద పులి చర్మాన్ని ఆటవీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పట్టుబడ్డ ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని జిల్లా కేంద్రంలోని ఆటవీశాఖ గెస్ట్ హౌస్‌కు తరలించి విచారణ జరుపుతున్నారు. ఆంతర్జాతీయ మార్కెట్‌లో పెద్ద పులి చర్మానికి మంచి డిమాండ్ ఉండటంతోనే ఇలా ముఠాగా ఏర్పడి దందా చేస్తున్నట్లు ఆటవీ శాఖ సీసీఎఫ్ శర్వానంద్ తెలిపారు.

ఇచ్చోడ మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో పులి చర్మాన్ని అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారనే పక్కా సమాచారంతో కేంద్ర వైల్డ్‌లైఫ్ క్రైం కంట్రోల్ బృందం, జిల్లా అటవీ శాఖ అధికారులతో కలిసి పక్కా ప్రణాళికతో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ ఐదుగురు నిందితులే కాక ఈ ముఠాలో





మరి కొంత మంది పరారీలో ఉన్నట్లుగా అధికారిక సమాచారం. ఇందుకు గాను పూర్తి సమాచారం రాబట్టేందుకు నిందితుల్లో నుంచి ఒకరిని సంఘటనా స్థలానికి తీసుకెళ్లి వివరాలు సేకరించారు. ఇంద్రవెల్లి మండలం గౌరారం, కరీంనగర్, వరంగల్ జిల్లాలకు చెందిన పలువురు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లుగా గుర్తించారు. పట్టుకున్న వారిలో వరంగల్ జిల్లాకు చెందిన సతీష్, నిర్మల్ జిల్లా పెంబికి చెందిన కిషన్, ప్రకాష్, సికింద్రాబాద్‌కు చెందిన రాజేందర్, హైదరాబాద్‌కు చెందిన నరేష్‌లు ఉన్నారు. పట్టుబడ్డ నిందితుల నుంచి పులి చర్మాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 2017 నవంబర్‌లో కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్ నుంచి కనిపించకుండా పోయిన మూడున్నరేళ్ల పెద్ద పులి చర్మంగా అధికారులు గుర్తించారు. ఏడాది క్రితమే పెద్ద పులిని చంపి చర్మాన్ని చేజిక్కించుకున్నారని తెలిపారు. ఐతే పులిని ఎవరు చంపారనే కోణంలో అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ముఠాలో ఇంకెవరెవరు ఉన్నారనేది తెలియాల్సి ఉంది.

పనస కాయతో.. ప్రయోజనాలెన్నో!



మధురమైన సువాసనలతో నోరూరించే పనసకాయను ఎవరు ఇష్టపడరు చెప్పండి. ఇది రుచిలోనే కాదు.. ఆరోగ్య ప్రయోజనాలు అందించడంలోనూ దిట్టే. బయటకు ఎంతో గాంభీర్యంగా కనిపించే పనసకాయలో ఉన్న రుచికరమైన తొనలు ఎన్నో పోషకాలు అందిస్తాయి. రోగనిరోధక శక్తితోపాటు.. వివిధ రోగాల చికిత్సకూ ఇది ఉపయోగపడుతుంది. ముఖ్యంగా రక్తపోటును, ఆస్తమాను, చర్మవ్యాధులను నివారిస్తుంది. మలబద్ధకాన్ని పోగొడుతుంది. పనస గింజల్లో విటమిన్ ఎ, విటమిన్ సి, థియోమిన్, రిబోఫ్లోవిన్, కాల్షియం, పొటాషియం, ఐరన్, సోడియం, జింక్, నియోపిన్ తదితర అనేక విటమిన్లు కలిగి ఆరోగ్యాన్ని కలిగిస్తాయి. ముఖ్యంగా పనసకాయలో కొవ్వుపదార్థాలు తక్కువగా ఉంటాయి. పనసపండులో 100 నుంచి 500 వరకు తొనలుంటాయి. వీటి గింజలను పొడిచేసుకుని వాడుకుంటారు.

నోరూరించే పచ్చళ్లు...



కీరదోసకాయ పచ్చడి

కీరదోసకాయల గురించి మీకు తెలిసే ఉంటుంది. దీన్ని వేసవి కాలంలో తింటూంటారు. వీటిని పచ్చడి కింద వినియోగించుకోవచ్చు. ఈ కాలంలో ఇవి విరివిగా వస్తుంటాయి. ఈ కీర దోసకాయలను తీసుకుని పీలర్‌తో పైనున్న తొక్కను తీసివేయాలి. తరువాత దాన్ని చిన్నచిన్న ముక్కలుగా కోసుకోవాలి. ఆ తర్వాత ఎండుమిర్చి నువ్వుపప్పు తగినంత ఉప్పును కలిపి మిక్సిలో వేసుకొని పొడికింద చేసుకోవాలి. తర్వాత వాటిలో కీరదోస కాయ ముక్కలను వేసుకొని మిక్సిలో ఒక తిప్పు తిప్పాలి. అంతే కీరదోసకాయ పచ్చడి రెడి. ఇది ఇడ్లిలోకి, ఉప్మా తదితర అల్పాహారాల్లో కూడా పచ్చడి కింద వాడుకోవచ్చు.

కావలసిన పదార్థాలు :

- కీర దోసకాయలు–2
- ఎండుమిర్చి – 5
- నువ్వుపప్పు – 5 చెంచాలు
- ఉప్పు తగినంత

బీరకాయ చెక్కు పచ్చడి



కావలసిన పదార్థాలు :

- బీరకాయలు–2
- టమాటాలు–3
- ఎండుమిర్చి– తగినన్ని
- నూనె– పావు కప్పు
- పోపుదినుసులు కొద్దిగా
- వెల్లుల్లి నాలుగు, ఐదు రెబ్బలు
- కరివేపాకు కొద్దిగా
- చింతపండు నిమ్మకాయంత

తయారుచేయు విధానం

ముందుగా బీరకాయలను శుభ్రంగా కడిగి, వాటి చెక్కుతీయాలి. కండతో కూర వండుకోవచ్చు. తీసిన చెక్కును చిన్న చిన్న ముక్కలుగా కట్ చెయ్యాలి. ఇప్పుడు స్టవ్ మీద పాన్ పెట్టుకొని కొద్దిగా నూనె వేడి చేసి ఎండుమిర్చి వేసి వేయించాలి. తరువాత కట్ చేసిన బీర చెక్కు వేసి రెండు నిముషాలు వేయించాలి. ఇప్పుడు వేగుతున్న బీర చెక్కులోనే కట్ చేసిన టమటా ముక్కలు వేసి ఐదు నుండి పది నిముషాలు వేయించుకోవాలి.

స్టవ్ ఆపి ఇవి చల్లారిన తరువాత మిక్సి జార్ తీసుకొని దీనిలో చింత పండు, ఉప్పు, వెల్లుల్లి, వేయించిన ఎండుమిర్చి వేసి మిక్సి వేసుకోవాలి. ఇప్పుడు మిగిలిన నూనె వేడి చేసి, దీనిలో పోపు దినుసులు, కరివేపాకు, రెండు ఎండుమిర్చి వేసి వేగాక ముందుగా చేసిన బీర చెక్కు పచ్చడి వేసి బాగా కలిపి స్టవ్ ఆపాలి.

అంతే ఎంతో రుచిగా ఉండే బీర చెక్కు టమాట పచ్చడి రెడి.

కంది పచ్చడి



తయారు చేయువిధానం

ముందుగా స్టవ్ పై పాన్ పెట్టుకోవాలి. దానిలో కొద్దిగా నూనె పోసి వేడైయ్యక ధనియాలు ఎండుమిర్చి వేసి వేయించాలి. వేగాక వాటిని ఒక గిన్నెలోకి తీసుకొని అదే నూనెలో కందిపప్పు వేసి దోరగా అయ్యే వరకు వేయించాలి. ఇప్పుడు మిక్సి జార్ తీసుకొని దానిలో ముందుగా వేయించిన దనియాలు ఎండుమిర్చి కందిపప్పు వేసి మిక్సి చెయ్యాలి.

తరువాత చింతపండు ఉప్పు కొద్దిగా నీళ్ళు పోసి మిక్సి చెయ్యాలి.

ఇప్పుడు స్టవ్ పై నూనె వేడి చేసి పోపుదినుసులు వేయించాలి.

అవి వేగాక ముందుగా చేసిన కంది పచ్చడి వేసి బాగా కలిపి సర్వ్ చెయ్యాలి.

అంతే ఎంతోరుచిగా ఉండే కంది పచ్చడి రెడి.

కావలసిన పదార్థాలు:

- కంది పప్పు– ఒక కప్పు
- ఎండుమిర్చి పది పన్నెండు
- ధనియాలు –
- రెండు టేబుల్ స్పూన్స్
- చింతపండు కొద్దిగా
- ఉప్పు తగినంత
- నూనె పావు కప్పు
- పోపు దినుసులు కొద్దిగా

అందం.. ఆరోగ్యం.. బాదంతో...



బాదం పోషకాహారం. ఇది తెలియని వారుండరు. అందరూ ఇష్టపడి తినే హెల్దీ ఫుడ్ ఐటమ్. బాదాన్ని నేరుగా పొట్టుతో, రాత్రి నానబెట్టి పొట్టు తీసేసి లేదా షేక్స్‌లలో, జ్యూస్‌గా, స్వీట్స్‌లో ఎలా తిన్నా ఉపయోగకరమే. బాదాన్ని ఆరోగ్యపరంగానే కాదు. అందానికి ఉపయోగపడుతుంది. ఇది చర్మసంరక్షణకు దోహదం చేస్తుంది. అందుకే ప్రతిరోజూ నాలుగు తీసుకున్నా ఎంతో మేలు జరుగుతుంది.

బాదంపప్పుతో శరీరం ధృడత్వాన్ని సంతరించుకుంటుంది. శరీరానికి కావాల్సిన శక్తి, బలము నేరుగా అందుతాయి. గుండె ఆరోగ్యం పదిలంగా ఉంటుంది. వీటిలో ఉండే ఫైటో కెమికల్స్ కాన్సర్‌ను నిరోధిస్తుంది. దీనిలోని పీచుపదార్థము మలబద్ధకాన్ని నివారిస్తుంది. పిండిపదార్థము తక్కువగా ఉండడం వల్ల మధుమేహులకు మంచిది.

పోషకాలు..

బాదంలో మాంసకృత్తులు, ఆరోగ్యానికి మేలు చేసే కొవ్వులు, విటమిన్లు, మినరల్స్ సమృద్ధిగా లభిస్తాయి. వీటిని మిల్క్‌షేక్, ఇతర రూపంలో తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. అంతేగాక శరీరంలోని వ్యర్థ పదార్థాలను బయటకు పంపే గుణం ఉంది.

కొలెస్ట్రాల్ నియంత్రణ

వీటిలో మోనోశాచ్యురేటెడ్, పాలీశాచ్యురేటెడ్ ఫ్యాట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరంలో చెడు కొవ్వు నిల్వలను నాశనం చేస్తాయి. అందుకే ప్రతిరోజూ రెండుమూడు బాదంపప్పులను ఉదయాన్నే తీసుకుంటే మంచిది.

రక్తప్రసరణ

బాదంలో పొటాషియం ఎక్కువ, సోడియం శాతం చాలా తక్కువ. కాబట్టి రక్తపోటు సమస్య ఉండదు. రక్త ప్రసరణ సక్రమంగా జరుగుతుంది. ఇందులో లభించే మెగ్నీషియం కండరాల నొప్పులను దూరం చేసి దృఢంగా ఉండటానికి తోడ్పడుతుంది.

ఎముకలు దృఢంగా



ఇందులో లభించే క్యాల్షియం ఆస్టియోపోరోసిస్‌ను దూరంగా ఉంచుతుంది. ఎముకలను దృఢంగా ఉంచడానికి తోడ్పడుతుంది. ఇనుము శరీరావయవాలకు, కణాలకు ఆక్సిజన్‌ను చేరవేస్తుంది.

బరువుతగ్గడానికి

బాదంలో ఉండే పీచు పదార్థం, మాంసకృత్తులు, కొవ్వులు బరువు తగ్గేవారికి మేలు చేస్తాయి. అంతే కాదు కాలరీల శాతం తక్కువ కాబట్టి ప్రతిరోజు తీసుకున్నా సమస్య ఉండదు.

తక్షణశక్తికి

అలసటగా అనిపించినప్పుడు నాలుగు బాదాంలు తీసుకొంటే తక్షణ శక్తి సొంతమవుతుంది. అందులో రైబోఫ్లెవిన్, రాగి, మెగ్నీషియం వంటి పోషకాలు శరీరానికి శక్తిని అందిస్తాయి. అందుకని దూర ప్రయాణాలు చేసేటప్పుడు, ఆఫీసుకు వెళ్లేటప్పుడు వెంట తీసుకెళితే ఆకలనిపించినప్పుడు తినొచ్చు.

మధుమేహానికి

మధుమేహంతో బాధపడేవారు భోజనం తరవాత బాదం పప్పు తీసుకుంటే ఫలితం ఉంటుంది. ఇది రక్తంలో ఇన్సులిన్ శాతాన్ని పెంచుతుంది.

జ్ఞాపక శక్తికి

నీళ్లలో రెండు మూడు బాదం పప్పులు నానబెట్టి మర్నాడు చిన్నారులకు తినిపిస్తే జ్ఞాపకశక్తి వృద్ధవుతుంది.

మల బద్ధకం దూరం

వీటిలో పీచు పదార్థం సమృద్ధిగా లభిస్తుంది. మలబద్ధకం, ఇతర సమస్యలున్నవారు రోజుకు నాలుగైదు బాదం పప్పులు తీసుకొని.. బాగా నీళ్లు తాగితే చక్కటి పరిష్కారం దొరుకుతుంది.

గుండెకు బాదం అండ

పది బాదం పప్పుల చొప్పున వారంలో ఐదుసార్లు తీసుకొంటే హృద్రోగ సమస్యలు నియంత్రణలో



ఉంటాయి. ఇందులోని ఇ–విటమిన్ యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది.

ఇతర నట్స్ మాదిరిగానే బాదంపప్పులోనూ కొవ్వు అధికంగా ఉంటుంది. కాకపోతే ఇందులో గుండెకు మేలు చేసే కొవ్వులు మోనో అన్సాచ్యురేటెడ్ ఫ్యాట్స్ ఎక్కువగా ఉంటాయి. అందువల్ల క్రమం తప్పకుండా బాదంపప్పు తినటం గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. సెరటోనిన్ హార్మోన్ స్థాయులు పెరగటానికి బాదం దోహదం చేస్తుంది. అందువల్ల నిద్ర బాగా పట్టటానికి తోడ్పడుతుంది. బాదంపప్పులో ఇన్ఫెక్షన్లను నివారించి, రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేసే విటమిన్ మోతాదులూ ఎక్కువే. బాదంలోని పీచు కడుపు నిండిన భావన కలిగించి, చాలాసేపు ఆకలి వేయకుండా చూస్తుంది. ఇలా బరువు పెరగకుండానూ కాపాడుతుందన్నమాట. మధుమేహులకు రక్తంలో గ్లూకోజు మోతాదులు స్థిరంగా ఉండేందుకు తోడ్పడుతుంది. రక్తప్రసరణను సైతం మెరుగుపరుస్తుంది.

బాదంపప్పు చూడటానికి చిన్నదే... కానీ చేసే మేలు మాత్రము ఒక విశాలమయిన జీవితమంత... గుండెపోటు రాకుండా చేసే చక్కటి గుణాలు ఈ బాదంపప్పులో ఉన్నాయట.

బాదంపప్పులో మనలో ఆయుష్యాను పెంచే ఎన్నో గుణాలున్నాయని వైద్య పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. గుండెకు సంబంధించిన వ్యాధుల్ని నివారించే శక్తి గుండెలో మంటను, కడుపులో కలవరాన్ని ఈ బాదంపప్పులు తగ్గిస్తాయి. మన కడుపులో కారం తినడం వల్ల వచ్చే మంటను బాగా తగ్గించే విశిష్టగుణం ఈ బాదంపప్పులో ఉంది. ఈ విషయాన్ని టొరొంటో విశ్వవిద్యాలయం ఇటీవల సాగించిన నూతన అధ్యయనం తేల్చిచెప్పింది. కడుపులో మంటను తగ్గించేందుకు మనం మందులు వాడతాం. కానీ ఆ మందులకు సమానంగా ఈ బాదం పప్పులు ఉపయోగపడతాయట. యూరోపియన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషియన్ ఈ అధ్యయన విశ్లేషణల్ని ప్రచురించింది. శరీరంలో కొలెస్ట్రాల్‌ని సమస్థాయిలో ఉంచుతుంది. ప్రొటీన్లు అందిస్తుంది. న్యూట్రిషన్ గుణాలు అధికంగా ఉన్నాయి. బాదంపప్పులు తింటే వేరే పోషక పదార్థాలున్న మెడిసిన్ వాడనవసరం ఉండదు.

ఇతర ఉపయోగాలు..

గుండె, కడుపులోని మంటని తగ్గించి చల్లదానాన్ని చేకూరుస్తుంది. అలాగే కొలెస్ట్రాల్ శాతాన్ని తగ్గిస్తుంది. అలాగే వీటితో శరీరానికి కావాల్సిన మెగ్నీషియమ్, పొటాషియమ్, కాల్షియం, పాస్ఫరస్, ఐరన్ లభిస్తాయి.

హెల్త్

ఫేస్‌కి యోగా మంచిదేగా!

- ఇప్పుడు అంతటా ఫేస్ యోగా హాట్ టాపిక్‌గా మారింది. ఫేస్ యోగా కల్చర్‌ను సిటీలో ప్రవేశపెట్టడానికి ఎక్స్‌పర్ట్స్ ప్లాన్ చేస్తున్నారు. కొద్దిరోజుల్లోనే ఇది పాపులర్ కావడం ఖాయమంటున్నారు నేర్చుకుంటున్నవారు.
- ఇంతకీ ఫేస్ యోగా అంటే ఎలా ఉంటుంది అనే కదా మీ డౌటు. ఏం లేదండి కొన్ని ట్రిక్స్ ఉంటాయి. దాని ప్రకారం ముఖాన్ని పలు రకాలుగా భంగిమల్లో వంకర, టింకరగా తిప్పుతుండాలి. అది కూడా కొంచెం సమయం పాటే, గంటల తరబడి చేయాల్సిన అవసరం లేదు. నవ్వొచ్చినా ఇదే నిజం.
- బాడీ స్ట్రక్చర్‌ను కంట్రోల్‌లో పెట్టుకోవడానికైతే జిమ్‌లు ఉన్నాయి. లేకపోతే సర్జరీలు ఉండనే ఉన్నాయి.
- అదే ముఖంలో కొత్త కళ తెచ్చుకోవాలంటే ఏం చేయాలి. దానికి పరిష్కారమే ఈ ఫేస్ యోగా.
- ఆ ఏముంది అని ఈజీగా తీసుకోవద్దు. ఎందుకంటే ఫేస్ యోగాతో చాలా లాభాలున్నాయి. ముఖంపై ముడతలు ఈజీగా పోతాయట.
- ఫేస్ యోగాను ఫాలో అయితే నవయవ్వనంతో కనిపించడం ఖాయంటున్నారు ఎక్స్‌పర్ట్స్. ముఖంపై ముడతలు పోవడానికి సర్జరీలు చేసుకోవాల్సిన అవసరం లేదంటున్నారు.
- కళ్ల కింద నల్లనిచారల్లాంటివి కూడా పోతాయట.
- ప్రస్తుతానికైతే ఫేస్ యోగా గురించి ఆరా తీస్తున్నవాళ్ల సంఖ్యే ఎక్కువ.
- ఇది విదేశాల్లో ఇప్పటికే బాగా పాపులర్ అయ్యింది. త్వరలో మన దగ్గర కూడా దీనికి మంచి పాపులారిటీ వచ్చే ఛాన్స్ అయితే కనిపిస్తోంది.
- ఇంకేముంది వంటికి యోగా మంచిదే కదా అంటూ ఫేస్ యోగాను ఫాలో అయిపోదామా మరి.



ఆ ఇద్దరి మధ్యా ఆయనెవరు?



అసలు క్రిష్ కంగన మధ్య గొడవేంటి? 'మణికర్ణిక' చిత్రం నుంచి చివరి నిమిషంలో వదిలిపెట్టి క్రిష్ బయటకు రావడానికి కారణాలేంటి? ఈ సందేహానికి సమాధానం ఇప్పటికీ ఓ సస్పెన్స్. అయితే ఈ గొడవలో అతడు ఆమె .. మధ్యలో ఆయన! చందంగా ఓ కొత్త కహానీ వినిపిస్తోంది. ఆ ఇద్దరి మధ్యా గొడవకు సీనియర్ రచయిత విజయేంద్ర ప్రసాద్ కారణం అన్న మాటా ప్రముఖంగా ఫిలింనగర్ గుసగుసల్లో వినిపిస్తోంది. క్రిష్ తాను ఒప్పుకున్న ప్రకారం తొలి కాపీని రెడీ చేసి ఇచ్చేశాడు. ఇన్ టైమ్ లో పని పూర్తి చేశాడు. కానీ, రచయిత విజయేంద్రప్రసాద్ 'మణికర్ణిక – ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ' తొలి కాపీ చూశాక అసలు కథ మొదలైంది. ఆ సినిమా తొలి కాపీతో విజయేంద్ర ప్రసాద్ విభేధించారు. దానికి మరికొన్ని సన్నివేశాల్ని కలపాల్సి ఉందని సూచించారు. దాంతో కంగన ఆ షూట్‌కి ఉపక్రమించిందిట. అదనపు సన్నివేశాలు జోడించాల్సిన అవసరం లేదని క్రిష్ అనడంతో ఇద్దరి మధ్యా విభేధాలు తప్పలేదు. ఆ క్రమంలోనే క్రిష్ 'ఎన్టీఆర్ బయోపిక్' కోసం వచ్చేశారు. దీంతో హర్టయిన కంగన తానే స్వయంగా బరిలో దిగి అదనపు సీన్స్ కి దర్శకత్వం వహించింది. ఇప్పుడు సామరస్య పూర్వకంగానే టైటిల్ క్రెడిట్స్ లో రాధాకృష్ణ జాగర్ల మూడి (క్రిష్) పేరుతో పాటు కంగన పేరును దర్శకత్వం కార్డ్ లో వేశారు. మొన్న హైదరాబాద్ ప్రమోషన్స్ లో కంగనతో పాటుగా దర్శకుడు క్రిష్ కనిపించలేదు. దాంతో మణికర్ణిక కోసం కంగన విజయేంద్ర ప్రసాద్ ఒకే వేదికపైకి వచ్చి ప్రచారం చేశారు. క్రిష్ ఈ బాధ్యతలు తీసుకోకపోయినా ఫర్వా లేదు. మేమే ప్రచారం చేసుకుంటాం అంటూ కంగన అనడం చర్చకు తావిచ్చింది.





జీవితానుభవాల ఓ నావ

గిల్లినట్టు.. గిచ్చినట్టు.. ఛమక్కు విసిరినట్టు.. సరసమాడిట్టు... సెటైర్ వేసినట్టు లేదా ఇంకేదైనా ఫీల్ ని కలిగించేలా కార్టూన్ గీయాలంటే అందుకు ఎంతో భావుకత, అనుభవం ముఖ్యం. అలాంటి భావుకత, సాహితీ అభిరుచి ఉన్న వాళ్లు అరుదుగానే ఉంటారు. చిట్టి కథలు రాయడం, కార్టూన్లు గీయడం అనే అలవాటు చిన్నప్పటి నుంచి ఉంటే ఆ వ్యక్తిలోని విలక్షణతకు కొలమానం ఉండదు. ఎంతో ఘాడమైన విజ్ఞానం పల్లవిస్తుంది. ఈ లక్షణాలన్నీ కలబోసిన జర్నలిస్టు నుంచి ఒక పుస్తకం వచ్చిందంటే అందులో అంతే విషయం ఉంటుందనడంలో సందేహం లేదు. సీనియర్ జర్నలిస్ట్, రచయిత ఓం ప్రకాశ్ నారాయణ వడ్డి రచయితగా, కార్టూనిస్టుగా 1984లోనే కెరీర్ ప్రారంభించారు. ఆయన నుంచి తొలి కథా సంపుటి మనసు తడి ఆరనీకు 2013లో ప్రచురితమైంది. తొలి కథ సేల్స్ మేన్ స్వాతి వీక్లీలో ప్రచురితమైంది. ఆ తర్వాత ఎన్నో కథలు రాశారు. ఇంటర్ చదివేప్పుడే ఓ నావ పేరుతో కార్టూన్లు గీయడం అలవాటైంది. జాగృతి వారపత్రికలో సబ్ ఎడిటర్‌గా మొదలైన పయనం ఆ తర్వాత ఎన్నో పత్రికల్లో పని చేసే అవకాశం కల్పించింది. అనుభవంతో విజ్ఞానం, దాంతో పాటే వచ్చే సెటైరికల్ యాటిట్యూడ్‌ని కార్టూన్లలోకి జొప్పించారు. హాస్యాన్ని చక్కని ఓ ఛమక్కులా కార్టూన్ రూపంలో అందించిన అనుభవం సొంతమైంది.

ఉస్మానియా నుంచి ఎంఏ పొలిటికల్ సైన్స్ పట్టభద్రుడై, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఎంసీజే పట్టా పొందారు. జాగృతి, సూపర్‌హిట్, ఆంధ్రజ్యోతి, సాక్షి వంటి సంస్థల్లో పని చేశారు. ప్రస్తుతం ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో జర్నలిస్టుగా పని చేస్తున్నారు. తాజాగా ఓ నావ కార్టూన్లు పేరుతో వ్యంగ్య చిత్ర సంకలనం వెలువరించారు. ఓనావ కార్టూన్ల పుస్తకం విజయవాడ పుస్తక ప్రదర్శనలోని సాహిత్యనికేతన్, హాస్యనందనాలులో అందుబాటులో ఉన్నాయని రచయిత తెలిపారు.




అందం, అభినయం కలబోత రాశీఖన్నా. నవతరం కథానాయికల్లో జోరుమీదున్న కథానాయిక. కొత్త సంవత్సరంలో విశాల్ సరసన అయోగ్య (టెంపర్ రీమేక్) చిత్రంలో నటిస్తోంది. అలాగే ఇమైక్క నోడిగల్, సైతాన్ కా బచ్చా చిత్రాల్లో రాశీ నాయిక. సైతాన్ కా బచ్చా జి.కార్తీక్ దర్శకత్వ ంలో తెరకెక్కుతున్న యాక్షన్ కామెడీ. ఈ రెండు సినిమాలు తనకు పెద్ద బ్రేక్ నిస్తాయనే రాశీ అశిస్తోంది. తాజాగా రివీలైన రాశీ ఫోటోషూట్ ఆకట్టుకుంటోంది.

దీపికపదుకొనే డాట్‌కాం



అందాల కథానాయికలు సామాజిక మాధ్యమాల ద్వారా అందాల జాతరకు తెర తీస్తున్న సంగతి తెలిసిందే. నెటిజనుల్లో వేగంగా వైరల్ అయ్యేందుకు ఇక్కడ నిరంతరం ఫోటోలు, వీడియోలతో హోరెత్తిస్తున్నారు. ఇక కొందరు భమలైతే సొంతంగా వెబ్ సైట్లు రన్ చేస్తూ పాపులరవుతున్నారు. తమకంటూ ఒక వెబ్ మెయింటెయిన్ చేస్తూ, అక్కడ తమ వ్యక్తిగత సమాచారాన్ని, గొప్పల్ని, తిప్పల్ని చెప్పుకునే ప్రయత్న ం చేస్తున్నారు. తమ అవార్డులు, రివార్డులు, సినిమా ప్రమోషన్లు ఇక్కడ లైవ్ అవుతుంటాయి. ఇకపోతే ఈ కోవలోనే పద్మావత్ దీపిక పదుకొనే సొంతంగా ఓ వెబ్ సైట్ ని ప్రారంభించింది. దీపికపదుకొనే డాట్కాం అనేది టైటిల్. టైటిల్ తన పేరే కాబట్టి అభిమానుల్లోకి సూటిగా దూసుకుపోవడం ఖాయం. ఇక దీపిక కవర్ లుక్ తాజాగా రివీలైంది. దీపిక పుట్టిన రోజు సందర్భ ంగా అభిమానులు శుభాకంక్షలు తెలిపారు.

2019లో టాప్ 20 బయోపిక్స్







2018 ఆద్యంతం బయోపిక్ వార్తలతో కొత్త ట్రెండ్ కనిపించింది. గతేడాది ఎన్నో బయోపిక్‌లు ప్రారంభమయ్యాయి. వీటిలో కొన్ని రిలీజై హిట్లు సాధిస్తే, మరికొన్ని ఆన్ సెట్స్ ఉన్నాయి. మరికొన్ని ప్రీప్రొడక్షన్ దశలోనే ఉన్నాయి. కొన్ని ఈనెలలో రిలీజవుతున్నాయి. వీటన్నిటి ప్రచారం ఓ రేంజులో హోరెత్తుతోంది. ఇక 2019లో ఏకంగా 25 బయోపిక్ లు క్యూలైన్ లో ఉన్నాయి. జాతీయ స్థాయిలో ఇవన్నీ ఈ ఏడాది ఆద్యంతం వేడెక్కించబోతున్నాయి. వీటిలో క్రీడలు, రాజకీయాలు, సైన్స్, రియల్ ఇన్సిడెంట్ బేస్ ప్రముఖులపై బయోపిక్‌లు ప్రముఖంగా ఉన్నాయి.

ఎన్టీఆర్ జీవితకథ ఆధారంగా తెరకెక్కిన కథానాయకుడు జనవరి 9న, మహానాయకుడు ఫిబ్రవరి 7న రిలీజవుతున్నాయి. వైయస్సార్ జీవితకథ ఆధారంగా మహి.వి.రాఘవ్ తెరకెక్కిస్తున్న 'యాత్ర' చిత్రం ఫిబ్రవరి 8న రిలీజవుతోంది. ఇవేగాక సౌత్‌లో మరో అరడజను బయోపిక్ ల గురించి ప్రముఖంగా వినిపిస్తోంది. తెలుగులో కత్తి వీరుడు కాంతారావు జీవితంపై 'రాకుమారుడు' అనే సినిమా తెరకెక్కుతోంది. పీసీ ఆదిత్య ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అలాగే దాసరి బయోపిక్ ఈ ఏడాది సెట్స్ పైకి వెళుతుందని తెలుస్తోంది. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, అమ్మ జయలలిత జీవితంపై నిత్యామీనన్ టైటిల్ పాత్రలో 'ది ఐరన్ లేడి' ఫిబ్రవరిలో ప్రారంభం కానుంది. ప్రియదర్శిని ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. కోలీవుడ్‌లో ప్రముఖ కథానాయకుడు, రాజకీయ నాయకుడు 'ఎంజీఆర్' పై బయోపిక్ సెట్స్ పై ఉంది. సౌత్ క్రీడాకారులకు చెందిన మరో మూడు బయోపిక్‌లు సెట్స్ కెళ్లాయి.

ఈనెల 25న రెండు బయోపిక్ లు రిలీజవుతున్నాయి. కంగన ప్రధాన పాత్రలో 'మణికర్ణిక – ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ', నవాజుద్దీన్ సిద్ధిఖీ టైటిల్ పాత్రలో 'థాక్రే' ఇప్పటికే చిత్రీకరణలు పూర్తి చేసుకుని రిలీజ్ బరిలో ఉన్నాయి. ఇవి రెండూ ఒకేరోజు రిలీజవుతున్నాయి. వీరనారి ఝాన్సీ లక్ష్మీభాయ్ జీవితకథ ఆధారంగా రూపొందిన మణికర్ణిక పై భారీ అంచనాలేర్పడ్డాయి. అలానే మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధినాయకుడు బాల్ థాక్రే జీవితకథ ఆధారంగా రూపొందిన థాక్రే వివాదాల గురించి చర్చ సాగుతోంది. అలాగే గణితశాస్త్రజ్ఞుడు ఆనంద్ కుమార్ జీవితం ఆధారంగా.. హృతిక్ రోషన్ హీరోగా తెరకెక్కిన 'సూపర్ 30' ఈ ఏడాది రిలీజ్ కానుంది. అక్షయ్ కుమార్ టైటిల్ పాత్రలో హవీల్దార్ ఇషార్ సింగ్ బయోపిక్ 'కేసరి' సెట్స్ పై ఉంది. బ్యాటిల్ ఆఫ్ సరాగరిపై చిత్రమిది. అజయ్ దేవగన్ ప్రధానపాత్రలో ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆస్థానంలో మరాఠా కమాండర్ తానాజీ జీవితకథను 'తానాజీ' పేరుతోనే రూపొందిస్తున్నారు. మల్లూవుడ్ శృంగార తార షకీలా జీవితకథ ఆధారంగా రిచా చద్దా టైటిల్ పాత్రలో ఇంద్రజిత్ లంకేష్ తెరకెక్కిస్తున్న బయోపిక్ ఇప్పటికే హాట్ టాపిక్ అయ్యింది. అలాగే పానిపట్ యుద్ధం బ్యాక్ డ్రాప్ లో పానిపట్ తెరకెక్కుతోంది. అర్జున్ కపూర్, సంజయ్ దత్ ప్రధానపాత్రల్లో అశుతోష్ గోవారికర్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. టీ సిరీస్ గుల్షన్ కుమార్ లైఫ్ పై 'మొఘల్' సెట్స్ పైకి వెళ్లనుంది. అమీర్, సల్మాన్ ఎవరు నటిస్తారు అన్నదానిపై కన్ఫమేషన్ రావాల్సి ఉంది.

సైన్స్, సాహసం


ఐఏఎఫ్ పైలెట్ గుంజన్ సక్సేనా జీవితకథ ఆధారంగా జాన్వీ కపూర్ ప్రధాన పాత్రలో ధర్మ ప్రొడక్షన్స్ ఓ భారీ చిత్రం తెరకెక్కించనుంది. స్పేస్‌లో ప్రయాణించిన తొలి సైంటిస్ట్ రాకేశ్ శర్మ జీవితకథ ఆధారంగా తెరకెక్కనున్న 'సారే జహాసె అచ్చా' చిత్రం గురించి వాడి వేడిగా చర్చ సాగుతోంది. రాకేష్ శర్మ పాత్రలో కింగ్ ఖాన్ షారూక్ నటించనున్నారు.

నాయకుల బయోపిక్‌లు


కథానాయకుడిగా ఎన్టీఆర్ జీవితంపై ఒక కథానాయకుడు, రాజకీయ జీవితంపై మహానాయకుడు తెరకెక్కి రిలీజవుతున్నాయి. అలాగే మహారాష్ట్రలో శివసేన అధినేత బాల్ థాక్రే జీవితకథతో నవాజుద్దీన్ సిద్ధిఖి బయోపిక్ ఈనెల 25న అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రిలీజవుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ బయోపిక్‌లో వివేక్ ఒబేరాయ్ నటించనున్నారని ఇటీవలే మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే.















క్రీడా బయోపిక్‌లు





బ్యాడ్మింటన్ లో పాపులరైన ముగ్గురు క్రీడాకారులపై మూడు బయోపిక్‌లపై ఆసక్తికర చర్చ సాగుతోంది. బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్ జీవితకథతో సుధీర్ బాబు టైటిల్ పాత్రలో ప్రవీణ్ సత్తారు ఓ బయోపిక్ ని రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. బ్యాడ్మింటన్ క్వీన్, తెలుగమ్మాయి సైనా నెహ్వాల్ జీవితకథ ఆధారంగా శ్రద్ధా కపూర్ టైటిల్ పాత్రలో ఓ బయోపిక్ తెరకెక్కుతోంది. బ్యాడ్మింటన్ క్రీడాకారిణి , ఒలింపిక్ క్వీన్ పివి సింధు జీవితకథలో దీపిక పదుకొనే నటించే అవకాశం ఉంది. సోనూ సూద్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. రణవీర్ సింగ్ టైటిల్ పాత్రలో కపిల్ దేవ్ జీవితకథతో తెరకెక్కుతున్న 83 సెట్స్ పై ఉంది. ఒలింపిక్ గోల్ మెడలిస్ట్ షూటర్ అభినవ్ బింద్రా జీవితకథతో తెరకెక్కే బయోపిక్ కి కన్నన్ అయ్యర్ దర్శకుడు. తండ్రి కొడుకులు అనీల్ కపూర్ హర్షవర్ధన్ కపూర్ (టైటల్ పాత్ర) నటించనున్నారు. క్రీడాకారుడు రుద్రాక్ష జేన జీవితం ఆధారంగా అభయ్ డియోల్ టైటిల్ పాత్రలో జంగిల్ క్రై అనే చిత్రం తెరకెక్కనుంది. హాకీ ఆటగాడు ధ్యాన్ చంద్ జీవితం ఆధారంగా 'ధ్యాన్ చంద్' చిత్రాన్ని పూజా శెట్టి ప్రకటించారు. వరుణ్ ధావన్ టైటిల్ పాత్రలో నటించే ఈ సినిమాకి కరణ్ జోహార్ సహనిర్మాత. మహిళల టీమిండియా కెప్టెన్ మిథాలీ రాజ్ పాత్రలో తాప్సీ లేదా పీసీ నటిస్తారని తెలుస్తోంది.









ఆరోగ్యం.. ఇలా పదిలం



- భోజనం చేసిన తర్వాత బొప్పాయి పంచు తింటే ఆహారం సులభంగా జీర్ణమవుతుంది.
- బొప్పాయి తినడం వల్ల మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడడాన్ని అరికట్టవచ్చు.
- ఉడికించిన కోడిగుడ్డు, బొప్పాయి పండు ముక్కలతో కలిపి తింటే కాలేయ వ్యాధులు దరిచేరవు.
- బాగా మరిగించిన కొత్తిమీర కషాయాన్ని చల్లారాక పుక్కిట ఉంచితే పంటి నొప్పులు, చిగుళ్ల బాధ, గొంతు నొప్పి తగ్గుతాయి.
- విటమిన్ ఏ పుష్కలంగా ఉండే క్యారెట్ ముక్కలను రోజూ తింటే అజీర్తి తగ్గుతుంది. క్యాన్సర్ రోగులకు ఇది మేలు చేస్తుంది.
- పసుపు నీరు, సున్నం, కోడిగుడ్డులోని తెల్లసొన, వాము పొడి సమపాళ్లలో కలిపి ఆ మిశ్రమాన్ని కండరాల నొప్పులకుచ బెణికిన చోట పైపూతగా రాస్తే ఉపశమనం కలుగుతుంది.

ముఖచ్ఛాయకు

పుదీనా... తులసీ!

పెరట్లో దొరికే అనేక మొక్కల ద్వారా మన అందాన్ని రెట్టింపు చేసుకోవడం ఎలాగో చూద్దాం!

- పుదీనా ఆకులను అలాగే తులసి ఆకులను నీటిలో మరిగించి ఆ నీటిలో కొద్దిగా తేనె మిక్స్ చేసి ముఖానికి అప్లై చేయాలి. 20 నిముషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇది చర్మ రంధ్రాలను మరియు ముఖాన్ని శుభ్రం చేస్తుంది. దీనిని క్రమంతప్పకుండా అనుసరించడం వలన ముఖం కాంతివంతంగా మారుతుంది.
- మనకు ప్రకృతిలో సహజంగా లభించే వేపలో చాలా రకాల ఔషధ గుణాలు ఉన్నాయి. ఇది ముఖ ఛాయను మెరుగుపరచడంలో ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఇది యాంటీ బ్యాక్టీరియా గుణాలను కలిగి ఉండటం వలన మొటిమలు, తామర, సోరియాసిస్, చుండ్రు వంటి వాటికి మందులా పనిచేస్తుంది. వీటితో నివారించడం తోపాటు ముఖ వర్ఛస్సును రెండింతలు చేస్తుంది. వేప ఆకులు నీటిలో వేసి మరిగించి ఆ నీటితో వారానికొకసారి స్నానం చేయడం వల్ల ఒంట్లో వేడి తగ్గి చర్మం తేమను గ్రహిస్తుంది.



- కరివేపాకు ఆహారానికి రుచిని మాత్రమే కాకుండా సౌందర్యపరంగా కూడా ఎంతో ఉపయోగపడుతుంది. కరివేపాకును నీటిలో వేసి బాగా మరిగించి చిటికెడు పసుపును కలిపి తర్వాత ఆ నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకుంటే ముఖంపై ఉన్న డార్క్ స్పాట్స్‌ను నివారించుకోవచ్చు.
- కొత్తిమీర డ్రై స్కిన్‌ను నివారించండంలో బాగా సహాయపడుతుంది. గుప్పెడు కొత్తిమీరను మెత్తగా నూరి పేస్ట్ చేసి అందులో కొద్దిగా తేనె, మిక్స్ చేసి డ్రై స్కిన్‌కు అప్లై చేయాలి. ఇలా వారంలో రెండుమూడు సార్లు చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- కలబంద చర్మ ఛాయను మెరుగుపరచడంలో ప్రధాన పాత్ర వహిస్తుంది. తేనె కలిపిన కలబందతో తయారుచేసిన ఫేస్ మాస్క్‌ను వేసుకొని పది నిమిషాల తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వలన మీ చర్మానికి కావలసిన తేమ అంది ముఖం మంచి నిగారింపును సంతరించుకుంటుంది.





'చిటికె'లో సాధ్యం..!



- రాగి వస్తువులను చింతపండుతో తోమితే బాగా మెరుస్తాయి.
- వెండి వస్తువులను పచ్చటి ఆకులతో ఉప్ప జతచేసి తోమితే కొత్తగా కనిపిస్తాయి.
- ఇత్తడి వస్తువులను ఉప్ప నీటితో తోమి తర్వాత మామూలుగా తోమితే తళతళలాడుతాయి.
- పాత బడిన సాక్స్‌లను సర్ఫ్ నీటిలో ముంచి గ్యాస్ స్టౌవ్‌ను తుడిస్తే స్టవ్ కొత్తగా మెరుస్తుంది.

ముంగిట్లో ముగ్గు







పిల్లలకు తొలి శిక్షణ

ఇంట్లోనే ఆరంభం

తొలి గురువు తల్లి. అలాగే మొదటి శిక్షణాకేంద్రం ఇల్లు. పిల్లలకు బడిలో కన్నా, ఒడిలో నేర్చుకునే పాఠాలే ఎక్కువ. పిల్లలు పుట్టగానే వాళ్లను గొప్పవాళ్లను చేయడానికి చాలా కళలు కంటారు తల్లిదండ్రులు అది సహజమే. పిల్లలు పెరిగి యుక్త వయసుకు వచ్చే దాకా వారికి శిక్షణనిస్తూ, సక్రమ పద్ధతిలో ఉంచే పేరెంట్స్‌దే. అందుకు వారు పిల్లల పట్ల ప్రేమ చూపిస్తూ, నైతిక విలువలను ఇంట్లోనే నేర్పించేసేయాలి.

శిశువు పుట్టడంతోనే క్రమక్రమంగా పెరుగుతూ, మాట్లాడడం, నడవడం నేర్చుకోవడానికి ప్రారంభిస్తారు. సాంఘీక, సమాజం పట్ల ఉత్తమ పౌరుడిగా బతకడానికి ప్రయత్నిస్తాడు. ఇలా పెరగాలనే మనస్తత్వం ఇంటి నుంచే అలవాటు కావాలి. శారీరకంగా, మానసికంగా, సాంస్కృతికంగా ప్రవృద్ధి పొందడానికి అవకాశం చిన్నారులకి ఇంట్లోనే లభిస్తాయి.

ఇంటి నుంచే బాధ్యతలు మొదలవ్వాలి..


ఇక్కడే పెద్దవారు చెప్పిన మాట విని నడుచుకోవడానికి, వారికంటే చిన్నవాళ్లకు సహాయం చేయడానికి పిల్లలకు శిక్షణనివ్వాలి. ఇంట్లోనే పిల్లలు ఇతర కుటుంబ వ్యక్తులతో అన్ని బాధ్యతలను విభజించుకుంటూ పెరిగి పెద్దవారవుతారు. కుటుంబంలో ఇతర వ్యక్తుల లానే, పిల్లలు కుటుంబ సంబంధమైన సాంఘీక, ధార్మిక కార్యకలాపాల్లో పాల్గొనాలి. సహకారం సద్భావం, సుహృద్భావం వంటి సద్గుణాలు వారిలో సహజంపరంగా వృద్ధి చెందుతాయి. సాంఘీక, నైతిక శీలం ఏర్పడుతుంది. ఇంట్లో నేర్చుకున్న నడవడి వారితో పాటు జీవితాంతం ఉంటుంది.

శిశు కేంద్రాలు

పిల్లలు పుట్టాక కొన్నాళ్లపాటు పెంచి, ఉద్యోగాలకు బయలుదేరుతున్నారు ఇప్పుడన్న అమ్మలు. దాంతో పిల్లల్లో బంధాల విలువలు తెలియక, ఒంటరిగా పెరుగుతున్న భావన ఏర్పడుతుంది. చిన్నప్పటి నుంచి ఎలా పెంచితే, అలానే పెరుగుతారు. శిశుకేంద్రాలలో వదిలిపెట్టి వెళ్లడానికి మొగ్గు చూపే వారి సంఖ్య పెరగడం, పిల్లలపై శ్రద్ధ తగ్గిపోతుంది నేటి యువత.

అలవాట్లన్నీ సహజంగానే..

బాల్యదశపు ప్రథమావస్తలో పిల్లల కార్యకలాపాలు కుటుంబానికి పరిమితమై ఉండాలి. కాబట్టి పిల్లల నిర్మలమైన లేత మనస్సులలో గృహ వాతావరణం హత్తుకుపోయి ఉంటుంది. ఇంటిపట్టునే పిల్లలకు సహజంగా స్వేచ్ఛా, ప్రేమ, స్వాతంత్ర్యం, అనురాగం, సంరక్షణ అనేవి ఏర్పడాలి. ఇంట్లో చిన్నతనంలో అభ్యసించిన మంచి అలవాట్లే ప్రేమ, సత్యం, న్యాయం అనేవి సద్గుణాలుగా మారుతాయి.



ఉపాధ్యాయుల బాధ్యత..

పిల్లలల్లో సక్రమ పద్ధతిలో ప్రణాళికాబద్ధమైన ప్రభావాన్ని నేర్పించే బాధ్యత గురువులదే. ఈ నడవడిక విద్యాసంస్థలలో ఉపాధ్యాయుల ద్వారానే నేర్చుకునే అవకావం ఉంటుంది. స్కూలులో చేరడానికి ముందే పిల్లల మీద ఇంటి ప్రభావం కొంత వరకు ఉన్నా... పాఠశాలలో టీచర్లు దీనిని మరింత పఠిష్టవంతం చేయాలి.

విద్యార్థుల బాధ్యత పాఠశాలలకు పంపినా, వారి సామాజిక వాతావరణానికి ఇల్లే ప్రధానపాత్ర వహిస్తుంది. ప్రత్యేక ఆదర్శ సాధనకు వాళ్లపై ఇంటి ప్రభావమే ఎక్కువగా ఉంటుంది.

పరిశుభ్రత ముఖ్యం..

ధర్మం, న్యాయం, బాధ్యతగా వ్యవహరించడం ఇంట్లోనే నేర్పించాలి. పిల్లల శారీరకాభివృద్ధికి కూడా పెద్దలు బాధ్యతను తీసుకోవాలి. పౌష్ఠికాహారాన్ని టైమ్‌కి ఇస్తుండాలి. బట్టలు, ఇతర సౌకర్యాలు, ఆటలు వగైరాల గురించి జాగ్రత్త వహిస్తుండాలి. పరిశుభ్రత అలవాటు చేయాలి. సక్రమ వ్యాయామం చేయడానికి సలహాలు ఇవ్వాలి.

పనులను అప్పగించాలి..

కొత్త విషయాలను వాటి గురించి తెలుసుకోవడానికి పిల్లలలో ఉత్సాహం ఎక్కువగా ఉంటుంది. అందుచేత వాటి గురించి ప్లిలలు రకరకాల ప్రశ్నలు అడుగుతుంటారు. తల్లిదండ్రులు వాటికి తగిన సమాధానాలు ఇవ్వాలి. తెలుసుకోవాలనే పిల్లల ఉత్సుకతను పెద్దలుగా తీర్చాలి. దీనివల్ల పిల్లల గ్రహణశక్తి, సంభాషణా నైపుణ్యం, అభివృద్ధి పెంపొందుతాయి.ట్లో వయస్సును బట్టి అందుకు తగినట్టుగా ఇంటి పనులను అప్పజెప్పాలి. వారిలో బాధ్యతయుతమైన పని చేసే అలవాటు పెరుగుతుంది. నిరంతర సాధన, మంచి అలవాట్లు ఫలితంగా వారిలో శీలాభివృద్ధికి దారితీస్తాయి.

శక్తి, సామర్థ్యాలను గ్రహించాలి..

చిన్నతనంలో ఆటలు ఎక్కువగా ఆడుతుంటారు. అదే వయసులో చిలిపిచేష్టలు కూడా ఎక్కువగానే ఉంటాయి. తల్లిదండ్రులు పిల్లలలో ఇటువంటి వాటిని జాగ్రత్తగా పరిశీస్తూ వారికి తగినంత అవకాశాన్ని కల్పిస్తుండాలి. ఇంట్లో పిల్లల సహజ శక్తులను, సామర్థ్యాలను గ్రహిస్తూ వారు మెచ్చే మార్గంలో ప్రోత్సాహాన్నివ్వాలి.

అభిరుచులకు అనుగుణంగా..

పిల్లలు ఇంట్లో ఉన్నా.. పరిసర వాతావరణంలో ఉన్నా, బయట ప్రపంచాన్ని తెలుసుకోవాలనే ఉత్సాహం ఎక్కువగా ఉంటుంది. తల్లిదండ్రులు దీనిని గ్రహించి వారి మానసికాభివృద్ధికి తగిన అవకాశాలను, అనుకూలాలను కల్పిస్తుండాలి. పిల్లల అభిరుచికి తగినట్లుగా పుస్తకాలు, వార్తాపత్రికలు, మాగజైనులను ఏర్పాటు చేయాలి. నిజానికి ఇక్కడే పిల్లల అభిరుచులు, ఇష్టాలు, స్వభావాలు తెలుస్తాయి. కానీ కుటుంబంలో కొన్ని ప్రతికూల పరిస్థితుల వల్ల లేదా తల్లిదండ్రుల ఇతర ఇబ్బందుల వల్ల ప్రతిబంధకాల వల్ల ఇంట్లో పిల్లలకు తగిన వాతావరణం లోపిస్తుంది. అటువంటి సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఇన్‌ఫెంట్ స్కూళ్లకు, కిండర్ గార్డెన్ స్కూళ్లకు, లేకపోతే వ్యక్తిగతాభివృద్ధికి అనుకూలాలు ఉన్న బోర్డింగ్ వసతి గృహాలకు పంపాలి.

ఇల్లు, స్కూలు సహకారం..

పిల్లల విద్యాసమయంలో ఇల్లు, పాఠశాల సమాన పాత్ర వహిస్తాయి. ఒకదానికి ఒకటి పరస్పర పరిపూరకంగా ఉంటాయి. ఇంట్లో ప్రాతిపదిక నిర్మాణం సరిగ్గా లేకపోతే, పాఠశాలలో భవిష్యత్తు పునాదులను వేసే అవకాశం కలుగుతుంది. ఇంట్లో తల్లిదండ్రుల బాధ్యత పిల్లల పరిపూర్ణాభివృద్ధికి ఇల్లు, పాఠశాలల మధ్య పరస్పర సహకారాన్ని పిల్లలకు అందివ్వాలి.





కోడిగుడ్లు రిటైల్ ధర (100కు)



హైదరాబాద్	447	విజయవాడ	453
ముంబయి	497	ఢిల్లీ	485
చెన్నై	445	బెంగళూరు	445

బ్రాయిలర్ చికెన్ ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.



హైదరాబాద్	175	ఢిల్లీ	165
కరీంనగర్	170	ముంబయి	160
వరంగల్	175	చెన్నై	155

సెన్సెక్స్ +181.39
35,695



నిఫ్టీ +55.10
10,727



రూపాయి
₹69.72
(ఒక అమెరికా డాలర్‌కు)



పసిడి
32,630.00
(హైదరాబాద్‌లో) 24 క్యా..10 గ్రాములకు/(రూ.)లలో

ప్రత్యక్ష పన్ను వసూళ్లు పెంచండి



- పన్ను ఎగవేతదారులపై కోర్టులో కేసులు వేయండి
- రికవరీ చేసేందుకు అధికారులు నడుం బిగించాలి
- ఐటీ శాఖకు సీబీడీటీ ఛైర్మన్ సుశీల్ చంద్ర లేఖ

ఢిల్లీ: ప్రత్యక్ష పన్ను వసూళ్లు పెంచేందుకు అధికారులు గట్టిగా కృషి చేయాలని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) సూచించింది. వసూళ్ల వృద్ధి రేటు మందగించిందని లక్షిత సర్వేలు, ఉద్దేశ పూర్వకంగా పన్ను ఎగవేతకు పాల్పడుతున్న వారిపై కోర్టు కేసులు వేయాలని ఆదేశించింది. ఐటీ శాఖలోని ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్లకు సీబీడీటీ ఛైర్మన్ సుశీల్ చంద్ర ఈ మేరకు లేఖ రాశారు. ఆర్థిక ఏడాది ముగిసేందుకు మరో మూడు నెలల సమయమే ఉందని అధికారులు వసూళ్లపై దృష్టి సారించాలని ఆదేశించారు.

'ప్రాంతీయ శాఖల వసూళ్ల సరళిని గమనిస్తే గతేడాది సాధించిన 15.6 శాతం వృద్ధికి 1.1 శాతం లోటుతో ఉన్నాం. చాలా ప్రాంతాల్లో ప్రతికూల వృద్ధి కనిపిస్తోంది. ఇది చాలా తీవ్రమైన అంశం. రికవరీ చేసేందుకు అధికారులు నడుం బిగించాలి. 2018, డిసెంబర్‌కు లక్షిత పన్ను వసూళ్ల శాతం 14.6 కాగా ప్రస్తుతం వృద్ధి 13.6 శాతంగా ఉంది. స్థూల వసూళ్లలో వృద్ధి 14.1 శాతంతో మెరుగ్గానే ఉన్నా బడ్జెట్‌లో అంచనా వేసిన రూ.11,50,000 కోట్లకు తక్కువే. పన్ను వసూళ్లు ఊపందుకొనేందుకు స్వాధీనం చేసుకున్న ఆస్తులు వేలం వేయడం, ఉద్దేశ పూర్వక ఎగవేతదారులపై కోర్టు కేసులు పెట్టడంపై అధికారులు దృష్టి సారించాలి. ఇతర వ్యూహాలు అమలు చేయాలి' అని సుశీల్ చంద్ర లేఖలో ప్రస్తావించారు.

దేశంలో ఆధార్ గేమ్ ఛేంజర్

- ఆధార్‌తో రూ.90 వేల కోట్లు ఆదా: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

ఢిల్లీ: దేశంలో ఆధార్ ఒక గేమ్ ఛేంజర్ అని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ అన్నారు. ఆధార్ వల్ల ఎంతో లాభం జరుగుతోందని, ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందుతున్నాయన్నారు. అనవసర వ్యయం తగ్గి తద్వారా మిగిలిన సొమ్ముతో 'ఆయుష్మాన్ భారత్'లాంటి మూడు భారీ సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు వీలవుతోందని అన్నారు. లక్షలమంది పేదలకు ఉచిత వైద్య సేవలందించే 'ఆయుష్మాన్ భారత్'ను అలాగే ప్రారంభించామని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు ఆధార్‌ను విజయవంతంగా అమలు చేస్తే, గతంలో కాంగ్రెస్ నాయకత్వంలో యూపీఏ ప్రభుత్వం తన సొంత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయరాహిత్యంగా, ఇష్టంలేకుండా



అమలు చేసిందని ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఫేస్‌బుక్‌లో 'ఆధార్ ప్రయోజనాలు నేడెక్కడ ఉన్నాయి' అనే టైటిల్‌తో ఓ పోస్ట్ చేశారు. సబ్సిడీలు నిజమైన అర్హులకు మాత్రమే ఇవ్వడం ద్వారా గత మార్చి వరకూ ప్రభుత్వం రూ.90 వేల కోట్లు ఆదా చేయగలిగిందన్నారు. వివిధ పేర్లతో పలు చోట్ల లబ్ధి పొందుతున్నవారు, అనర్హులను తేలిగ్గా గుర్తించగలిగామన్నారు. ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం ఆధార్ అమలు కారణంగా ఏటా రూ.77 వేల కోట్లు ఆదా అవుతున్నాయని చెప్పారు. అలా ఆదా అయిన సొమ్ముతోనే 'ఆయుష్మాన్ భారత్' వంటి పథకాన్ని తీసుకొచ్చామన్నారు. ఈ పథకం ద్వారా పేదల ప్రజలకు రూ.5 లక్షల ఆరోగ్యబీమా అందిస్తున్నామని, అలా 10.74 కోట్ల మంది పేదలు లబ్ధి పొందే అవకాశముందన్నారు. ఆధార్ వల్ల మధ్యవర్తుల జోక్యం తగ్గిందని, దీంతో ప్రయోజనాలన్నీ నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే చేరుతున్నాయన్నారు. ఇలాంటి సాంకేతికతను కేవలం భారత్‌లో మాత్రమే అమలు చేస్తున్నామన్నారు. దాదాపు 22.80 కోట్లమందికి పీఏహెచ్ఏఎల్, ఉజ్వల పథకం కింద వంట గ్యాస్ సబ్సిడీ అందుతోందన్నారు. అలాగే 58.24 కోట్ల మంది రేషన్‌కార్డుదారులు ఆధార్ అనుసంధానమై ఉన్నారని, 10.33 కోట్ల ఎంజీఎన్ఆర్ఈజీఏ లబ్ధిదారులకు వేతనాలు వారి ఖాతాలోనే జమ అవుతాయన్నారు.

ఏటీఎంల సమస్యలను పరిష్కరించాలి

- నగదు కొరతను తీర్చండి
- ఆర్‌బీఐని కోరిన పార్లమెంటరీ ప్యానెల్

ఢిల్లీ: పనిచేయని ఏటీఎంల సమస్యలను పరిష్కరించి నగదు కొరత తీర్చాలని రిజర్వ్ బ్యాంక్‌ను పార్లమెంటరీ ప్యానెల్ కోరింది. అలాగే అవసరమైన సంఖ్యలో ఏటీఎంలను ఏర్పాటు చేయాలని కూడా తన నివేదికలో పేర్కొంది. స్టాండింగ్ కమిటీ ఆన్ ఫైనాన్స్ నివేదికను గతవారం పార్లమెంట్ ముందు ఉంచారు. ఆర్బీఐ సమాచారం ప్రకారం.. 2018 సెప్టెంబర్ నాటికి దేశవ్యాప్తంగా 2,21,492 ఏటీఎంలు ఉన్నాయి. ఇందులో 1,43,844 ప్రభుత్వ రంగ బ్యాంకులవి కాగా.. 59,645 ప్రైవేట్ బ్యాంకులవి. ఇక 18,003 ఏటీఎంలు విదేశీ, చిన్న తరహా, పేమెంట్స్ బ్యాంకులవి ఉన్నాయి. "డిజిటల్ లావాదేవీలు ఇంకా ఎక్కడా విస్తృతం కానందున.. పనిచేయని ఏటీఎంల సమస్యను ఆర్‌బీఐ వెంటనే పరిష్కరించాలి. కొరత ఉన్న ప్రాంతాల్లో వాటిని నెలకొల్పాలి. నగదు కొరత సమస్య రాకుండా చేయాలి" అని ఆ నివేదికలో స్టాండింగ్ కమిటీ పేర్కొంది. ఆర్‌బీఐ చేపట్టిన రీమానిటైజేషన్ డ్రైవ్.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నగదు సమస్యను పరిష్కరించలేక పోయిందని, అనేక ఏటీఎంలు మూసివేతకు దారితీసిందని ఈ కమిటీకి నేతృత్వం వహించిన కాంగ్రెస్ సీనియర్ నేత వీరప్ప మొయిలీ పేర్కొన్నారు. తగిన సంఖ్యలో ఏటీఎంలు లేక పోవడంపై ఈ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. పెద్ద సంఖ్యలో జన్‌ధన్ ఖాతాలు తెరవడం, భారీ సంఖ్యలో డెబిట్ కార్డులు జారీ చేయడంతో.. నగదు డిమాండ్ పెరిగిందని కమిటీ తెలిపింది.



జియో దెబ్బకు

వోడాఫోన్ విలవిల

- కోటి 40 లక్షల మంది వినియోగదారులను కోల్పోయిన వోడాఫోన్
- భారీగా పెరిగిన జియో కస్టమర్లు

ముంబయి: టెలికాం రంగంలో రిలయన్స్ జియో దూసుకుపోతోంది. ఇప్పటికే జియో దెబ్బకు ఎక్కువగా నష్టపోయింది మాత్రం ఎయిర్‌టెల్ యే.. అనే చెప్పవచ్చు ఎందుకంటే జియో వల్ల ఎయిర్‌టెల్ కొన్ని లక్షల మంది కస్టమర్లను కోల్పోయింది. ఇప్పుడు ఎయిర్‌టెల్ తర్వాత జియో సెగ వోడాఫోన్, ఐడియాలపై పడింది. ఎందుకంటే ట్రాయ్ వెలువరించిన గణాంకాలు ప్రకారం చూస్తే వోడాఫోన్, ఐడియా మెగా మెర్జర్‌తో దేశంలోనే అతిపెద్ద సంస్థగా ఏర్పడిన వోడాఫోన్ ఐడియాకు పెద్ద షాకే తగిలింది. సుమారు10.5 మిలియన్ కస్టమర్లలో దాదాపు 50శాతానికి పైగా జియోకు మళ్లిపోయారు. ఇదే మార్కెట్లో ఇతర టెల్కోల గుండెల్లో గుబులు రేపుతోంది.

ట్రాయ్ అందించిన లెక్కల ప్రకారం జియో, బీఎస్ఎన్ఎల్ కలిపి అక్టోబర్ మాసంలో కోటికిపైగా కొత్త కస్టమర్లను తమ నెట్‌వర్క్‌లో జోడించుకున్నాయి. ముఖ్యంగా జియో ఒక్కటే ఏకంగా కోటి మందిని కొత్తగా తన ఖాతాలో వేసుకుంది. జియో మొత్తం కనెక్షన్ల సంఖ్య 26.28కోట్లకు చేరిందని తెలిపింది. ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ కొత్తగా 3,63,991మంది వినియోగదారులను చేర్చుకోవడంతో మొత్తం చందాదారుల సంఖ్య 11.34 కోట్లకు చేరింది. అయితే వోడాఫోన్ ఐడియా సహా మిగిలిన టెల్కోలు ఎయిర్‌టెల్, టాటా టెలీ సర్వీసెస్, ఎంటీఎన్ఎల్, రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్కాం) చతికిల పడ్డాయి. కోటికిగా పైగా వినియోగదారులను కోల్పోయాయి. వోడాఫోన్ ఐడియా 2018లో సెప్టెంబరు నుంచి నవంబరు మధ్య కాలంలో 14 మిలియన్ల మంది చందాదారులను కోల్పోగా, ఇదే సమయంలో రిలయన్స్ జియో 23.5(23 కోట్ల 50 వేలమంది) మిలియన్ల కస్టమర్లను కొత్తగా చేర్చుకుంది. సెప్టెంబర్ నాటికి వోడాఫోన్ ఐడియా యావరేజ్ రెవెన్యూ పర్ మంత్ (ARPU) నెలకు రూ. 88 గా ఉంటే, రిలయన్స్ జియో ARPU నెలకు రూ. 99 గా ఉంది. అలాగే జియోకు 7.3 మిలియన్లు వోడా ఫోన్ ఐడియా కస్టమర్లు 2018 అక్టోబర్‌లో తమ సబ్‌స్క్రిప్షన్‌లను వదులుకోవడం గమనార్హం .మరోవైపు ఇటీవల ఎయిర్‌టెల్ లైఫ్ కస్టమర్లపై కొత్తగా విధించిన నిబంధన కీలక పరిణామం. తమ యావరేజ్ రెవెన్యూ పర్ మంత్‌ను పెంచుకోడానికి నెలకు కనీస రీఛార్జ్ రూ. 35 మెయింటైన్ చేయకపోతే జీవిత కాల ఫ్రీ ఇన్ కమింగ్ ప్లాన్ రద్దు చేస్తామని ప్రకటించింది. ఇదే బాటలో వోడాఫోన్ ఐడియా నడవడంతో దాదాపు ఒక కోటి 40 లక్షల మంది వినియోగదారులను కోల్పోవాల్సి వచ్చింది. 2018లో వోడాఫోన్ ఐడియా తన కస్టమర్లను క్రమక్రమంగా కోల్పోతూ వచ్చింది. జూలైలో 0.6 మిలియన్ల కస్టమర్లను పెరగ్గా, ఆగస్ట్ నాటికి 2.3 మిలియన్ల కస్టమర్లను కోల్పోయింది. ఇలా సంస్థకు గుడ్ బై చెప్పిన వారి సంఖ్య అక్టోబర్ నాటికి 7.4 మిలియన్లకు చేరింది. జనవరి–జూన్‌లో 910 మిలియన్లుగా ఉన్న జియో నెట్‌వర్క్ రన్ రేటు, జూలై– సెప్టెంబరులో 12–13 మిలియన్లుకు పెరిగింది. అయితే అక్టోబరులో కొంచెం తక్కువగా ఉందని మోర్గాన్ స్టాన్లీ వ్యాఖ్యానించింది. మరోవైపు ఎయిర్‌టెల్ వొడాఫోన్ ఐడియా, వైర్లెస్ బ్రాడ్‌బ్యాండ్ చందాదారులలో మంచి పెరుగుదల నమోదు చేసిందని పేర్కొంది. ఈ పరిణామాలపై వోడాఫోన్ ఐడియా సమీక్షించుకోవాలని, నాణ్యమైన సేవలతో, సరసమైన టారిఫ్ ప్లాన్లతో వినియోగదారులను ఆకట్టుకోవడంతోపాటు సరికొత్త వ్యూహాలతో 2019 చివరినాటికి తమ పనితీరును మెరుగు పరుచుకోవాలని మార్కెట్ విశ్లేషకులు సూచిస్తున్నారు.

స్పోర్ట్స్

బాక్సర్ నిఖత్ జరీన్ ఓటమి



బళ్లారి: తెలంగాణ స్టార్ మహిళా బాక్సర్ నిఖత్ జరీన్ నేషనల్ సీనియర్ మహిళా బాక్సింగ్ ఛాంపియన్ షిప్ ఫైనల్‌లో ఓటమి చవిచూసింది. కర్ణాటకలోని బళ్లారి జేఎస్‌డబ్ల్యూ అకాడమీలో జరిగిన ఈ మెగా ఛాంపియన్ షిప్ ఫైనల్‌లో నిఖత్ జరీన్ హర్యానాకు చెందిన పింకీ రాణి చేతిలో పోరాడి ఓడింది.

తొలి రౌండ్ నుంచి అద్భుత ప్రదర్శన కొనసాగించినప్పటికీ చివరిలో పింకీ రాణి వరుస పంచ్‌లు ఝులిపించడంతో 3–2 తేడాతో నిఖత్‌కు పరాజయం తప్పలేదు. దీంతో ఈ ఛాంపియన్‌షిప్‌ను తెలంగాణ బాక్సర్ నిఖత్ 51 కేజీల విభాగంలో క్యాంస పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్

విజేతలకు సత్కారం



విజయక్రాంతి, హైదరాబాద్: 31వ సౌత్‌జోన్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని పతకాల పంట పండించిన తెలంగాణ ఆక్వాటిక్ అథ్లెటిక్స్‌ను తెలంగాణ స్విమ్మింగ్ అసోషియేషన్ ఘనంగా సత్కరించింది. పురుషుల విభాగంలో యష్ వర్మ 1 గోల్డ్, 1 సిల్వర్, 1 బ్రాంజ్ మెడల్ గెలవగా, వై. హేమంత్‌రెడ్డి 1 గోల్డ్, 1 సిల్వర్ మెడల్ సాధించారు. మహిళల విభాగంలో ముప్పనేని శ్రీజ 2 గోల్డ్, 1 సిల్వర్ మెడల్ సాధించగా, సీ. కృష్ణ 2 గోల్డ్ మెడల్స్‌తో సరిపెట్టుకుంది. పతకాలు సాధించిన స్విమ్మర్లను తెలంగాణ స్విమ్మింగ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్విమ్మింగ్ అసోషియేషన్ కార్యనిర్వాహక సభ్యులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

గెలుపు వాకిట్లో... భారత జట్టు

- ఆసీస్ 300 ఆలౌట్
- విజృంభించిన టీం ఇండియా బౌలర్లు
- 5వికెట్లతో చెలరేగిన కుల్‌దీప్ యాదవ్
- ఫాలో ఆన్‌లో ఆస్ట్రేలియా
- చివరిరోజు వాతావరణం అనుకూలించడంపైనే మ్యాచ్ ఫలితం



సిడ్నీ: ఆసీస్‌తో జరుగుతున్న చివరి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా బౌలర్లు విజృంభించారు. దీంతో 300 పరుగులకే ఆసీస్ ఆలౌట్ అయింది. 236/6 ఓవర్ నైట్ స్కోరుతో ఆసీస్ నాలుగో రోజు బ్యాటింగ్ ప్రారంభించింది. అయితే, వర్షం కారణంగా మ్యాచ్ మూడు గంటల ఆలస్యంగా మొదలైంది. నాలుగో రోజు 20 ఓవర్లు ఆడి 64 పరుగులు మాత్రమే జోడించి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌ను ముగించింది. కుల్దీప్ యాదవ్ ఐదు వికెట్లు తీయగా, షమీ, జడేజా చెరో రెండు వికెట్లు తీశారు. బుమ్రా ఖాతాలో ఒక వికెట్ పడింది. భారత్ 322 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆసీస్ ఫాలోఆన్ ఆడుతోంది.



ఆరు ఓవర్లలో మూడు వికెట్లు..

నాలుగో రోజు ఆసీస్ ఇన్నింగ్స్ త్వరగా ముగించాలన్న టీమిండియా కోరికకు వరుణుడు అడ్డుతగిలాడు. వర్షం కారణంగా మ్యాచ్ మూడు గంటల ఆలస్యంగా ప్రారంభమైన్పటికీ టీమిండియా బౌలర్లు మాత్రం పట్టుదల వదల్లేదు. మ్యాచ్ ప్రారంభమైన ఆరు ఓవర్లలో మూడు వికెట్లు పడగొట్టి టెయిలెండర్లపై ఒత్తిడి పెంచారు. 85వ ఓవర్‌లో షమీ వేసిన బంతికి పాట్ కమిన్స్(25) బౌల్డ్ అయ్యాడు. తర్వాత హ్యాండ్ స్కోంబ్ (37)ను బుమ్రా బౌల్డ్ చేసి పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాతి ఓవర్‌లోనే ఆసీస్ తొమ్మిదో వికెట్ కోల్పోయింది. 91వ ఓవర్‌లో కుల్దీప్ వేసిన బంతికి లైయన్ డకౌట్‌గా వెనుదిరిగాడు. అప్పటికి ఫైన్ సేన 258 పరుగులు చేసింది.

టెయిలెండర్ల పోరాటం

తొమ్మిది వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన ఆసీస్‌కు టెయిలెండర్లు ఊతమిచ్చారు. వికెట్ కోల్పోకుండా నిలకడగా ఆడారు. 10 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 42 పరుగులు జోడించారు. క్రీజులోకి వచ్చిన తర్వాత రెండు సార్లు టీమిండియా బౌలర్ల చేతిలో తప్పించుకున్న హేజిల్‌వుడ్ ఈసారి కుల్‌దీప్ బుట్టలో పడ్డాడు. 105వ ఓవర్‌లో చైనామన్ వేసిన బంతిని అంచనా వేయలేకపోయిన హేజిల్‌వుడ్ (21).. ఎల్బీగా వెనుదిరిగాడు. ఫలితంగా ఆసీస్ 300 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 322 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.

ఫాలోఆన్‌లో ఆసీస్

వెలుతురు లేమి, వర్షం కారణంగా తొలుత తాత్కాలికంగా మ్యాచ్ నిలిపేసిన అంపైర్లు.. పరిస్థితి మెరుగుపడకపోవడంతో నాలుగోరోజు ఆటను ముగిస్తున్నట్లు ప్రకటించారు. తొలి ఇన్నింగ్స్‌లో 322 పరుగులు వెనకబడిన ఆతిథ్య జట్టు ఫాలో ఆన్ ఆడుతోంది. ప్రస్తుతం క్రీజులో ఉస్మాన్ ఖవాజా(4), మార్కస్ హారిస్(2)లు ఉన్నారు. ఆట ముగిసే సమయానికి నాలుగు ఓవర్లకు వికెట్ కోల్పోకుండా ఆసీస్ 6 పరుగులు చేసింది. ఆసీస్‌కు స్వదేశంలో ఫాలో ఆన్ ఆడడం మూడు దశాబ్దాల తర్వాత ఇదే తొలిసారి కావడం గమనార్హం. గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితిని ఆ జట్టు ఎదుర్కోలేదు. 1988లో ఇదే గ్రౌండ్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫాలో ఆన్ ఆడిన ఆసీస్ ఆ తర్వాత ఎప్పుడూ ఇంత ఘోరమైన పరిస్థితిని ఎదుర్కోలేదు. మళ్లీ ఇన్నాళ్లకు కోహ్లీ కారణంగా ఫాలో ఆన్ ఆడుతోంది. ఇక, మ్యాచ్‌కు మరొక్క రోజు సమయం ఉండడంతో భారత్ గెలుపు నల్లేరు మీద నడకేనని చెబుతున్నారు. ఆసీస్‌ను ఊపిరాడనివ్వకుండా చేసి 3–1తో సిరీస్‌ను ఎగరేసుకుపోవాలనేది టీమిండియా వ్యూహం. ఒకవేళ వర్షం పడి మ్యాచ్ ఆగిపోయినా, ఆసీస్ ఆటగాళ్లు క్రీజులో పాతుకుపోయినా మ్యాచ్ డ్రాగా ముగుస్తుంది. అయితే, అప్పుడు కూడా భారత్ 2–1తో సిరీస్‌ను కైవసం చేసుకుంటుంది. ఫలితంగా, ఆసీస్ గడ్డపై సిరీస్ గెలిచిన తొలి భారత కెప్టెన్‌గా కోహ్లీ పేరు రికార్డులకెక్కుతుంది.



ఉత్సాహంగా సాగిన 2కే రన్

- పాల్గొన్న పలవురు సినీనటులు



విజయక్రాంతి, హైదరాబాద్: వైకల్యాన్ని అధిగమించి ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతున్న విభిన్న ప్రతిభావంతులకు ఆర్థిక సహాయం అందించేందుకు వీవ్ మీడియాస్, తత్వా మీడియాస్ కలిసి ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్ 2కే రన్ నిర్వహించారు. కేబీఆర్ పార్క్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని మా అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీరాజా ప్రారంభించారు. అంగవైకల్యంతో ఉన్నవారిని ప్రోత్సాహించేలా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం చాలా అభినందనీయమన్నారు. సమాజంలో అందరిని సమానంగా గుర్తించి, వారి అభివృద్ధికి, ఎదుగుదలకు అందరూ సహకరించాలన్నారు. కొప్పుల వసుంధర చేస్తున్న కృషి చాలా గొప్పదని, ఆమెకు తన వంతు సహకారాన్ని అందించడానికి ఎప్పుడు తాము ముందుంటామని చెప్పారు. వీవ్ మీడియాస్ సీఈవో కొప్పుల వసుంధర మాట్లాడుతూ వివిధ రంగాల్లో కృషి చేస్తున్న 100 మందిని గుర్తించి అవార్డులతో సత్కరిస్తున్నామన్నారు. పదిమందికి ఉపయోగపడేలా చేస్తున్న మంచి కార్యక్రమానికి అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తత్వ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ దేదీప్య విజయ చౌదరి, దామరి ఎస్టేట్స్, సాయి కన్సల్టెన్సీ గోవిందరావు, ప్రముఖ వ్యాపారవేత్త జి.రవికృష్ణ, సినీనటులు ఏడిద శ్రీరామ్, సినీతార సంజన, లతా చౌదరి, యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేందర్ పల్నాటి తదితరులు పాల్గొన్నారు. కేబీఆర్ పార్క్ నుంచి ఫిలిం చాంబర్ వరకు నిర్వహించిన వాక్ లో మొదటి బహుమతి సాధించిన వారికి నగదు బహుమతులు అందజేశారు.

సీఐఎస్ఎఫ్ వాక్‌థాన్



విజయక్రాంతి, హైదరాబాద్: కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం స్వర్ణోత్సవాల సందర్భంగా దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా ఆరోగ్యంపై అవగాహన కలిగించడానికి ఆదివారం ఉదయం వాక్‌థాన్ నిర్వహించారు. నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్‌ప్లాజా వద్ద ఈ రన్‌ను భారత మహిళా క్రికెట్ టీం ఎప్టెన్ మిథాలీ రాజ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నటుడు సుమంత్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత రమేష్, సర్దార్ వల్లభాయ్ పటేల్ పోలీసు అకాడమీ డైరెక్టర్ అంజనీసిన్హా, పురపాలక పట్టణాభివృద్ధి సంస్థ కార్యదర్శి అరవింద్ కుమార్, నగర పోలీసు కమిషనర్ అంజనీ కుమార్, ఐపీఎస్ అధికారులు సీవీ ఆనంద్, టీ. విక్రమ్, ఎమ్ఆర్ నాయక్, శిఖర్ సహాయి, పారిశ్రామిక వేత్త చిగురుపాటి ఉమాదేవి,ఎన్ఎమ్‌డీసీ జనరల్ మేనేజర్ ఎస్. పీ. హిమాన్షు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ వీ. రమేష్, తదితరులు పాల్గొన్నారు. ఈ మెగా ఈవెంటును సర్దార్ వల్లభాయ్ పటేల్ పోలీసు అకాడమీతో పాటు పలు సంస్థలు సహకరించాయి. సీఐఎస్ఎఫ్‌కు చెందిన అనేకమంది భద్రతాదళం అధికారులు పాల్గొన్నారు.



Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal – Malkajgiri District 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD-500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.